
# వ్యాసముక్తావళి

(ఉత్తర హరి వంశ వ్యాస సంకలనం)



డా॥ యం. గోవిందస్వామి నాయుడు

# వ్యాసముక్తావళి

## (ఉత్తర హరి వంశ వ్యాస సంకలనం)

డా॥ యం. గోవింద స్వామి నాయుడు

విష్ణు భావన ప్రచురణలు
169, స్టేట్ బ్యాంక్ కాలని
తిరుపతి - 517 501

# VYASAMUKTAVALI

*(Uttara Harivamsa vyasa Sankalanam)*

By

**Dr. M. Govindaswamy Naidu**

ప్రథమ ముద్రణ . మే, 2002
ప్రతులు : 1000
అన్ని హక్కులు రచయితవి

వెల: రూ. 36 /-


ప్రతులకు:

డా|| (శ్రీమతి) కె చంద్రకళ
169, స్టేట్ బ్యాంక్ కాలని
తిరుపతి - 5ı7 501


విశాలాంధ్ర బుక్ హౌస్,
గాంధీరోడ్
తిరుపతి - 517 501

ముఖ చిత్రాలంకరణ :
ఎ రామచంద్రయ్య

ముద్రణ :
కీర్తి ప్రింటర్స్
103, ప్రకాశం రోడ్,
తిరుపతి - 517 501



This book is
published with the
Financial assistance of
Tirumala Tirupati Devasthams
under their Scheme
**"AID TO PUBLISH RELIGIOUS BOOKS"**



నా ప్రగతిని
కాంక్షించిన
మా మామ
కనుమూరి పార్థసారథి చౌదరిగారి
దివ్యస్మృతికి
అంకితం
ఈ పుస్తకం.

# సహాయపడిన వాళ్లను గురించి......

'వ్యాస ముక్తావళి' అనే ఈ ఉత్తర హరివంశ వ్యాస సంకలన పుస్తక ప్రచురణకు తగిన ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసిన తిరుమల తిరుపతి దేవస్థానం వారికి,

ఆర్థిక సాయం మంజూరు విషయంలో శ్రద్ధ తీసికొన్న మిత్రుడు, శ్రేయోభిలాషి డా|| కె రామక్రిష్ణగారికి,

వ్యాస సంకలనానికి పుస్తక రూపాన్నివ్వడంలో సహాయ పడిన సహృదయ మిత్రుడు డా|| జె. మునింత్నం గారికి,

అడిగిన వెంటనే 'తెలుగులో హరివంశములు' అన్న పుస్తకాన్నిచ్చి సాయం చేసిన గురువర్యులు ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి,

ఇంకా కావలసిన పుస్తకాలను అందజేసిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయ సిబ్బందికి ప్రత్యేకించి వి. షణ్ముగం, ఆర్ వెంకటరెడ్డిగార్లకు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనా సంస్థ గ్రంథాలయ సిబ్బందికి, మిత్రులు డా||యం. మునిరత్నం, డా||సి. గోవిందరాజుగార్లకు,

ముద్రణకు సంబంధించి తగు సూచనలిచ్చిన మిత్రుడు డా|| జి బాలసుబ్రమణ్యం గారికి,

అట్టమీద బొమ్మను అందంగా గీసి ఇచ్చిన చిత్రకారుడు ఎ. రామచంద్రయ్యగారికి,

పుస్తకాన్ని చక్కగా ముద్రించి ఇచ్చిన కీర్తిప్రింటర్స్ (తిరుపతి) వారికి,

ఇంకా ఈ పుస్తక రూపకల్పనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ తమ సహాయ సహకారాలందజేసిన మిత్రులు, ఆప్తులు, శ్రేయోభిలాషులు ఎందరో ..................

అందరికీ నా ధన్యవాదాలు.

*డా|| యం. గోవిందస్వామి నాయుడు.*

# పుస్తకం గురించి....

అది 1974 - 75ల మధ్యకాలం. నేను ఎం.ఏ ఫైనల్ చదువుతున్న రోజులు ప్రీవియస్‌లో లాగే ఫైనల్‌లోకూడా నాలుగు పేపర్లు. ఉండేవి వాటిలో మూడోది ఆప్షనల్ పేపర్. అంటే ఐచ్ఛికాంశం. ఈ ఐచ్ఛికాంశాలలో ప్రత్యేక కవి అధ్యయనం (స్పెషల్ ఆథర్) అనే దొకటి. దీన్ని నేను మూడో పేపరుగా ఎంచుకొన్నాను. 'నాచనసోమన ఉత్తరహరివంశము' ఈ ప్రత్యేక కవి అధ్యయనం కింద పాఠ్యాంశమయింది.

'ప్రత్యేక కవి అధ్యయనం' సాహిత్య విభాగమనీ భాషా విభాగమనీ రెండు భాగాలు. అప్పటి మా అధ్యాపకులయిన ఆచార్య కె. సర్వోత్తమరావుగారు సాహిత్య విభాగాన్ని, ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వపు ఉపాధ్యక్షులు.) భాషా విభాగాన్ని లెస్సగా బోధించారు. అప్పటినుండి నాకు నాచనసోమన ఉత్తరహరివంశంపట్ల అభిమానం అధికమవుతూ వచ్చింది. భిన్నకోణాల నుంచి దాని ప్రాశస్త్యాన్ని, తెలుగు పాఠకలోకానికి తెలియజేయాలనిపించింది. అందుకే 'నాచనసోమన భక్తితత్త్వం', 'నాచనసోమన- అన్నమయ్య' అన్న శీర్షికలతో రెండు పుస్తకాలను ఇదివరకే పాఠకుల కందజేశాను. కొన్ని వ్యాసాల్ని కూడా పత్రికా ముఖంగా అందించాను.

'నాచనసోమన భక్తి తత్త్వం', 'నాచనసోమన-అన్నమయ్య' అనే రెండు పుస్తకాలు ఎక్కువగా రచయిత మీద దృష్టిని కేంద్రీకరించాయి. కవితోబాటు కావ్యానికి సంబంధించిన విభిన్న అంశాలను కూడా పాఠకులకు పరిచయం చేయాలనిపించింది. అందుకే ఇప్పుడు ఈ మూడో పుస్తకం 'వ్యాసముక్తావళి' అనే ఉత్తరహరివంశ వ్యాససంకలనం.

'వ్యాస ముక్తావళి' లో ఉత్తర హరివంశం, సోమనలకు సంబంధించిన 16 వ్యాసాలున్నాయి. వీటిలో కొన్ని ఆచార్య సర్వోత్తమ రావుగారు మాకు విద్యార్థి దశలో బోధించిన విషయంతో కూడుకొన్నవి. ఇంకొన్ని పరీక్షలకోసం నేను స్వయంగా తయారు చేసినవి. మరికొన్ని పరిశోధక విద్యార్థిగా ఉన్నపుడు తయారుచేసి వివిధ పత్రికలలో అచ్చయినవి. వీటన్నిటికీ ముఖ్య ఆకరం

డా|| పి యశోదారెడ్డిగారి 'తెలుగులో హరివంశములు' అన్న పుస్తకం

సోముడంటే చంద్రుడు. ఈయన షోడశ కళాపూర్ణుడు అంటే 16 కళలతో నిండినవాడు సోముని పేరుతో ప్రఖ్యాతి చెందిన వ్యక్తి నాచన సోమన. అందువల్ల ఈయనకు సంబంధించిన వ్యాసాల సంఖ్య కూడా 16గా ఉంటే బాగుంటుందనిపించింది ఉత్తరహరివంశాన్ని గురించి తెలుగు పాఠకులకు ప్రత్యేకించి సాహిత్య విద్యార్థులకు ఒకే సమగ్ర అవగాహన కలిగించాలన్న ఆలోచనతోనే ఈ 16వ్యాసాలను ఒకచోట చేర్చి వాటికి పుస్తకరూపం ఇవ్వడం జరిగింది. సహృదయ పాఠకులందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాను

*డా|| యం. గోవిందస్వామి నాయుడు.*

# ఇందులోని వ్యాసాలు

1. నాచన సోమన కాలం
2. నాచన సోమన రచనలు
3. తెలుగులో హరివంశ కావ్యాలు
4 ఎఱ్ఱన సోమనల హరివంశాలు
5. సోమన అనువాద విధానం
6. ఉత్తర హరివంశం - స్త్రీ పాత్రలు
7. సోమన తీర్చిన జనార్దనుఁడు
8. సోమన నవీన గుణాలు
9. సోమన సాహిత్య రసపోషణ
10. సోమన సంవిధాన చక్రవర్తిత్వం
11. నాచన సోమన శైలి
12. నాచన సోమనపై తిక్కన ప్రభావం
13. నాచన సోమన హరిహర నాథ తత్త్వం
14. నాచన సోమన - అన్నమయ్య
15. తరువాతి కవులపై నాచన సోమన ప్రభావం
16. ఆంధ్రవాఙ్మయంలో నాచన సోమన స్థానం.

# 1. నాచన సోమన కాలం

ఆంధ్రవాఙ్మయంలో కవిత్రయంతో సమానుడుగా, ఒక్కొక్కప్పుడు వాళ్లకంటె అధికుడుగా కీర్తింపబడిన అసమాన శేముషీ దురంధరుడు నాచన సోమన. ఈయన కాలాన్ని గురించి భిన్నాభిప్రాయాలున్నాయి

"కేతనాదులును, నాచన సోమనయు తిక్కనకు సమకాలికులని కొందరు, నాచన సోమన ఎర్రనకు వెనుకటి వాడని మరికొందరు వచించెదరు కాని అందులకు తగిన ఆధారములు లేవ"ని మానవల్లి రామకృష్ణ కవి గారు అభిప్రాయపడ్డారు.

వీరేశలింగం పంతులుగారు తమ ' ఆంధ్ర కవుల చరిత్ర'లో సోమ కవి ఎర్రనకు తరువాతను, శ్రీనాథాదులకు పూర్వం ఉండడం స్పష్టమని పేర్కొన్నారు.

వేలూరి శివరామశాస్త్రి గారు 'సోముడు'అనే గ్రంథంలో 'నాచన సోముని ఉత్తర హరివంశాన్ని చూసి ఎర్రన హరివంశాన్ని రచించి ఉండవచ్చున'ని అభిప్రాయపడ్డారు.

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు ఆంధ్ర పత్రిక దుర్మతి సంవత్సరాది సంచికలో "సోముడు ఎర్రన హరివంశమును చూచి వ్రాసి నాడను భావము నాకింకను కృశింపలేదు. ఎర్రన వృద్ధుడయి సోమన తరుణుడయి సమకాలిక స్పర్ధచే ఎర్రన వ్రాసిన గ్రంథమునే ఇంకను మెరుగుగా వ్రాయవలయునని సోమన పూనినాడని తలచెద"నని రాశారు.

సోమన కాలనిర్ణయానికి ప్రధానంగా రెండు చారిత్రకాధారాలు కనిపిస్తున్నాయి. మొదటిది బుక్కరాయలు మహాకవి నాచనసోమనకు గుత్తి దుర్గంలో గల పెంచుకల దిన్నె అనే గ్రామాన్ని ధారవోసి వేయించిన దానశాసనం. రెండవది సోమన కృతిగా లక్షణ గ్రంథాల్లో ఉదాహరింపబడిన వసంత విలాసమనే గ్రంథానికి కృతపతిగా తెలియవచ్చే మాచయ బ్రహ్మయ కాలం వీళ్లిద్దరిలో బుక్కరాయలు ముఖ్యుడు.

విజయనగర సామ్రాజ్య నిర్మాణానికి కారకులయిన హరిహర, బుక్కరాయలలో బుక్కరాయలే రెండవవాడు. హరిహరరాయలు క్రీ.శ. 1336నుండి క్రీ.శ. 1350 వరకు రాజ్యపాలన చేశాడు. ఆయన అపుత్రుడయి క్రీ.శ. 1350లో మరణించగా సోదరుడయిన బుక్కరాయలు రాజ్యానికధినేతయి క్రీ.శ. 1350 నుండి క్రీ.శ. 1377 వరకు పరిపాలించాడనడానికి పలు

చారిత్రకాధారాలున్నాయి. అలాంటి. రాజన్యుడు విద్యారణ్యకృత విద్యానగరరత్న సింహాసనం మీద ఉండి శ్రీ విరూపాక్షస్వామి సన్నిధిని శాలివాహన శకం 1266తారణ సంవత్సర చైత్ర శుక్ల నవమి నాడు పినాకినీ తటంలో గల పెంచుకలదిన్నె అనే గ్రామాన్ని అష్టాదశ పురాణాల తత్వార్థాన్నెరిగిన వాడు, అష్ట భాషాకవిత్వ శ్రీమహితుడు, నాచనకుమారుడు అయిన సోమనకు ధారాదత్తం గావించాడు ఇలా గ్రహించిన గ్రామాన్ని 110 భాగాలుగా చేసి అందు 36 భాగాలను తాను గ్రహించి తక్కిన భాగాలను ఆయాబ్రాహ్మణులకు వేర్వేరుగా సోమన రాయించి ఇచ్చినట్టు ఆధారాలున్నాయి కానీ ఈ మహాకవి కాల నిర్ణయానికి పనికి వచ్చే దానశాసనంలో కాలాన్ని తెలియజేసేచోటనే అక్షరాలు సరిగా కనిపించడం లేదు కాబట్టి పండితులు విభిన్నరీతులుగా పఠించి సోమన కాలనిర్ణయం చేశారు. సోమన కాలానికి ముఖ్యంగా నాలుగు స్థితులేర్పడ్డాయి

1. రసభూనయనేందుభిః:- 6121 'అఙ్కానాం వామతోగతిః'అనడాన్ని బట్టి శాలివాహన శకమవుతుంది 1216 శాలివాహన శకానికి 78 కలిపితే క్రీస్తుశకమవుతుంది. కాబట్టి 1216+78=క్రీ.శ. 1294
2. రసాభ్రనయనేందుభిః- 6021 - శాలివాహన శకం 1206. క్రీ.శ. 1284.
3. గరాజనయనేందుభిః- 2921 - శాలివాహన శకం 1292. క్రీ.శ. 1370.
4. రసర్తు నయనేందుభిః- 6621 - శాలివాహన శకం 1266. క్రీ.శ. 1344.

**1. రసభూనయనేందుభి** :- 6121. శాలివాహన శకం. 1216. క్రీ.శ.1294. రైసుదొర గారు - ``This is given as the Saka year Rasabhunayana Indu - 1216 the year Tarana but this does not fall with in Bukka's reign during which there was no Tarana"అని స్వయంగా రాశారు. పై కాలం బుక్కరాయల రాజ్యకాలం నాటిదిగాదు. ఆకాలంలో బుక్కరాయలు రాజ్యం చేయకుండడమే గాక అప్పటికతడు పుట్టి కూడా ఉండడు. రాజ్యపాలన చేస్తున్న సమయంలో గ్రామాన్ని, దానమిచ్చినట్టు పై శాసనం పేర్కొంటూ ఉంది. ఆయన రాజ్యారంభ సంవత్సరం మన్మథ. అంత్య సంవత్సరం నల. ఈ మధ్యకాలంలో తారణసంవత్సరం లేనేలేదు. కాబట్టి రసభూనయనేందుభిః అనే పాఠం పూర్తిగా లేఖక ప్రమాదం.

**2. రసాభ్రనయనేందుభిః** :- 6021 శాలివాహన శకం 1206 క్రీ.శ 1284. ఈ పాఠాన్ననుసరించి తారణ సంవత్సరం సరిపోతూ ఉంది కానీ హరిహరుడు శ్రీ విద్యారణ్య శ్రీపాదుల ఆజ్ఞానుసారంగా క్రీ.శ. 1336 ఎప్రిల్ 18న తేదిన (ధాతృ నామ సంవత్సరం వైశాఖ శుక్ల సప్తమి సింహలగ్నంలో) పురనిర్మాణం గావించాడని కావలూరు శాసనం ఋజువు చేస్తున్నది. ఇంతేగాక హరిహరుని రాజ్యకాలంలో వేయించిన దాన శాసనాల్లో మొదటిది శాలివాహన శకం 1346వ సంవత్సరంలోనూ చివరిది క్రీ.శ. 1355వ సంవత్సరం నవంబరు 20వ తేది నాటిది గానూ కానవస్తున్నాయి. రెండవ హరిహరరాయలు శివసాయుజ్యం పొందిన తన తండ్రి బుక్కరాయల పుణ్యం కోసం క్రీ.శ 1377 వ సం||ఫిబ్రవరి 24వ తారీఖున దానం చేసి శాసనాన్ని వేయించాడు సంగమ రాజపుత్రులు, (హరిహర, కంప, బుక్కరాయ, మారప, ముద్దప లయిదుగురు) బల్లప్పదండనాయకుడు, కుమార శ్యామన్నలు తమ దిగ్విజయ జ్ఞాపకార్థం క్రీ.శ. 1346 వ సం|| శృంగేరి పీఠాదిపతి భారతీతీర్థ శ్రీ పాదుల వారికి దానం చేసినట్టు ఆధారాలున్నాయి. విద్యానగర నిర్మాణంలో గానీ సంగముని పుత్రులలో ఎవరుగానీ వేయించిన దాన శాసనాలు క్రీ.శ. 1280-1290 గా పొరపాటుగానైనా పేర్కొబడలేదు. కాబట్టి ఈ పాఠం కూడా ప్రమాదజనితమే అవుతుంది.

**3. కరాజనయనేందుభిః** :- 2921 శాలివాహన శకం 1292. క్రీ.శ. 1370 ఇది పండితులు సృష్టించిన పాఠమే గానీ నిజమైన దాన శాసన పాఠం కాదు. బుక్కరాయలు క్రీ.శ. 1355-1377ల మధ్య విద్యానగర సింహాసనాన్ని అధిష్ఠించాడనడానికి ఆధారాలున్నాయి. దీని కనుగుణంగా శాసనపాఠం మార్పు చేయబడింది. కానీ మార్పు చేయబడినా సంవత్సరం మాత్రం తారణ కాలేదు. బుక్కరాయల పరిపాలనా కాలంలో తారణ సంవత్సరం రావడం లేదు కాబట్టి తారణకు దరిదాపుల నుండు సాధారణ నామ సంవత్సరం తీసికోబడింది. మూలానికి పుత్రికలను రాసేటపుడు గానీ, శాసనకారుని శ్లోకాలను చెక్కేటపుడు గానీ ప్రమాదాలు దొర్లితే ఏదో ఒక అక్షరం తొలగవచ్చుగానీ అతి ప్రధానమయిన సంవత్సర నామం పొరపాటుగా చెక్కబడడం అసంభవం ఇంకా పై శాసనంలో పూర్వార్థాన్ని, ద్వితీయార్థాన్ని రెంటినీ మార్చడం అసంగతంగా ఉంది.

**4. రసర్తునయనేందుభిః** :- 6621 శాలివాహన శకం 1266 క్రీ శ 1344 దాన శాసనంలో అక్షరాలు సరిగా తెలియరాకుండడం వల్ల ఏర్పడిన పాఠభేదాలన్నిటికంటె సమంజసంగా ఉండేటట్టు వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఈ పాఠాన్ని సవరించి ప్రకటించారు. నాగరలిపిలో (భూ - భ - ర్తు అనే అక్షరాలు దాదాపు ఒకే తీరుగా ఉంటాయి. బుక్కరాయల శాసనంలో చెప్పబడిన తారణ సంవత్సరం శాలివాహన శకం 1266 అవుతున్నది అంటే క్రీ. శ. 1344. ఈ సంవత్సరం నాటికి బుక్కరాయలు రాజ్యానికి రాలేదు. అలాంటప్పుడు ఆయన విద్యానగర రత్న సింహాసనాన్నుండి దానమెలా చెయ్యగలిగాడనే వాదం ఉంది. ఎపిగ్రాఫియా కర్ణాటిక 5వ సంపుటం హాసన్ జిల్లా చెన్నరాయ పట్టణం (256 సంఖ్య గలది)శాసనంలో హరిహరరాయలు రాజుగా ఉన్నా, వాస్తవానికి విద్యానగరాన్ని, నిర్మింపజేసినవాడు, నామకరణం చేసిన వాడు బుక్కరాయలని ఉంది. అగ్రజుడయిన హరిహరరాయలు రాజుగా ఉన్నా సర్వ సమర్థుడయిన తమ్ముడు బుక్కరాయలు యువరాజుగా ఉండడం వల్ల దాన శాసనాన్ని ఇలా వెలయింప జేయడం ఆక్షేపణీయం కాదు. ఈ వాదాన్ని వేలూరి శివరామ శాస్త్రి గారు, టేకుమళ్ల అచ్యుతరావు గారు, చాగంటి శేషయ్య గారు బలపరచారు.

ఇక నాచన సోముని కాలానికి ఉపయుక్తమయ్యే రెండో ఆధారం మాచయ బ్రహ్మయ కాలం. సోమన ఉత్తరహరివంశాన్నే గాక వసంత విలాసమనే గ్రంథాన్ని కూడా రచించినట్టు లక్షణకారులుదాహరించిన పద్యాలను బట్టి తెలుస్తున్నది. ఆ వసంత విలాస కృతపతి మాచయ బ్రహ్మయ. వసంతవిలాసంలో మొదటి పద్యమిది అని మానవల్లి రామకృష్ణకవిగారు ఉదాహరించినట్టు వేటూరి ప్రభాకర శాస్త్రి గారు "చాటుపద్య మణి మంజరి"లో రాజప్రశంసాస్తబకంలో చేర్చారు.

"శ్రీ చన్నుంగవ క్రేవగ్రొమ్మెఱుగులన్ శృంగార పుందోటకున్
బ్రాచీనంబగుచున్న వింశతి నఖప్రౌఢిన్ సుఖాంబోధి వే
లాచంద్రోదయమైనదేవుడు కృపాలంకార చిత్తంబునన్
జూచున్ మాచయ బ్రహ్మధీమణి గవిస్తోమైక చింతామణిన్"

అనే ఈ పద్యాన్ని బట్టి వసంత విలాస కృతపతి మాచయబ్రహ్మ అని తెలుస్తున్నది.

మానవల్లివారు మాచయబ్రహ్మ అనే అతడు బ్రాహ్మణ సర్దారుడనీ ఆయనకాలం క్రీ.శ. 1330 అనీ తెలియజేశారు వేటూరి వారు కూడా పలనాడు తాలూకాలో కారెంపూడి గ్రామంలో మాచయబ్రహ్మ దాన శాసనాలను చూసినట్టు ఉత్తరహరివంశ పీఠికలో రాశారు. చాగంటి శేషయ్య గారు క్రీ.శ. 1304 నాటి మాచయ బ్రహ్మ శాసనాలున్నాయనీ మాచయగారి బ్రహ్మయ అని భావిస్తే ఈ కాలం సరిపోతుందనీ తలచారు కాబట్టి మాచయ క్రీ.శ. 1304 వ సం||నాటి వాడుకాగా ఆయన పుత్రుడు బ్రహ్మయ క్రీ.శ. 1330 - 1335 కాలం వాడు కావచ్చు. ఆ కాలంలో నాచనసోమన వసంత విలాస గ్రంథాన్ని బ్రహ్మయకు కృతినిచ్చి ఉండవచ్చునని శేషయ్యగారు తెలియజేశారు.

**గ్రంథాధారాలు**: దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డిగారు గ్రంథాధారాలను బట్టి నాచనసోమన కాలనిర్ణయం గావించారు. ఉత్తర హరివంశ ప్రథమాశ్వాసంలో 'రచిత సమకాల బాహు విక్రమము చేత (1-26) అనే పద్యపాదముంది రచిత అంటే రచింపబడింది. సమ -2, కాల -6 బాహు - 2, విక్రమ -1 అంటే 2621. వామగతిని 1262 దీనికి సరయిన కాలం క్రీ.శ. 1340. * (1262+78) ఇలాంటి గూఢకాలం రేనాటి చోళుల శాసనాల్లో ఉందని రెడ్డిగారు తెలియజేశారు.

పై ఆధారాలన్నిటినీ బట్టి చూస్తే నాచనసోమన క్రీ.శ. 1285 ప్రాంతంలో జన్మించి క్రీ. శ. 1355 ప్రాంతం వరకు జీవించాడనీ క్రీ. శ. 1310 - 1340 వరకు గ్రంథకర్తగా ఉండి క్రీ.శ. 1344 నాటికి పలుగ్రంథాలు రచించి మహాకవివర్యుడుగా గణుతికెక్కాడని చెప్పవచ్చు. అంటే సోమన ఎర్రన కంటె ప్రాచీనుడు కాడు. సమకాలం వాడు కానీ కాస్త తరువాతి వాడు కానీ కావచ్చు.

★★★

# 2. నాచనసోమన రచనలు

నాచన సోమన ఉత్తర హరివంశాన్నే గాక హరివిలాసం, వసంత విలాసం, ఆది పురాణం, హర విలాసం అనే గ్రంథాలను కూడా రచించాడని విమర్శకుల తలపు. ఈ గ్రంథాల్లో ఉత్తర హరివంశం తప్ప తక్కిన గ్రంథాలేవీ కానరావడం లేదు. కానీ లాక్షణికులు నిర్దిష్ట గ్రంథాల్లోనివిగా పద్యాలనుదాహరించడం వల్ల వాటిని సోమన రచనలుగా భావింపవలసి ఉంది.

**1. ఉత్తర హరి వంశం :-** సోమన ఆశ్వాసాంత గద్యలో "శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనా మాత్య పుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహాభారత కథానంతరంబున శ్రీ మత్సకల భాషాభూషణ, సాహిత్యరస పోషణ సంవిధాన చక్రవర్తి సంపూర్ణ కీర్తి నవీన గుణసనాథ నాచన సోమనాథ ప్రణీతంబయిన ఉత్తరహరివంశము నందు" అని పేర్కొన్నాడు. ఈ మహాకవి పూర్వ హరివంశాన్ని రచించాడని కొందరు, ప్రబంధ దృష్టితో హరిహరాద్వైత ప్రతిపాదక కథల్ని మాత్రమే గ్రహించి ఉత్తర హరివంశాన్ని మాత్రమే సంతరించాడని మరి కొందరు ఊహించారు. అవతారికా భాగం లేకున్నా ఆశ్వాసాది పద్యం సుకవి స్తుత్యాత్మకమై దైవ ప్రార్థనా కలితమై కథా సూచకమై ఉండడం గమనింపదగింది. "హరివంశ ప్రథమ కథాంతరమున గల వింతలెల్ల దప్పక మదిలో దిరమయ్యెగదా"!, (1-3)"బలదేవు లావు మును విని మఱియుందనియదు ", (1-4) వంటి పద్యాలకు మూలశ్లోకాలుండడం వల్ల సోమన పూర్వహరివంశాన్ని రచించాడనడానికి తగిన ఆధారం లేకపోతూ ఉంది. కాబట్టి ఈ మహాకవి ఉత్తర హరివంశాన్ని మాత్రమే రచించాడనడం సమంజసం.

**2. ఆది పురాణం :** ప్రసిద్ధ లాక్షణికుడయిన అప్పకవి తన అప్పకవీయ తృతీయాశ్వాసంలో వికల్ప విరమణానికి ఉదాహరణగా ఆది పురాణంలోనిదిగా ఈ పద్యాన్ని పేర్కొన్నాడు.

మ." ఒకనాడిందు ధరుండు పార్వతియు లీలోద్యాన కేళీ సరి
న్నికటానేక వనప్రదేశములదైతే యేంద్ర కన్యాప్స రో
నికురుంబంబులు పారిజాత కుసుమానీకంబుపై జల్లద
ర్పక బాణంబుల కెల్ల నెల్లయగు సౌభాగ్యంబు శోభిల్లగాన్."

అప్పకవి కర్త పేరు తెలియజేయక ఆదిపురాణమని చెప్పి ఉండడం గుర్తింపదగింది కానీ ఈ పద్యం కొద్ది మార్పులతో ఉత్తరహరివంశంలో కానవస్తున్నది. కాబట్టి ఉత్తర హరివంశానికి ఆదిపురాణమనే పేరుందా? లేక రెండు గ్రంథాల్లో ఒకే పద్యం ప్రయుక్తమయిందా? అని వేలూరి శివరామశాస్త్రి గారు సందేహించారు. అయినా ఉత్తర హరివంశానికి ఆదిపురాణమనే పేరున్నట్టు ఎవరూ చెప్పలేదు. కాబట్టి ఆదిపురాణ మనేది ప్రత్యేక గ్రంథం కావచ్చు. కన్నడ సాహిత్యంలో ఆదిపురాణం ప్రఖ్యాతం. ఆది తీర్థంకరుడయిన వృషభనాథుడు, ఆయన కుమారుడయిన భరత బాహుబలి కథలిందున్నాయి అది పంపవిరచితం. అష్ట భాషాకవిత్వ విశారదుడయిన సోమన కన్నడ గ్రంథమయిన పంపని ఆదిపురాణాన్ని గ్రహించి గానీ లేక ఇంకొక గ్రంథ మాధారంగా గానీ ఆదిపురాణాన్ని రచించి ఉండవచ్చు. అప్పకవి కాలం నాటికి తెలుగులో ఒక్కటే ఆదిపురాణం ఉండడం వల్ల కర్త పేరు చెప్పలేదని భావింపవలసి ఉంది.

**3. వసంత విలాసం :** అప్పకవి ముకారయతులను గురించి చెప్తూ వసంత విలాసం లోనిదని -

కం "అత్తఱి విట నాగరకులు

చిత్తమున వసంతకేళి చిగురొత్తంగా

మొత్తములు గట్టి తెచ్చిరి

ముత్తెపు ఝల్లరులతోడి బుఱ్ఱట కొమ్ముల్" అనే పద్యాన్ని ఉదాహరించాడు. ఈ పద్యాన్నే గ్రహించి కూచిమంచి తిమ్మకవి సర్వ లక్షణ సార సంగ్రహంలో చక్కటి వడులకుదాహరణగా ఇచ్చారు. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ప్రబంధరత్నావళిలో వసంత విలాసంలోనిదని "ప్రాలేపయతి సీర సేన పఱపన్............హేమంత సామంత మై" అనే పద్యాన్ని పేర్కొని ఉన్నారు. ఇలాగే 'చాటుపద్యమణి మంజరి' రాజప్రశంసా స్తబకంలో -

ఉ." శ్రీ చన్నుం గవత్రేవ గ్రొమ్మెఱుగుల్గా శృంగారపుం దోటకున్
బ్రాచీనంబగుచున్న వింశతి నఖప్రౌఢిన్ సుఖాంబోధి వే
లా చంద్రోదయ మైనదేవుడు కృపాలంకార చిత్తంబునన్
జూచుచు మాచయ బ్రహ్మధీమణి ౘగవిస్తోమైక చింతామణిన్"

అనే పద్యాన్ని చేర్చి ఉన్నారు. చాగంటి శేషయ్య గారు 'వితాళ చౌపదమ'నే పేరుతో సోమన పద్యంగా -

"వీణాగానము వెన్నెల తేట

రాణ మీఱగా రమణుల పాట

ప్రాణమైన పిన బ్రాహ్మణు వీట

జాణలు మెత్తురు జాజర పాట" అన్న పద్యాన్ని పేర్కొన్నారు. మాచయ బ్రహ్మధీమణిని గురించిన ఇంకొక చాటువు కుడా కనిపిస్తూ ఉంది "కమలంబునకు పుట్టి కమలంబు చుట్టమై కమలంబు తన నాభికాంచి గాక" అనే 'చాటు పద్యమణి మంజరి'(రాజ ప్రశంసాస్తబకం )లోని పద్యం వసంత విలాసం లోనిది గావచ్చు.

**4. హరివిలాసం :** కూచిమంచి తిమ్మకవి సర్వ లక్షణసార సంగ్రహంలో అచ్చతెనుగు దేశ్య విభాగంలో 'లంజె' శబ్దాని కుదాహరణగా ఒక పద్యాన్ని పేర్కొని అది సోమన హరివంశం లోనిదని తెలియజేశాడు. పొల్లుచెడి బిందువు కావడానికి ఉదాహరణగా -

కం" అంజెదవు గాకననుఁ జెం

తం జేరగనీక నెంత తగ్గిన మిరియా

లుం జొన్నలు సరిగానే

లంజెతనములందు కొమరులన్ గెలవనొకొ !" అన్న పద్యం ఉదాహరింపబడింది. ఈ పద్యం హరివంశంలో కనిపించదు. ఇవి స్త్రీ చే తృణీకరింపబడిన వయసు మీరిన పురుషుడెవ్వడో పలికిన పలుకులనీ ఈ పద్యం వసంత విలాసం లోనిది కావచ్చునని డా||(శ్రీమతి) యశోదా రెడ్డి గారభిప్రాయపడ్డారు.

శ్రీ మదోగిరాల జగన్నాథ కవిగారు సుమనోభిరంజన కావ్య వ్యాఖ్యానంలో- 'శతతాళ దఘ్న హ్రదమున నుఱికెన్ ' అన్న పద్య పాదాన్ని ఉదాహరించి ఉన్నారు. ఈ పద్యమాధారంగా సోమన పూర్వ హరివంశాన్ని రచించాడని నడకుదుటి వీర రాజు పంతులు గారు భావించారు. కానీ కాళీయ హ్రదం చొరబారడానికి వీలు లేని ఆగాధమయిన లోతు కలిగింది ఇంకా కాళీయాది సర్పాల కారణంగా భయంకరమైంది. అంతేగాక ఈ పద్యానికి మూలమనదగిన

'విసిపత్యప్రదే ఘోరే' అనే శ్లోకం సంస్కృత హరివంశంలో ఉండడం వల్ల సోమన శ్రీకృష్ణ లీలల్ని తెలియజేసే హరివిలాసమనే కావ్యాన్ని ఒకదాన్ని రచించి ఆపై రసవత్తరాలయిన కథలు గల ఉత్తర హరి వంశాన్ని రచించి ఉండవచ్చునని డా॥ (శ్రీమతి) యశోదారెడ్డి గారు భావించారు. ఇలాగే ప్రబంధమణి భూషణంలోని "పురుడు పుచ్చిన నాడ పూతనామోతన స్తన్య జీవితములు చవులు సూచె" అనే పద్యం హరివిలాసం లోనిది గావచ్చు సంస్కృత హరి వంశంలో ఈ పద్యానికి మూలమనదగిన శ్లోకం కనిపించదు. అంతే గాక కథా భాగానికి కూడా అతకడం లేదు. అంటే అక్రూరుడు బలరామకృష్ణుల్ని మధురకు కొనివచ్చే నాటికి కృష్ణుడింకా పాంచాలి మాన సంరక్షణం చేయలేదనడం స్పష్టం. కానీ పై పద్యంలో పాంచాలి మాస సంరక్షణ చేయబడినట్టుంది. కాబట్టి సోమన హరివిలాసమనే పేరుతో ఒక గ్రంథాన్ని రచించి ఉండవచ్చునని చెప్పవచ్చు.

**5. హరవిలాసం :** కస్తూరి రంగకవి ఆనందరంగరాట్ఛందంలో ఆయా లక్షణాలకు లక్ష్యాలుగా సోముని హరి విలాసం నుండి నాలుగు పద్యాల్ని ఉదాహరిచాడు.

కం "జయ విజయ వినుత జన్యా
వ్యయ దూరానంద రూప భాసుర దత్తా
భయ హరి హర ముఖ నిర్జర
నయనన్న క్షత్ర యూధ నళినీ నాథా!"
(ఆనంద రంగరాట్ఛందం -అపి అనే ఉపసర్గకు. పుట 115)

కం "శంబర వైరి విభంజన
సాంబ శివాయంధక ప్రశాసక గజచ
ర్మాంబరధర యని నీదుప
దంబులు పూజించువాడు ధన్యుడు సుమ్మీ !"
(ఆనంద రంగ రాట్ఛందం - ప్రాదియతికి. పుట 100)

కం. "జయ మగుటకు నీ మది స
మ్మయ మేటికి వినుమనుచు సముంచిత కరుణా

లయుడగు మునీంద్రుడెంతయు

బ్రియముగ మంత్రంబు జెప్పె నృపతికి నెలమిన్"

(ఆనంద రంగ రాట్ఛందం -ముకారయతికి. పుట 98)

కం. "మౌని తిలక ! సజ్జన సం

తాన మహీరుహ! భవత్సుధాలాపము నా

వీనులకు విందొనర్చెన్

మేనున గల తాప మణచె మృషగాదు సుమీ!"

(ఆనందరంగరాట్ఛందం -హల్లుకు. పుట 117)

పై పద్యాలను పరిశీలిస్తే అవి హర సంబంధాలుగా కనిపిస్తున్నాయి. ఛందం కందం కావడం గుర్తింపదగింది. ఈ పద్యాలు వరుసగా ఉన్నాయో లేక ఉదాహరణ కోసం ఆయా భాగాల్లో నుండి ఏర్చి కూర్చినవో తెలియదు. ఉత్తర హరివంశానికి ముందు ఈ గ్రంథాన్ని సోమన రచించి ఉండవచ్చు. కస్తూరి రంగకవి పొరపాటుగా హరవిలాసమనడానికి బదులు హరి విలాసమని పేర్కొని ఉండవచ్చు.

మానవల్లి రామకృష్ణ కవి గారు - " There is a work called Natya Chudamani in Sanskrit whose subject matter is really interesting and an improvement over all the available works on music till the 14th century. The work was written by Somanarya who was called Ashtavadhani one may be tempted to identify the author with Nachana Somana. There is another work called campu Ramayana which we secured a copy in Malabar. I am tempted to doubt that the author of that work is our Somanatha, himself" - అని పేర్కొన్నారు.

కానీ అష్టావధాని ప్రఖ్యాతి నాచనసోమనకు లేదు. ఆయన అష్ట భాషా కవిత్వ శ్రీవిలసితుడు. అదీ గాక సోమన సోమనార్యుడుగా ఎక్కడా పేర్కొబడలేదు. అందువల్ల సంస్కృత నాట్య చూడామణి సోమన కృతం కాకపోవచ్చు. లభించిన ఉపపత్తుల్ని బట్టి ఉత్తర హరివంశం, వసంత విలాసం, హరివిలాసం, ఆదిపురాణం, హర విలాసం అనేవి సోమన రచనలని తెలుస్తుంది.

★★★

# 3. తెలుగులో హరివంశ కావ్యాలు

భారతానికి ఖిల పర్వంగా ప్రసిద్ధి పొందిన భాగం హరివంశం ఈ గ్రంథ ప్రాశస్త్యాన్ని గురించి వ్యాస భగవానుడు -

" అసత్ప్రబంధ కాంతార పరివర్తన పాంశులామ్

వాచం శౌరి కథాలాప గంగయైవ పునీ మహే" అని ప్రవచించి ఉన్నారు.

ఆంధ్ర సాహిత్యంలో భారత రచనానంతరం హరివంశ రచన సాగడం విశేషం. తెలుగులో పలు హరివంశాలు వెలసి ఉన్నాయి.

**1. చంపూ హరివంశాలు** : కవిత్రయంలో ఒకడయిన ఎర్రన క్రీ.శ 1325-1353ల మధ్య హరివంశాన్ని రచించి ప్రోలయ వేమారెడ్డి కంకితమిచ్చాడు సంస్కృతంలో హరివంశం హరివంశ పర్వ, విష్ణు పర్వ, భవిష్య పర్వాలనే మూడు పర్వాలతో కూడి ఉండగా అలాంటి విభాగాన్ని పాటింపక ఎర్రన పూర్వభాగమని ఉత్తర భాగమని విభజించాడు. పూర్వభాగం తొమ్మిది ఆశ్వాసాలుగా, ఉత్తర భాగం పది ఆశ్వాసాలుగా ఉన్నాయి. మూలాన్ని కొన్ని చోట్ల యథాతథంగా అనువదించడం, సంక్షేపం గావించడం, విపులీకరించడం, విభక్తాలయి వ్యవహితాలుగా పలుచోట్ల కనిపించే కథాంశాల నొక్కచోట కూర్చడం వంటి పద్ధతుల ననుసరించి ఎర్రన రచన సాగింది.

హరివంశాన్ని తెనిగించిన వాళ్లలో రెండవ వాడు నాచనసోమన . మూలంలోని రసవత్తర ఘట్టాలను మాత్రమే గ్రహించి ఉత్తర హరి వంశమన్న పేరుతో సోమన కావ్య రచన చేశాడు. సోమన కాలాన్ని గురించి భిన్నాభిప్రాయాలున్నా క్రీ. శ. 1344 నాటి వాడనే వాదానికి ఎక్కువ ప్రచారముంది. సోమన గ్రంథంలో ఆరాశ్వాసాలున్నాయి. ఆయన తిక్కన ఛాయలో రచన సాగిస్తూ ఆ మహాకవిని సంస్మరిస్తూ హరిహరనాథుని కంకిత మివ్వడం విశేషం.

గూళకల్లు వేంకట రమణ కవి హరివంశాన్ని రచించినట్టు తెలుస్తుంది. ఈతని ఇంకొక కృతి అయిన 'కనకరంజిత శిఖామణీ పరిణయం'లో వేంకటేశ్వరుడు ప్రత్యక్షమై - " మా పేరు గొన్న వేంకట రమణుడవు, సత్కవివి, మాకు మునుపు హరివంశమునంతయు తెనుగు జేసి యంకిత మొనర్చితివి" అని చెప్పినట్టు తెలియజేసి ఉండడం వల్ల ఈయన హరివంశాన్ని పూర్తిగా రచించాడనవచ్చు. కానీ ఈయన గ్రంథం అలభ్యం. ఈ కవి

రామలింగనార్యుని, తిమ్మనార్యుని నుతించడం వల్ల క్రీ.శ. 1600 ప్రాంతం వాడని తెలుస్తుంది.

తాళ్లపాక వంశానికి చెందిన తాళ్లపాక పెద తిరుమలయ్య హరివంశాన్ని రచించాడనడానికి ఆధారాలు కనిపిస్తున్నాయి ఈతని కుమారుడయిన తాళ్లపాక చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో కవి వంశావళి విభాగంలో "ద్విపద రూపమున హరివంశ కావ్యము ఆయత రస స్ఫూర్తి హరి వంశ మిగు రొత్త నన్వొందజేసి " అని పేర్కొన్నాడు. ఈ గ్రంథం ఇప్పుడు కేవలం నామ మాత్రావశిష్టం. ఈయన కాలం క్రీ. శ. 1460-1546 అని చెప్పవచ్చు.

నేమాని భైరవ కవి కోటగిరి వంశానికి చెందిన శ్రీనివాస భూవరుని కోరిక మీద హరివంశాన్ని, రచించాడు. ఆ భూపతి హరి వంశ కథాశ్రవణైక చిత్తుడై పారిజాతాపహరణాది కథావళి ఎర్రన రచనలో లేకుండడాన్ని గుర్తించి- " ఈ కథల నీవు తెనిగింపు మింపు మీర ప్రకటనేమాని భైరవ సుకవి చంద్ర" అని కోరగా భైరవి కవి గ్రంథ రచనకుపక్రమించినట్లు తెలుస్తుంది. ఆశ్వాసాంత గద్యలో "శ్రీమత్కల్యాణ గౌరీ చరణ షట్పదాయమాన మానసుడని "పేర్కొన్నాడు. ఈతని హరి వంశం మూడాశ్వాసాల ప్రబంధం. ఈయన ప్రథమ, ద్వితీయ, తృతీయా శ్వాసాలనే పేరుతో గాక ఉత్తర భాగం పంచమ, షష్ఠ సప్తమాశ్వాస-లని పేర్కొన్నాడు. ఇలా రాయడానికి గల కారణాన్ని తెలిసికోవలసి ఉంది. నేమాని భైరవ కవి ఎర్రన మీద అత్యంత గౌరవం గలవాడు. ఇతడు తెనిగించిన పారిజాతనిబంధన, అంధకాసుర సంహారాది వృత్తాంతాలు ఎర్రన ఉత్తర భాగం నాలుగో ఆశ్వాసం తరువాత చెప్పబడాలి. కాబట్టి తన గ్రంథంలో ప్రథమ ద్వితీయ తృతీయా శ్వాసాలనక పంచమ, షష్ఠ, సప్తమాశ్వాసాలని పేరు పెట్టినట్లు డా || (శ్రీమతి) యశోదా రెడ్డిగారు భావించారు.

ఆధునికులయిన మల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారు ఆంధ్ర భవిష్య పర్వమనే పేరుతో ఒక గ్రంథాన్ని రాసి ఉన్నారు. ఇది ఆరాశ్వాసాల ప్రబంధం. ఈయన పరమ పురుషార్థానికి ఆలవాలమయిన గ్రంథమేదైనా తెనిగించాలని సంకల్పించుకొని అట్టి దానినన్వేషిస్తూ చివరకు మహాభారతమనే పంచమ వేదానికి ఉపనిషత్తనబడే హరివంశంలో ఆమూలాగ్రమవలోకించి భవిష్యపర్వాన్ని రచింప సమకట్టి నట్టు గ్రంథావతారికను బట్టి స్పష్టమవుతుంది. ఆశ్వాసాంత గద్యలను ఏక ముఖంగా సాగింపక వివిధ వృత్తాంతాలను పొందుపరచడం మల్లాది వారి నవ్యత.

విశ్వనాధ నరసింహకవి గారు బాల్యమిత్రుడు, సదాచార సంపన్నుడు కవి సత్తముడు అయిన పతంజలి శాస్త్రి ప్రేరణతో హరివంశ రచనను సాగించినట్టు తెలుస్తుంది. ఈ గ్రంథంలో ప్రథమ భాగం మాత్రమే ముద్రితం. అది సప్తాశ్వాస పూర్ణం.

**2. వచన హరివంశాలు :** ఎస్. నరసింహాచార్యులు గారు, కొమాండూరు వేంకట రామానుజ శర్మగారు వాగ్వల్లి పత్రికలో హరివంశాన్ని ప్రకటించారు. ఇందు వచనమే గాక అక్కడక్కడ కొన్ని పద్యాలు కూడా చేర్చబడ్డాయి. శ్రీహరి వంశమన్నే పేరుతో ఏలూరిపాటి లక్ష్మి సరస్వతి అనే ఆమె పర్వత్రయ సహితంగా ఒక వచన హరి వంశాన్ని రచించింది. గోవిందలూరి సాంబశివయ్యి గారు ఆంధ్ర వార పత్రికలో వచన హరి వంశమనే పేరుతో కొంత భాగాన్ని ప్రకటించారు. పిలకా గణపతి శాస్త్రి గారు'ఆంధ్ర పత్రిక'లో ఆదివారం సంచికకను బంధంగా హరివంశాన్ని పూర్తిగా ప్రకటించారు.

**3. హరివంశాధార రచనలు :** హరివంశమనే పేర్లతో కనిపించే గ్రంథాలివే. కానీ హరివంశాన్ని ఆధారంగా చేసికొని ఆ గ్రంథంలోని కొన్ని భాగాల కనువాదాలుగా వెలసిన గ్రంథాల సంఖ్యాకాలు. హరివంశంలోని కథల్లో పారిజాతాపహరణ వృత్తాంతం, ప్రభావతీ ప్రద్యుమ్నుల చరిత్ర, ఉషానిరుద్ధుల ప్రణయ గాథలు చాలా ప్రసిద్ధి పొందాయి. ఈ కథల నాధారంగా పద్య కావ్యాలు, ద్విపదలు, యక్షగానాలు, నాటకాలు వెలశాయి. అవి అన్నీ హరివంశ వాఙ్మయంలోనే చేర్తాయి.

**3.1 పారిజాతాపహరణం**: మూల హరివంశంలో విష్ణుపర్వం 65వ అధ్యాయం నుండి 76వ అధ్యాయం వరకు సాగిన వృత్తాంతం పారిజాతాపహరణం. ఈ కథనాధారంగా చేసికొని నంది తిమ్మన పారిజాతాపహరణ కావ్యాన్ని రచించి రాయల కంకితమిచ్చారు. ఇది అయిదాశ్వాసాలప్రబంధం. కృష్ణదేవరాయల ఆస్థానంలోని కవికావడం వల్ల ఈయన క్రీ.శ.16వ శతాబ్దం పూర్వార్థంలో ఉన్నాడనడం స్పష్టం. ఈయన కవిత్వానికి మాధుర్యమే ప్రాణం. ఇలాగే కృష్ణాధ్వరి పండితుడు నైషధ పారిజాతీయమనేద్వ్యర్థి కావ్యాన్ని రచించి రఘునాథరాయల కంకిత మిచ్చారు. ఇంకా లింగనమఖి కామేశ్వర కవి శృంగార సత్యభామా సాంత్వనమనే పేరుతో కావ్యరచన గావించి మధుర నాయకుడయిన చొక్కనాథనాయకుని సవతి తల్లి లింగాంబ కుమారుడయిన ముద్దళగిరి కంకితమిచ్చారు. ఈ వృత్తాంతం యక్షగాన రూపంలో విపుల ప్రచారం పొందింది. ఈ రచనలు

పారిజాతాపహరణ వృత్తాంతాన్ని ఇతి వృత్తంగా కలిగినవి.

| కవి | కావ్యం | కృతిభర్త |
|---|---|---|
| 1. నరకూరు నారాయణకవి | పారిజాతాపహరణం | వెలుగోటి కుమారమాచయ |
| 2. గురజాల లక్ష్మీనారాయణ | పారిజాతం | పాలకొండ రామభద్రనృపతి రాజు |
| 3. భారతి రామరాజసుకవి | పారిజాత ప్రబంధం | ----- |
| 4. జ్యోతి రామయ్య | పారిజాత నాటకం | చేజెర్ల చెన్నకేశవస్వామి |
| 5. శ్రీనివాస కవి | రంగపురి పారిజాతం | శ్రీరంగేశ్వరస్వామి |
| 6. భాగవతుల శ్రీరంగ కవి | పారిజాతం | మాచెర్ల చెన్నకేశవ స్వామి |
| 7. నారాయణతీర్థులు | పారిజాతాపహరణం | ------ |
| 8. మాతృభూతకవి | పారిజాతాపహరణం | అమరసింహభూపాలుడు |
| 9. చల్లా నారాయణ | పారిజాతనాటకాలంకార కావ్యశృంగార ప్రబంధం | వాయలూరు జనార్దనుడు |
| 10. నందివరంసింగన | పారిజాతం | కంబకృష్ణుడు |
| 11. తరిగొండ వేంకమాంబ | విష్ణు పారిజాతం | వేంకటేశ్వరాంకితం. |

వీరే గాక నారాయణ కవి, కొత్తపల్లి సుందర రామయ్య, మారేపల్లి రామచంద్ర శాస్త్రి పారిజాత నాటకాలను రచించారు. విజయ రాఘవ నాయకుడు కూడా పారిజాత నాటకాన్ని రచించినట్టు తెలుస్తుంది.

**3.2 ప్రభావతీ ప్రద్యుమ్నం :** మూల హరివంశం విష్ణు పర్వంలో 91వ అధ్యాయంనుండి 97వ అధ్యాయం వరకు వర్ణింపబడిన వృత్తాంతం. శృంగార ప్రధానమయిన ఇతిహాసాల్లో ఇది ప్రముఖమయింది. దుష్ట శిక్షణ చేయడంలో తాను మాత్రమే గాక తన వాళ్లను కూడా నడిపించాడు కృష్ణుడు అన్న సూత్రానికి బద్ధంగా సాగిన కథే ఇది. వరబలగర్వితుడు, దేవమానవ

విద్వేషి అయిన వజ్రనాభుని ఉపాయాంతరాలను సంహరించడం ఇందలి ఇతివృత్తం. ఈ కథను గ్రహించి ప్రబంధంగా సంతరించిన వాళ్లలో పింగళి సూరన మొదటి వాడు. పురాణ గాథలు విషయ ప్రధానాలు. వాటిలో కావ్య గుణాలుండడం అరుదు. కానీ మూలంలోని పొలాల్ని లోపాల్ని సవరించి సంఘటనలకు కార్య కారణ భావాలను కల్పించి నాటకీయతను పాటించి రచన సాగించడం సూరన ప్రత్యేకత. ఈ ప్రబంధంలో గల శుచిముఖి పాత్రకు సాటిరాగల స్త్రీ పాత్ర మన వాఙ్మయంలో లేదని పింగళి లక్ష్మీకాంతం గారి అభిప్రాయం. ఈ కథ నాధారంగా ఓరుగంటి సోమశేఖర కవి ప్రభావతీ పరిణయాన్ని, పొన్నాడ పెద్ది రాజు కవి ప్రద్యుమ్న చరిత్రను, ఫణి మాధవులు ప్రద్యుమ్నవిజయాన్ని, ముప్పిరాల సుబ్బరాయకవి ప్రద్యుమ్న చరిత్రను రచించారు. ఇంకా హోతా వేంకట కృష్ణయ్య గారు ప్రభావతీ ప్రద్యుమ్నమనే నాటకాన్ని, శ్రీపాద కృష్ణ మూర్తి గారు ప్రద్యుమ్నో పాఖ్యానాన్ని, ద్వివేది బ్రహ్మానంద శాస్త్రి గారు ప్రద్యుమ్నానంద నాటకాన్ని, ఎ. వేంకటరమణయ్య గారు ప్రద్యుమ్న నాటకాన్ని రచించారు.

**3.3 అనిరుద్ధ చరిత్ర** : ఇది కూడా శృంగార ప్రధానమయిన చరిత్రే. బలిచక్రవర్తి కుమారుడయిన బాణుడు పరమేశ్వరునారాధించి లోకాతీత వరాలను పొందాడు. ముల్లోకాల్లోని వీరులను జయించి తృప్తి పొందక యుద్ధం లేని జీవితం చవి గాదని కోరి అనిష్టాన్ని తెచ్చుకున్నాడు తన కుమార్తె ఉష వల్ల కృష్ణ సాహచర్యం పొంది ధన్యుడు కావడం ఇందలి ఇతివృత్తం. వీర శృంగారాలకు కూడలి అయిన ఈ కథను పలువురు రచించి ఉన్నారు.

పసుపులేటి రంగాజమ్మ ఉషా పరిణయాన్ని రచించింది. ఇది విజయ రాఘవ నాయకుని కంకితం. హరివంశంలోని ఉషా పరిణయ కథను తెనుగు గావింపుమని కోరగా కవయిత్రి రచనకు పూనుకొన్నట్టు అవతారికా భాగం పేర్కొంటున్నది

తాళ్లపాక తిరవేంగళ నాథుడు ఉషా కల్యాణ మనే పేరుతో ద్విపద కావ్యాన్ని సంతరించాడు. గ్రంథావతారికను బట్టి అలిమేలు మంగాంబకు అంకితమిచ్చినట్టు తెలుస్తుంది ' హరివంశ మార్గోక్తమగు ఉషా కన్యకర మొప్ప పరిణయ క్రమ మెట్టిదనిన' అనడాన్ని బట్టి ఈయన రచనకు హరివంశమే మూలమనవచ్చు.

దామెర్ల అంకభూపాలుడు ఉషాపరిణయాన్ని రచించాడు. రామచంద్రునకంకితం గావింపబడిన గ్రంథమిది. భగవంతుడు కలలో కన్పించి ఉషాపరిణయాన్ని కృతి నిమ్మని కోరినట్టు అవతారికా భాగం పేర్కొంటున్నది.

కనుపర్తి అబ్బయామాత్యుడు అనిరుద్ధ చరిత్రను, నాగినేని వేంకటప్పయ్య ఉషా కల్యాణ ప్రబంధాన్ని, నరసింహ నాయుడు ఉషానిరుద్ధుల వివాహాన్ని రచించారు. ధర్మవరం కృష్ణమాచార్యులు, వేదం వేంకట రాయశాస్త్రి, ద్రోణంరాజు సీతా రామయ్య, భోగరాజు నారాయణమూర్తి ఈ కథను నాటకాలుగా రచించారు. విజయ రాఘవ నాయకుడు, రంగాజమ్మ, కూర్మనాథ కవి మొదలయినవాళ్లు యక్షగానాలుగా సంతరించారు.

**4. శేషధర్మాలు :** హరివంశంలో హరివంశ పర్వ, విష్ణు పర్వ, భవిష్య పర్వాలనే మూడు పర్వాలున్నట్టు తెలుస్తుంది. కానీ శేషధర్మాలను రచించిన కవులు ఆభాగం హరివంశం ఆశ్చర్య పర్వం లోనిదని తెలియజేయడాన్ని బట్టి దాన్ని కూడా హరివంశ భాగం గానే తలపవలసి ఉంది. కృష్ణుడు సబాంధవుడయిన ధర్మజున కుపదేశించిన ధర్మాలివి. నారాయణుడు ధర్మ రహస్యాలను చెప్తుండగా పౌండ్రక వాసుదేవుడు ద్వారకా నగరం మీద దండెత్తి వచ్చాడన్న వార్తతో దూత వచ్చాడు. అంతకృష్ణుడు ఆయాధర్మాలనుపదేశించడానికి భీష్మణ్ణి నియోగిస్తాడు. ఇది ఒక్కటే హరివంశ కథకు సంబంధించిన వృత్తాంతం. ఇందు అన్నదానాది ఫలాలు, తీర్థ సేవా ఫలాలు చెప్పబడ్డాయి. ఈ ధర్మాలను గ్రహించి కవులు ప్రబంధాలుగా, వచన కావ్యాలుగా రచించారు. వీళ్లలో మొదటి వాడు కొడిచెర్ల శ్రీనివాసకవి. రామచంద్రమూర్తి సాక్షాత్కరించి కృతి చెయ్యుమని చెప్పగా కవి రాసినట్టవతారికా భాగం తెలియజేస్తుంది. గోపన మంత్రి తమ్ముడయిన బెజ్జనార్యుడు రచనలో సహకరించినట్టు కవి పేర్కొన్నాడు. ఇక రెండవ వాడు తాపురపల్లి తిమ్మయ్య. ఇందుపురేమి ధర్మాజీ గారు కవిని పిలిపించి శేషధర్మాలను అనువదింపజేసి రాముని కంకితమిప్పంప జేశాడట. ఇలాగే చతుర్భుజ తిమ్మరాజు వెణుకుదురు పల్లి విశ్వనాథ కవి వాక్కులకు ముగ్ధుడయి - "ఇపుడు నీవు చెప్పబూనిన కావ్యంబంకితము చేయు మాపేర అనఘ చరితా !" అని కోరగా కవి మూడాశ్వాసాల రచన సాగించాడు.

తురిమెళ్ల రామయామాత్యుడు ఈ ధర్మాలనే ఎనిమిది ఆశ్వాసాల కావ్యంగా సంతరించాడు. తన కృతికి భద్రిరాజు తమ్మన సహకరించినట్టు చెప్పుకోవడం ఆయన వినయాన్ని సూచిస్తుంది. సిద్ధరాజనే కవి ఈ ధర్మాలను

రచించి ఉదయగిరి రఘునాయకుల కంకితమిచ్చారు. కానాల నరసింహకవి తజిగొండ గ్రామంలో నివసించిన నరసింహ స్వామి కంకితంగా ఎనిమిది ఆశ్వాసాల శేష ధర్మాలను రచించాడు. వీళ్లేగాక బచ్చు సిద్ధకవి, పురాణ పండ్ల మల్లయ్య, భమిడి పల్లి వేంకట కవి కూడా శేష ధర్మాలను రచించి ఉన్నారు. చదలువాడ సుందర రామశాస్త్రి, నేరి గురులింగశాస్త్రి, సూర్యనారాయణ శాస్త్రి, అల్లమ రాజు సుబ్రమణ్య కవి కూడా ఈ ధర్మాలను వచన కావ్యాలుగా సంతరించి ఉన్నారు. హరి వంశ కథకు, శేషధర్మాలకు ప్రధాన విషయంలో సంవిధానకం కుదరడం లేదు. అందువల్ల ఆ ధర్మాలు హరివంశ భాగాలు కావని డా||(శ్రీమతి)యశోదారెడ్డి గారి అభిప్రాయం.

విష్ణు పారమ్యాన్ని తెలియజేస్తూ హరిహరాభేదాన్ని ప్రతిపాదించే రచనల్లో హరివంశం ముఖ్యమయింది. హరివంశ పూర్వోత్తర భాగాలు, పారిజాతాపహరణం, ప్రభావతీ ప్రద్యుమ్నం, అనిరుద్ధ చరిత్ర వంటి కథల నాధారంగా గ్రహించి రాసిన ప్రబంధ, నాటక, యక్షగానాదులు 'తెలుగులో హరివంశాలనే' పరిధిలోకే వస్తాయి.

(సప్తగిరి -ఆగష్టు, 1983)

★★★

# 4. ఎఱ్ఱన సోమనల హరివంశాలు

ఆంధ్రమహాభారతాన్ని సంతరించిన కవిత్రయంలో ఎఱ్ఱన తృతీయుడు. అనువాద భాగాన్ని బట్టి చూస్తే ద్వితీయుడు. హరివంశాను వాదంలో ప్రథముడు. ఇలా ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్ని పొందడం ఎఱ్ఱన కవిజీవితంలో కనిపించే ప్రత్యేకత. నాచన సోమన ఉత్తర హరివంశ కర్త. అద్వితీయమయిన రచనా సామర్థ్యాన్ని బట్టి కవిత్రయ తుల్యుడుగా కొన్ని యెడల కవిత్రయాధికుడుగా మన్నింపబడడం సోమన కవి జీవితంలో వ్యక్తమయ్యే విశేషం. వీళ్లిద్దరూ సమకాలికులని ఒక వాదం. సోమన మొదట హరివంశాన్ని రచింపగా సమకాలీన స్పర్ధచే ఎఱ్ఱన తరువాత హరివంశాన్ని రచించాడని వేరొక అభిప్రాయం. ఎఱ్ఱన హరివంశాన్ని చూసి సోమన ఉత్తర హరివంశాన్ని రచించాడని ఇంకొక ప్రతీతి. వీళ్లిద్దరి మూలాలు భిన్నాలని మరొక నిర్ణయం. ఎఱ్ఱన కంటె సోముడధికుడని టేకుమళ్ల అచ్యుతరావు, దుర్భా సుబ్రహ్మణ్య శర్మ, నడకుదుటి వీరరాజు పంతులు భావించారు. నాగపూడి కుప్పుసామయ్య గారు, రాళ్లపల్లి వారు సోముని కంటె ఎఱ్ఱన మేల్తరమయిన రచన గావించాడని భావించారు.

**1. కథాంశాలు** : ప్రోలయ వేమారెడ్డి ఎఱ్ఱనను చూసి

కం. " భారత పరాంశమని యిం

పారగ జెప్పుదురు బుధులు హరివంశము నీ

వారమ్య కథ దెనుంగుగ

ధీరోత్తమ నిర్వహించి తెలుపుము మాకున్'

(హరివంశం పూ.భా. 1-40)

అని కోరగా నన్నయ, తిక్కనాదులు చూపిన త్రోవ పావనం కావడం వల్ల "పరాశరాత్మజ మునీంద్రుని వాఙ్మయ మాది దేవుడా వెన్నుని వృత్త మీవు కడువేడుకతో విను నాయకుండవు "(హరివంశం పూ.భా. 1-42) అని ఎఱ్ఱన చెప్పినట్టు పద్యాలున్నాయి. సంస్కృత హరివంశంలో హరివంశ పర్వం, విష్ణు పర్వం, భవిష్య పర్వం అనే మూడు విభాగాలున్నాయి. ఎఱ్ఱన పర్వ విభాగాన్ని గావింపక పూర్వోత్తర భాగాలుగా విభజించాడు. పూర్వ భాగంలో 9 ఆశ్వాసాలు, ఉత్తర భాగంలో 10 ఆశ్వాసాలున్నాయి. కథా సంవిధానాన్ననుసరించి చివరి భాగాన్ని ముందుకు, ముందు భాగాన్ని వెనుకకు

మార్చి ఎఱ్రన ఔచిత్యాన్ని పాటించాడు. భవిష్య పర్వాంతంలో కనిపించే కృష్ణ కైలాస గమనం, ఘంటా కర్ణుని చరిత్రలిందు కుదాహరణలు. ఇలాగే ఉపనయనానంతరం రామకృష్ణులు సాందీపుని దగ్గర విద్యలభ్యసించి గురుదక్షిణ చెల్లించడం కూడా చెప్పుకోదగింది.ఇంతే గాక మూలంలో లేకున్నా ఎఱ్రన భాగవత విష్ణు పురాణాదుల నుండి కొన్ని కథలను గ్రహించి తన అనువాదంలో జోడించి ఉన్నారు. శ్రీకృష్ణుని బాల్యక్రీడలు, నీలాసుందరీ పరిణయం, సత్యభామ నరకునితో యుద్ధం చేయడం, గోపాలకులు రోగశాంతికై శివపూజా వ్రతం సలపడం వంటి ఘట్టాలను ఈ దృష్ట్యా పేర్కోవచ్చు.

స్థూల దృష్టితో చూస్తే సోమన కూడా అనువాద విషయంలో కవిత్రయ మార్గాన్ని పాటించాడని చెప్పవచ్చు. ఉత్తర హరివంశంలో ఆరు ప్రధాన కథలున్నాయి. ఈ కథలన్నీ కృష్ణ మాహాత్మ్యాన్ని, విశదపరచేవి పారిజాతాపహరణం రసవత్కథ అయినప్పటికీ కృష్ణ మాహాత్మ్యానికి తగిన చర్య కాకపోవడం వల్ల (దొంగ చాటుగా పారిజాతాన్ని పెకలించి తేవడం) సోమన విడిచిపెట్టాడు. ఇలాగే వజ్ర నాభ వృత్తాంతం రసభరితమయినా ప్రద్యుమ్న నాయకత్వం కావడం వల్ల సోమన పరిహరించాడు. హరిహరాద్వైత ప్రతిపాదకమమయిన వృత్తాంతాల సంధానంలో మాత్రమే జాగరూకత వహించాడని చెప్పవచ్చు. అనిరుద్ధ వివాహం చెప్పి ఆపై ప్రద్యుమ్న జననానికి హేతు భూతమయిన రుక్మిణి కాంక్షను వ్యక్తపరచడం అసంగతం. అందువల్ల ఆ విషయాన్ని ఈ మహాకవి ద్వితీయాశ్వాసంలో బ్రాహ్మణ పుత్రుణ్ణి పునరుజ్జీవింపజేసిన కథానంతరం సమకూర్చాడు. కావ్యాన్ని మంగళాంతం చెయ్యాలన్న అభిప్రాయంతో ఉషాదేవి వృత్తాంతాన్ని చివర చేర్చాడు ఎఱ్రన వలె మూలంలో లేని కృష్ణుడు దేవేరులతో నెత్తమాడే ఘట్టాన్ని సోమన కల్పించడం విశేషం.

**2. మూలానుసరణ వివరణ** : నరక సంహారానికి పూర్వం శ్రీ కృష్ణుడు ఒక నాడు ద్వారకలో సభదీర్చి ఉండగా ఇంద్రుడు వచ్చిన వైన ంమూలంలో-

"దివ్య గంధో వవౌ వాయుః పుష్ప వర్షం పపాత||

(హరివంశం. విష్ణుపర్వం 63-25)

తతః కిలకిలా శబ్దః ప్రభాజాలాభి సంవృతః |" అనే శ్లోకాలను ఎఱ్రన

(హరివంశం విష్ణుపర్వం 63-26)

"........దివ్య వాయువు చనుదెంచె దోనగురిసె దేవో ద్యాన తరు పుష్ప వర్షంబు ......" (హరివంశం . ఉ. భా. 4-107) "....... దివ్య వసన స్రగ్గంథ విస్ఫూర్తితో, త్రి జగద్భర్త శచీ విభుండు వొలిచెన్ దేదీప్యమానోన్నతిన్ "(ఉ.భా. 4-109) అని తెనిగించాడు. నరకాసురుని పరాక్రమానికోడిన దేవేంద్రుని వర్ణన హృద్యమయినా ఘట్టాన్ననుసరించి ఉచితంగా లేదని చెప్పాలి. సోమన ఈ ఘట్టాన్ని -

ఉ " తోడన దివ్య గంధమములతో సుఖశీతల మారుతంబు ద

ట్టాడ వియత్తలంబు గల యంతట గారు మెఱుంగు మూఁకకున్

జోడగు కాంతి పర్వ మణి చుట్టులఁబాయ తొలంగు మంచు బె

ట్టాడెడు మాటలుప్పతిలె నంతటిలో గగనాంతరంబునన్".

(ఉత్తర హరివంశం 1-123)

అనే పద్యంలో వర్ణించాడు. ఇక్కడ రాజసభా మర్యాదలు పాటింపబడ్డాయి. ఇలాగే నరకాసురుడు చక్రంతో ఖండింప బడడాన్ని -

"చక్ర ద్విధాకృతం తస్య శరీర మపతత్ భువి|

విభక్తం కులిశేనైవ గిరేః శృంగం ద్విధాకృతమ్ ||" అని మూలం

(హరివంశం విష్ణు పర్వం. 63- 121)

వర్ణిస్తూ ఉంది. ఈ భావాన్ని సమగ్రంగా గ్రహించి ఎర్రన --- "---- ఆపాద మస్తక సర్వాంగము రెండు వ్రయ్యలుగఁ బెల్చం బాపె, ఱంపంపుఁ బెం పొకడుందప్పక యుండునట్లు...." (ఉ.భా. 4-178) అని వాచ్యం గావించాడు. సోమన "...వ్రక్కలొక్కంతగ నేలఁగూలె దను జాకృతి త్రాసున ఁదూప భూతముల్ " ( ఉత్తర హరివంశం 1-175) అని నరకుని శరీరాన్ని భూతాలు త్రాసులో తూచినట్టుగా సమవిభక్తమయిందని తోపింపజేశాడు.

నరకాసురుడు కుబేరునితో యుద్ధం చేయడాన్ని ఎర్రన - " ఉరమున మూపునన్నుదుట నొక్కట కన్నుల ఁజెక్కులంబరం, పరలయి తత్ర్పయుక్త పటు బాణ చయంబులుఁబెట్టు...." (హరివంశం ఉ.భా. 4-35) అని వర్ణించాడు. కన్నుల బాణం నాటినప్పుడు కన్నుండదు. కుబేరుని పలాయనానికది ఒక్కటే

చాలు ఈ భావం రమ్యమయినా సోమన -" చనుమఱలందు వక్షమునఁ జక్షురుపాతము లందు జెప్పలన్. మునిగిన బాణజాలముల..." (ఉత్తర హరివంశం 1-42) అని వర్ణించాడు. ఈ పద్యాన్ని బట్టి నరకుని హస్తలాఘవం వ్యక్తమయింది. నరకుని లక్ష్యశుద్ధిని బాణప్రయోగ లాఘవాన్ని చూసి కుబేరుడు భయ ఖేదాలతో వెళ్లడం సమంజసంగా ఉంది.

**3. మూలవ్యతిరిక్త వివరణ :** నరకుడు తనకు అధ్వర భాగాలిండని మునుల్ని కోరడం, బాధించడం మూల హరివంశంలో కనిపించవు. కానీ ఎర్రన సోమనల రచనల్లో కనిపిస్తున్నాయి.

*"..........................................................................................

నమర వరేణ్యు నూర్జిత బలాతిశయంబున భగ్నుఁ జేసి త

త్సమధిక రాజ్య వైభవము సర్వముఁ జేకొని యున్నావాఁడ వి

శ్వమునకు నేన కాక పెఱవాఁ డొడయండు గలండె యెప్పుడున్"

(హరివంశం ఉ.భా. 4-53)

అని ఎర్రన వర్ణించాడు. ఈ పద్యంలో గల "ఎప్పుడున్" అన్నది నరకుని ఔద్ధత్యాన్ని చాటుతున్నది. ఇంకా ఇది అసత్యకథనం. కాబట్టి సోమన ఈ సందర్భంలో నరకుడమరావతిని ఆక్రమించడం వల్ల యజ్ఞాంశాల కధిపతి కాగల ప్రాభవం తనకు గలదని -

కం "మ్రొక్కులకుఁ దగుదుఁ బూజల
కెక్కిన మంత్రార్థ విధులకెల్లందగుదుం
బెక్కుల యేను వెలిగా
స్రుక్కక యాగముల కొకరు సొరగల వారే (ఉత్తర హరివంశం 1-92)
అని పలికినట్టు రాశాడు.

మూల హరివంశంలో ఊర్వశీ నరకసంవాదం లేదు. ఋషులను నరకుడు బాధించడానికి ప్రధాన కారణ మూర్వశి ప్రేరణే అని చూపడానికి నాచన సోమన ఊర్వశీ నరక సంవాదాన్ని కల్పించి నాటకీయతను ప్రదర్శించాడు. ఊర్వశి తన్నభిలషించిన నరకుణ్ణి అతి చమత్కారంతో మరలించి వాని పతనానికి వానినే బాధ్యుణ్ణి చేయదలచింది. తన పొందుకు, అధ్వర భాగాధికారానికి ముడి పెట్టింది. కాబట్టి సోమన "ఒక నాడూర్వశి మాట

పొందు నరకుండూహించి నాకాధి నాయకునిన్ " (ఉత్తర హరివంశం 1-90) అని వర్ణించాడు. ఎఱ్ఱన కూడా ఊర్వశీ నరక సంవాదాన్ని ప్రవేశ పెట్టినా సంగ్రహించాడు.

సత్యభామ సంగ్రామ ఘట్టంలో 'ఎఱ్ఱన వీరంబాడుదనంబు నొందె' అని వర్ణించాడు. వీరత్వమంతా సాకారమయిన స్త్రీ మూర్తిని ధరించింది కదా! అనే అర్థం మాత్రమే కాక వీరత్వం పొల్లు పోయిందన్న అర్థం కూడా వస్తుంది. నాచన సోమన ఈ ఘట్టాన్ని విస్తరించాడు. "సత్రా జిత్తనయాకర్ణాంతర ధనుర్జ్యారావమై రావతీ", (ఉత్తర హరివంశం 1-160) " కమలముఖీ కటాక్ష కటకా ముఖపాణి నఖోపకారి" (ఉత్తర హరివంశం 1-159) మొదలయిన పద్యాల్లో సూక్ష్మాతి సూక్ష్మాలయిన విషయాలను కూడా పొందుపరచి విస్తరింపజేశాడు.

**4. ఔచిత్య పోషణ** : సత్యభామా సహితుడయి శ్రీ కృష్ణుడు నరకుణ్ణి సంహరించడానికి ప్రాగ్జ్యోతిషం వెళ్లాడు. యుద్ధ సన్నద్ధుడయిన నరకాసురుడు-

కం "నీవేల వచ్చితిచ్చటికి
నేవాడవు మోపుటరకనేపారెదు నీ
లావరి పులుగెక్కడియది
యీ వారిజనయన యెవ్వరేర్పడ ( జెపుమా !"

(హరివంశం. ఉ. భా. 4-150)

అని ప్రశ్నించినట్లు ఎఱ్ఱన రాశాడు. ఈ పద్యం సూక్తి వైచిత్రి తో కూడిందయినా నరకుండతటి క్రూరదానవుడు కృష్ణ సత్య, గరుత్మంతాదుల నెరుగని అవివేకియా ?అన్న సందేహం కలిగిస్తుంది. సోమన ఔచిత్యాన్ని పోషించి నరక కృష్ణుల సంభాషణను సాగింపక వీర మర్యాదలను పాటించినట్లు వర్ణించి ఉన్నాడు.

రుక్మిణి "తనయుల బ్రద్యుమ్నాదుల గనియు దనియదు " ( హరివంశం ఉ.భా. 5-115) అంటూ "నిన్ను బోలు పుత్రునింక నొక్కని గోరె దనని" (హరివంశం ఉ.భా. 5-116) కాంక్షించి నట్టు ఎఱ్ఱన రాశాడు. రుక్మిణీ దేవి యిది వరకే ప్రద్యుమ్నాదుల బడసింది. 'నిన్నుబోలు'అనడాన్ని బట్టి ఇంతవరకున్న వాళ్లు అలాంటి వాళ్లు కారా? అన్న సందేహం కలుగుతుంది. సోమన ప్రద్యుమ్న వృత్తాంతాన్ని స్మరింపక -

గీ. "అఖిల లోకైక నాథ! నీ యట్టి రూప
నిక్రమౌదార్య శౌర్య వివేక నిలయు
నొక కుమారుని దయచేసి యుర్విలోన
గడుపు చల్లని కాంతుల గలుపు నన్ను
(ఉత్తర హరివంశం. 2-75)

అని ఔచిత్యాన్ని పోషించారు.

పిశాచద్వయ వృత్తాంతంలో ఘంటాకర్ణుడు -

కం. "నా యనుజుఁడు ననిశము నా
రాయణ చరణాబ్జ చింతనాసక్తుఁడ వా
డాయనువున బరమేశ్వర
సాయుజ్యము వడయు గాత సముపాగతితోన్".
(హరివంశం. ఉ.భా. 5-208)

అని కోరినట్టుగా ఎఱ్ఱన రాశాడు. ఘంటా కర్ణుడు ఇలా కోరడం ఔచిత్యవంతం కాదు కాబట్టి సోమన కృష్ణుడంతటి వాడు ప్రీతుడయి ఘంటా కర్ణునితో -

కం. "నీ తమ్ముఁడు నీ రూపున
నీ తోడన కూడ వచ్చి నిర్జర రాజ్య
స్వాతంత్ర్యము గని పిమ్మట
నాతత్త్వము గూడ వచ్చు నాకాధిపతీ"
(ఉత్తర హరివంశం 2-155)

అని చెప్పినట్టు పేర్కొన్నాడు.

ఉషా నిరుద్ధుల వృత్తాంతంలో అనిరుద్ధుడు -

కం "నా కనక ప్రాసాదము
నాకొలువు విలాసినులును నాచుట్టములున్
లేకున్ననేమి కౌగిట
నీకామిని యున్నఁజాలు నెల్ల చవులకున్"
(ఉత్తర హరివంశం 5-210)

అని చెప్పడం సోమన ఉత్తర హరివంశంలో కనిపిస్తుంది. ఇది అవకాశవాది అయిన వ్యక్తి సంభాషణ కావచ్చు. ఇక్కడ సోమన భావం సమంజసంగా లేదనే చెప్పవలసి ఉంది. ఎఱ్ఱన రచనలో ఈ భావం కనిపించదు.

5. **రసదృష్టి** : 'వాక్యం రసాత్మకం కావ్యమ్' అని ఆలంకారికోక్తి. రసవిల సితమయిన కావ్యం శోభిస్తుంది. కవులు భిన్న మనస్కులు. కాబట్టి

కొందరు శృంగారాన్ని వర్ణిస్తే మరికొందరు వీరానికి ప్రాధాన్యమిస్తారు. ఎర్రన సోమనలిద్దరూ రస దృష్టి గలవాళ్లే. వీళ్లలో సోమన సాహిత్య రస పోషణ చక్రవర్తి హరిహరా భేదాన్ని పాటించినట్టే రస విషయంలో కూడా సోమన సమత్వాన్ని పోషించాడు. అంటే నవరస పోషణలో చతురుడని తాత్పర్యం. ప్రధానాలయిన వీర శృంగారాలను మాత్రమే గాక రసా భాసాల్లో కూడా ఔచిత్యం చెడక వర్ణించడం సోమన ప్రత్యేకత. ఇలాగే విరోధి రసాలను కూడా ఒక్కచోట కూర్చి సర్వజ్ఞ బిరుదును సార్థకం చేసికొన్నాడు. ఎర్రన సోమనల రచనల్లో సమానంగా కనిపించే ఉషా పరిణయ వృత్తాంతంలో సోమన ఔచిత్యాన్ని, పాటించినట్టు విమర్శకుల తలపు.

ఎర్రన మూలంలో లేని పార్వతీ పరమేశ్వరుల శృంగారాన్ని విపులంగా వర్ణించాడు. రాళ్లపల్లి వారు "కంఠ కాళిమ దనకంఠంబునకు నూత్న, కస్తూరికా దీప్తి విస్తరింప "(హరివంశం ఉ.భా. 7-70) అన్న పద్యాన్ని పేర్కొన్నారు. ఉషాదేవి కింకా కన్నెతనం. అందులోనూ ముగ్ధమానసం. కాబట్టే నిత్యయవ్వనులయిన ఆ దంపతులే కాంత స్థలంలో ఉన్నా పొంచి చూడ సాహసించింది. ముఖ్యంగా తాను చూసింది అంబనైనా తల్లిదండ్రుల లీలల్ని చూసిన బిడ్డల మనసు వికృతి నొందదు. అయినా ఆమె ముగ్ధ మానస కాబట్టి మనసెంత బిగబట్టినా ఆ కోరికలంకురించాయ'ని ఎర్రన రాశాడు. సోమన ఉషా పరిణయ ఘట్టంలో శృంగారాన్ని లాక్షణిక మర్యాదల ననుసరించి విపులీకరించాడు. శృంగార భావారంభానికి ప్రాతిపదికగా పార్వతీ పరమేశ్వరుల కూడి వచ్చిన అప్సరసల నాట్యాన్ని వన, జల కేళుల్ని వర్ణించాడు. ఇలాంటి క్రీడల వల్ల ఉషాదేవి మనసులో ఒక్కొక్క కోరిక భర్తృసంయోగ సంబంధిగా పొడమింది. ప్రమద గణాలు తమ భార్యలతో గావించిన శృంగార విధానాలను చూసి 'వారందరెంతటి అదృష్టవంతులో గదా !' అని తలపోసింది. కానీ పార్వతీ పరమేశ్వరు లేకాంతంలో ఉండడాన్ని చూసినట్టు సోమన వర్ణింపలేదు. కాబట్టి ఎర్రన ఉష కంటె సోముని ఉష రమణీయమయింది. ఇలాగే స్వప్న సమాగమ వృత్తాంతాన్ని ఎర్రన -" కలలోన నయ్యింతి గదిసి "(హరివంశం ఉ.భా. 7-96) అన్న పద్యంలో విపులంగా వర్ణించాడు. ఈ వర్ణన విరసంగా ఉండడం వల్ల ఔచిత్యాన్ని పాటించి నాచన సోమన-"కలలో కుమారుడొకడేమో చేసినన్ " (ఉత్తర హరివంశం 5-82) అని పాఠకుల ఊహాకే వదలిపెట్టాడు.

**6. పాత్ర పోషణ :** కవుల పాత్ర పోషణ సాధారణంగా సన్నివేశాల్లోనూ విశేషణాల్లోనూ సంభాషణల్లోనూ కానవస్తుంది. ఎర్రన విశేషణ ప్రయోగాల్లో, సన్నివేశాల్లో పాత్రల శీలాన్ని, ప్రస్ఫుటం చేశాడు. సోమన సంభాషణా విధానంతో నాటకీయతతో పాత్ర పోషణ గావించాడు. ఈ విధానం వల్ల కావ్య పాత్రలు సజీవాలు, సన్నిహితాలయ్యాయి. ఉదాహరణకు ఊర్వశీ

నరకసంవాదం ఈ సంవాదాన్ని ఎఱ్ఱన రెండు పద్యాల్లో క్లుప్తంగావర్ణించాడు. కానీ సోమన 25 గద్యపద్యాల్లో విపులీకరించాడు. ఈ సంవాదం జుగుప్సావహమనీ రసముల్లసితం కాలేదనీ కొందరి అభిప్రాయం. ఈ సందర్భంలో నడకుదుటి వీరరాజు పంతులుగారు -"ఊర్వశీ పాత్రల తొయ్యలి నరకుడు రక్కసి రాయడు ఇట్టి పాత్రలను విమర్శించునపుడు సీతారాములను మనమున నిడుకొనరాదు రావణాదులను తలంపవలయును. వానియందు రాజపౌరుషము మెండుగా నున్నది వాని యందు వలపు లేమి అనేక మార్గములచే తప్పించుకొన జూచిన ఊర్వశి తుదకు మాయ నవ్వు నవ్వుచు యాగ భాగముల కధికారివి కాని నీ మగతనమేటికి?" అని నిందించడం సమంజసమే నని తెలియజేశారు. నరకుడు 'ఒక నాడూర్వశి మాట పొందూహించి' మునుల్ని అణచాడు. ఇక్కడ మాట పొందు ఉంది కానీ ఊర్వశిని పొందు మాట లేకుండడం గుర్తింపదగింది. ఈ సందర్భంలో పాత్రపోషణ గమనింపదగింది. సోమన వాడిన లంజియ, మిండతీకం వంటి పదాలు విరసాలు కావచ్చు. సామీప్యం వల్ల సాన్నిహిత్యం వల్ల విరసంగా కన్పించడం సహజం. ఆ విధంగా చూస్తే ఎఱ్ఱన - "అరవిందానన సత్కరింపుము మనోజానీక సంక్రీడలన్" (హరివంశం ఉ.భా 4-42) అనడం కూడా అసభ్యమే అవుతుంది. ఇంకా లంజియ మొదలయిన మాటలు తెలుగులో వాత్సల్య పూరితాలవుతాయి.

ఎఱ్ఱన కృష్ణుడు సత్యభామతో-" ఏను పరపీడితుండనై దస్సితి నొక్కింత నీవు కయ్యంపు మోపు మోవుము "(హరివంశం ఉ.భా4-161) అని చెప్పినట్లు వర్ణింపబడింది. కానీ సోమన ఔచిత్యాన్ని పాటించి - "నీవు సమరంబె కోరుదు, నవసరంబు వచ్చెననుచు నిచ్చె" (ఉత్తర హరివంశం 1-155) అని వర్ణించాడు.

వ్యర్థ ప్రయత్నుడయిన అర్జునుని చూసి బ్రాహ్మణుడు -"నీకున్ హరికి విను హస్తి మశకాంత, రమెన్నడు ...." (హరివంశం. ఉ.భా. 5-75) అని వర్ణిచాడు.

కం. "మోఘము నీ గాండీవము
మోఘము దోర్బలము శరము మోఘము నీకున్
లాఘవము బలిసె నాత్మ
శ్లాఘ కడిచి పడక చనుము చక్కగ మగుడన్"

(హరివంశం. ఉ. భా. 5-77)

అన్నట్టు ఎర్రన రాశాడు. ఎర్రన బ్రాహ్మణునిలో జాతి సహజమయిన పరుషత్వం వ్యక్తమయింది. సోమన అలా కాక అర్జునుని నిస్సహాయతను -

కం. "నీవేమి సేయుదీ గాం
డీవము నీకిచ్చి యమ్ము డెప్పరమైనన్
"(ఉత్తర హరివంశం 2-33)

అని వర్ణించాడు

**7. అలంకారాలు :** సోమన అలంకార ప్రియుడు అర్థాలంకారాల కంటె శబ్దాలంకారాలు ఉత్తర హరివంశంలో ఎక్కువ. అను ప్రాసాద్యలంకారాలను ప్రదర్శించడం సోమన ప్రత్యేకత.

కం. "అరిగరమున నేదాల్చిన
నరి నగరము నగేంద్ర ధీరుఁడయినంజెడదే
యరిదిరమై నన్నడుగుట
యరిదిరమైకాభిలాషులగునృపతులకున్"
(ఉత్తర హరివంశం 4-162)

అర్థాలంకారాల విషయంలో సోమన చాలా జాగరూకత వహించినట్లు చెప్పవచ్చు. మొదట వాడిన ఉపమానాలను చివరి దాకా సాగించడంలో కాళిదాస మహాకవి పద్ధతిని పాటించి నాడనవచ్చు. దేవదానవ యుద్ధంలో

గీ. "అచలగతినుండె దనుజ సైన్యంబు మిగుల
బరఁగి దైవ సైన్యంబుచేఁ దెరలదయ్యె
దనుజ సింహనాదములు డెందములు సొరగ
దిరుగఁ బడఁ జొచ్చె నమర కుంజర బలంబు
"(ఉత్తర హరివంశం 1-19)

అని చెప్పతం వల్ల సింహోపమానులయిన దానవులు జయిస్తారనీ, గజోపమానులయిన దేవతలు పరాజితులవుతారని సూచింపబడింది. దేవేంద్రునిపై బడిన నరకుడు కూడా -

"నానావిధ సింహనాదుడయి నాగముపై జను సింగ మోయనన్" (ఉత్తర హరివంశం 1-44) అని వర్ణింపబడ్డాడు. 'సంగర ' విజయోత్సాహంబున సింహనాదంబు జేసి '(ఉత్తరహరివంశం 1-50) అనడం కూడా ఇలాంటిదే. పంచమాశ్వాసంలో -' అనిరుద్ధుడు పూర్ణశశినిభాననుడయి' అనడంలో కూడా విశిష్టార్థముంది.

ఎఱ్ఱన కూడా అలంకార ప్రియుడే పద్మ సంభవుని వల్ల వరాలను పొందిన నరకుడ్ని పరిచయం చేస్తూ -

కం "సుర దైత్యా
బరాజయము రాక యుండబద్మభవుని చే
వరము గొని కొత్త సిరి పస
సురారసము వోలె నొడలు సొచ్చి కలంచెన్"

(హరివంశం ఉ.భా 4-15)

అని ఎఱ్ఱన వర్ణించాడు ఇక్కడ వాడబడిన సురారసము, కొత్తసిరి అనే రెండు ఉపమానాలు కవిలోకానుభవాన్ని సూచిస్తాయి. వచనంలో కూడా శ్లేషాలంకారాన్ని, ఎఱ్ఱన ప్రయోగించడం విశేషం "ఇట్లు శరత్సమయంబున భ్రమద తరంగితంబులగు నంగంబులుం గలిగి గంగా తరంగంబుల తెఱంగున.....గోపాలురు తమలోవిచారించి " (హరివంశం. పూ.భా 7.120)వంటివి ఉదాహరణలు. సోమన వచనానికి "వలాహకంబు నుం బోలె ఁగరకాస్పదం బై కుంజరంబు నుంబోలెఁగుం భాభిరామంబై ........" (ఉత్తర హరివంశం 2-110) అన్నది ఉదాహరణ.

**8. దృష్టి భేదం :** ఎఱ్ఱన మహాకవే కానీ స్వతంత్రుడు గాడు. ఆయన రచన చాలావరకు మూలానికి సన్నిహితంగా ఉంటుంది. కారణమాయన వినయమో లేక అలా రాయకుంటే లోకులు నిందిస్తారన్న భయమో కాక నన్నయ తిక్కనాదులతో సమానమయిన కీర్తి కలగాలన్న అపేక్షోకావచ్చు. సోమన అలా గాక సర్వతంత్ర స్వతంత్రుడు. పైగా సర్వజ్ఞుడు కాబట్టి మూలంలో రేఖా మాత్రంగా ఉన్న భావాలను గ్రహించి వాటిని వర్ణనలతో సంభాషణలతో విపులీకరించాడు. ఎఱ్ఱన నన్నయాదుల వలె జపహోమ తత్పరుడు. కాబట్టి హరివంశంలో కృష్ణుని సమాధిని, యాగదీక్షను విపులీకరించాడు సోమన తిక్కనాదుల కోవకు చెందినవాడు కావడం వల్ల తనకు ప్రియమయిన యుద్ధ వర్ణనలను సర్వాంగ సుందరంగా చేశాడు. అంతే గాక రాజ సభా మర్యాదలను, రాయబార విధానాలను వర్ణించాడు. కవిత్రయంలో గుణత్రయం (సత్వ రజస్తమో గుణాలు )సమపాళ్లలో ఉంటే సోమనలో రజోగుణమధికమని చెప్పవచ్చు. ఈ కారణం వల్ల మూలానుసరణ గుణం కంటె కాల్పనికత ఈయన కవిత్వంలో కాస్త ఎక్కువ. సోమన చమత్కార ప్రియుడు. దానికై ఈతడు పెక్కు పద్ధతుల ననుసరించాడు.

వాటిలో దీర్ఘ సమాసరచన ఒకటి. "గాండీవారావ ఝంపా ఘటిత భయ దివో కః పురాంతః పురంధ్రీ "(ఉత్తర హరివంశం 2-27) ఇలాంటివి ఎర్రన రచనలోనూ కనిపిస్తున్నాయి. "క్షేపిష్ఠ ప్రేష్ఠతార్క్ష్యోత్థి తరుచి విసరక్షిప్త సప్తాశ్వదీప్తి " (హరివంశం ఉ.భా. 8-140)

పద్యరచనలో ప్రాసలపై ఎక్కువ శ్రద్ధ వహించడం సోమన రచనలో కనిపిస్తుంది. 'ప్రాగ్జ్యోతిషంబు గదిసి' (ఉత్తర హరివంశం 1-146)" ఫాల్గున మాసము మొదలుగ "(ఉత్తర హరివంశం 2- 164)

పాల్కురికి సోమన పువ్వులపేర్లు, చెట్లపేర్లు గణబద్ధంగా దీర్ఘ ద్విపదలలో పొందు పరచి రాసినట్టు నాచన సోమన వివిద దేశాల పేర్లను దీర్ఘ సమాసాలతో కూర్చి అనుప్రాసలతో సీస పద్యాన్ని రచించాడు. "పాంచాల పాండ్య బర్బర కిరాతాభీర " (ఉత్తర హరివంశం 5-142) ఎర్రన రచనలో కూడా ఇలాంటివి లేకపోలేదు. "వ్యాస భరద్వాజ వాల్మీకి " (హరివంశం ఉ.భా. 5-154) అన్న పద్యంలో మునుల పేర్లు చెప్పబడ్డాయి.

ఎర్రన కవిత స్వభావ సిద్ధమయిన సౌందర్యం కలిగి రూపు రేఖలతో కొద్ది పాటి ఆభరణాలు ధరించి స్వచ్ఛమయిన వస్త్రాలను ధరించిన గృహిణి వలె ఉంటుంది. సోమన కవిత సర్వాభరణ భూషితురాలయి చిత్ర విచిత్ర దుకూల వస్త్రధారిణి అయి లోభపెట్టే వేశ్యాంగన వంటిదని శిష్టా రామకృష్ణ శాస్త్రి గారు భావించారు. ఈయన దృష్టిలో ఎర్రన కవిత్వం రేఖా మాత్ర చిత్ర లేఖనం కాగా సోముని కవిత్వం పంచవర్ణాలతో చిత్రించబడి పైపై మెరుపులతో కూడిన చిత్రం. రచనా కళ, వస్తు కళ, భావకళలలో సోమన వస్తు కళకు సంబంధించిన రచన చేశాడని రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ గారి అభిప్రాయం.

పక్షపాతరహిత దృష్టితో చూస్తే ఇద్దరూ మహాకవులే. ఎర్రన శంభుదాసుడు కాగా సోమన హరిహరాభేదాన్ని పాటించిన మనీషి. ఎర్రన పురాణ ఫక్కీలో రచన సాగిస్తే సోమన కవితా కన్యకకు ప్రబంధపు నడకలు నేర్పి తరువాతి ప్రబంధ కవులకు మార్గదర్శకుడయ్యాడు.

★★★

# 5. సోమన అనువాద విధానం

నాచన సోమన ఉత్తర హరివంశ ఆశ్వాసాంత గద్యల్లో "శ్రీ మదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహాభారత కథానంతరంబున" అని పేర్కొవడాన్ని బట్టి అను వాద విధానంలో సోమన తిక్కన పద్ధతి ననుసరించాడని చెప్పవచ్చు. అంటె ప్రధాన సన్నివేశాల్లో వాటి కథనంలో మూలానికనుగుణంగా రచించడం, కొన్ని చోట్ల రసదృష్టితో విపులీకరించడం, మరికొన్ని చోట్ల ఔచిత్య పోషణకై మూలాన్ని ఒకింత మార్పు చేసి మెరుగులు పెట్టడం వంటి పద్ధతులను సోమన పాటించాడని చెప్పవచ్చు. అంతే గాక కథాకథనంలో సోమన వినూత్న పద్ధతి నవలంబించి కవిత్రయం కంటె కూడా భిన్న మార్గంలో రచన చేశాడని చెప్పవచ్చు.

సోమన అనువాదాన్ని ఖండానువాదమని విమర్శకులు తలచారు. ఉత్తర హరివంశంలో ఆరు కథలున్నాయి. 1. నరకాసుర సంహారం 2. మృతశిశు పునరుజ్జీవనం. 3. పిశాచద్వయ వృత్తాంతం 4. పౌండ్రకవధ 5. హంసడిభకో పాఖ్యానం 6. బాణాసుర వృత్తాంతం. మూల హరివంశంలో ఎన్నో కథలుండగా సోమన వీటిని మాత్రమే గ్రహించడానికి గల కారణ మరయ వలసి ఉంది. ఈ కథలన్నిటా కృష్ణుడే నాయకుడు. ప్రధాన నాయకుణ్ణి పురస్కరించుకొని సాగిన వృత్తాంతాలివి. హరివంశంలో వర్ణింపబడిన కృష్ణుడుసామాన్యుడు కాడు. అమూర్తమయినట్టిది, సర్వలోక కల్యాణ కారకమైనట్టిది అయిన హరిహరాభేదానికి ఒకానొక ధర్మాద్వైత విధానానికి రూపు కట్టినవాడు కృష్ణుడు. దుష్ట సంహారం, శిష్ట రక్షణం ప్రధానంగా గల కథలే ఇక్కడ స్వీకరింపబడ్డాయి.

**1. పరిహరించిన ఘట్టాలు** : మూలహరివంశ విష్ణు పర్వం 61వ అధ్యాయం నుండి ప్రారంభింపబడిన ఈ హరివంశం ఉత్తర భాగం భవిష్య పర్వాంతం 55వ అధ్యాయంతో సమాప్తమవుతున్నది. ఈ భాగంలో సృష్టి ప్రళయ క్రమాలు, క్షేత్ర నదీనద మాహాత్మ్యాలు, దానధర్మ ప్రసంగాలు, యుగధర్మాలు, పారిజాతాపహరణ, వజ్రనాభవృత్తాంతాలు, నికుంభ సంహారాదులున్నాయి. కథా సంవిధానాన్ననుసరించి సోమన రసపోషణా దృష్టితో సృష్టి ప్రళయాది విషయాలను వదిలిపెట్టాడు. రసదృష్టితో చూస్తే పారిజాతా పహరణ వృత్తాంతం కడు రమణీయమయింది. మూలహరివంశంలో నరకాసుర సంహారానంతరం కృష్ణుడు దేవలోకానికేగి అదితికి కుండలాలనిచ్చి

ఆ దేవి ఆశీస్సులను పొంది, దివ్య వనాల క్రీడార్థం విహరిస్తూ పారిజాతాన్ని చూసి పెకలించుకొని వచ్చినట్టు చెప్పబడింది. ఆ వృత్తాంతాన్ని తెలిసికొన్న ఇంద్రుడు కృష్ణుని ఘన కార్యాలను గుర్తించి మిన్న కుండినట్టు మూలం చెప్తూ ఉంది. తరువాతి అధ్యాయాల్లో సత్యభామ ప్రణయ కోపం, శ్రీకృష్ణ సాంత్వనం వంటి వృత్తాంతాలు చెప్పబడ్డాయి. ముందు అధ్యాయంలో ఒక కారణాన్ని రెండో అధ్యాయంలో ఇంకొక కారణాన్ని చెప్పడం అంత సమంజసంగా లేదు కృష్ణుడంతటి లోకోత్తర వీరుడు ధర్మార్థం కుమారుడని కూడా తలపక నరకుణ్ణి సంహరించిన సమవర్తి దొంగచాటుగా పారిజాత వృక్షాన్ని పెకలించి తెచ్చాడనే మచ్చ సోమన కల్పింపదలచినట్టు లేదు. కాబట్టి ఔచిత్య దృష్టితో ఈ భాగాన్ని సోమన విడిచి పెట్టాడు.

**1.1 షట్పుర వధాదులు** : ఈ కథలు హరివంశ విష్ణు పర్వం 82 నుండి 86వ అధ్యాయం వరకు వర్ణింపబడ్డాయి. అంధకాసుర సంహారాన్ని పార్వతీ వల్లభుడు గావించాడు. అలాగే నికుంభుడనే వాడు భానుమతిని అపహరింపగా కృష్ణార్జున ప్రద్యుమ్నులు అతన్ని అణచడానికి బయలుదేరారు సర్వరాజులను వధించడానికి ప్రద్యుమ్నుడు మాయా కల్పన గావించాడు. అంటే ఈ కథల్లో కృష్ణుడు నాయకుడు కాడనడం స్పష్టం. ఇలాగే మూలంలో వర్ణింపబడిన జలక్రీడాది వర్ణనలు లోక కల్యాణార్థం జరిగినట్టు చెప్పడానికి వీలులేదు. కోరిన వెంటనే మధువులు రావడం, అప్సరసలు స్వర్గం నుండి దిగి వచ్చి నాట్య మాడడం వంటి సన్నివేశాల సంగతాలు, అనౌచిత్యాలుగా ఉన్నాయి. కాబట్టి సోమన ఈ వృత్తాంతాలను కూడా పరిహరించాడు.

**1.2 ప్రభావతీ ప్రద్యుమ్నం** : మూల హరివంశంలో విపులంగా వర్ణింపబడిన కథల్లో ఇదొకటి. వస్తు గౌరవంలో, రామణీయకతలో ఫల విశేషంలో ఉదాత్తమయిన వృత్తాంతమిది ఈ కథలో ప్రద్యుమ్నుడే ప్రధాన నాయకుడు. ప్రద్యుమ్నునికి తోడుగా గదసాంబులిద్దరూ సునాభుని కుమార్తెలను వివాహమాడడం విశేషం. హంస సందేశాన్ని చేరవేయగా తమ తమ నెచ్చెలులను చేరడం ఇందులోని ప్రధాన వృత్తాంతం. ప్రద్యమ్నాది కుమారుల కల్యాణం ముఖ్యం. ఆనుషంగిక ఫలం లోక కల్యాణం. కథా ప్రారంభంలో కూడా కాముని విజయం ముఖ్యమని చెప్పబడింది. ఈ కథను పఠించడం వల్ల పుత్ర పౌత్రాభి వృద్ధి ప్రయోజనం కలుగుతుందని చెప్పబడింది. అంతే గాక ప్రభావతీ వివాహానంతరం తరువాతి అధ్యాయాల్లో ప్రద్యుమ్నాదుల జననం వర్ణింపబడింది. మొదట జననాన్ని చెప్పి ఆ పై విహారాన్ని చెప్పడం

సమంజసం. ఇంకా ఈ కథానంతరం రుక్మిణీ పుత్రుణ్ణి కోరి శ్రీకృష్ణుణ్ణి ప్రార్థిస్తుంది ప్రద్యుమ్నుడు నాయకుడు కావడం వల్ల, శ్రీకృష్ణుని విహారానికి తగిన సంఘటనలు లేని కారణం చేత, కథైక్యతా దృష్ట్యా సోమన ఈ ఘట్టాన్ని పరిహరించాడని చెప్పవచ్చు

మూలంలో విభక్తాలయి వ్యవహితాలుగా పలుచోట్ల కనిపించే ఒకే కథాంశాలను ఒక చోట చేర్చడంలో సోమన నవీన గుణ సనాథత్వం సంవిధాన చాతుర్యం వెల్లడవుతున్నాయి మూల హరివంశంలో బలదేవ మాహాత్మ్యం విష్ణు పర్వం 62 వ అధ్యాయం నరకాసుర సంహారం 63,64 అధ్యాయాలు. మృతశిశు పునరుజ్జీవనం 111 నుండి 114 వ అధ్యాయం వరకు. బాణాసుర వృత్తాంతం 116 నుండి 128 వరకు శ్రీకృష్ణుడు పుత్రార్థి అయి తపస్సు చేయడం భవిష్య పర్వం 73 నుండి 90 వరకు పౌండ్రకవాసుదేవ వృత్తాంతం 91 నుండి 102 వరకు హంస డిభకోపాఖ్యానం 104 నుండి 129 వరకు చెప్పబడ్డాయి కానీ నాచన సోమన బలదేవ మాహాత్మ్యం, నరకాసుర సంహారం, మృత శిశుపునరుజ్జీవనం, శ్రీకృష్ణుడు పుత్రార్థం తపస్సు చేయడం, పౌండ్రక వాసుదేవుణ్ణి సంహరించడం, హంసడిభకోపాఖ్యానం, బాణాసుర వృత్తాంతం అనే రీతి పేర్కొన్నాడు మూల గ్రంథం అర్వం కావడం వల్ల అందులోనివిషయ నివేదనంలో వరుస క్రమం సముచితంగా లేదు. కాబట్టి సోమన కొన్ని మార్పులు చేశాడు

అనిరుద్ధుని వివాహాన్ని చెప్పి ఆ పై అతని తండ్రి ప్రద్యుమ్నుని జననానికి కారణమయిన రుక్మిణీ కాంక్షను చెప్పడం మూలంలోని అసంగతమయిన విషయం. సోమన ద్వితీయాశ్వాసంలో కృష్ణ మాహాత్మ్య కథనంతో ప్రారంభించి మృత శిశు పునరుజ్జీవన వృత్తాంతాన్ని విశదీకరించి ఆ పై రుక్మిణీ దేవి 'సుపుత్రుణ్ణి అనుగ్రహింపుమ'ని కృష్ణుణ్ణి వేడుకోవడాన్ని కూర్చాడు. ఈ రెండు వృత్తాంతాలూ పుత్ర దర్శన లాలసత్వాన్ని తెలియజేస్తుండడం వల్ల ఈ క్రమం సాభిప్రాయమై అర్థవంతమై అలరారుతూ ఉంది. ఇలాగే ఉత్తర హరివంశం అయిదు, ఆరు, ఆశ్వాసాల్లో బాణుని కథను చెప్పడంలో కూడా విశేషార్థముంది. ఉత్తరోత్తరం ఉత్కర్ష అన్నట్టు నరకుని కంటె బాణుడు వరబలగర్వితుడు. కాబట్టి నరకుని పట్ల ప్రత్యక్ష పద్ధతి అవసరం కాగా బాణుని ఎడ పరోక్ష పద్ధతి అవలంబింప వలసి వచ్చింది అంతే గాక ఉషానిరుద్ధుల వివాహం వల్ల కావ్యం మంగళాంతం కావడానికి వీలయింది. ఈ దృష్టితో భవిష్య పర్వంలో గల హంసడిభకోపాఖ్యాన్ని

నాలుగో ఆశ్వాసంలో చేర్చాడు. ఉత్తర హరివంశ కథానాయకుడు కృష్ణుడనడాన్ని నిరూపిస్తూ ఆయన మాహాత్మ్యాన్ని షష్ఠాశ్వాసం 270 వ పద్యంలో -

ఆ " విష్ణు ( గొలిచి వచ్చు విబుధగణం బెల్ల

మృగమయూర గజతురగ ధవళ ప

తత్రి నివహధృత రథంబులు డిగి విష్ణు

వెనుక నగరిలోన( జనిరి యంత" అని నిరూపించాడు దీనివల్ల పరోక్షంగా పురాణాంతంలో చెప్పబడే ఫలశ్రుతి నియమం పాటింప బడిందని చెప్పవచ్చు. సోమన గావించిన ఈ క్రమం వల్ల కథలన్నీ నియత మార్గంలో సాగాయి. వైపరీత్యాలు లేక కావ్యం మంగళాంతం కావడానికి తోడ్పడింది

**2. యథానువాదం :** సోమన తత్త్వ రహస్యాలను, వస్తు విశేషాలను సాంప్రదాయ కాలయిన అలంకార విశేషాలను మాత్రం అవి ఎలాంటి స్వల్పాలు, అప్రధానాలు అయినా తప్పక వర్ణించాడు. హరిహరాభేదత్వాన్ని నిరూపించే శివకృత మయిన విష్ణుస్తుతిని యథాతథంగా తెనిగించడం గుర్తింపదగింది. ఉదాహరణకు

"తతస్తు పర్వతా స్సప్త కేశవం సముప స్థితాః|

జయంతో వైజయంతశ్చ నీలో రజత పర్వతః ||

(హరివంశం-విష్ణుపర్వం 11314)

మహా మేరుః సకైలాస ఇంద్ర కూటశ్చ నామతః |

(హరివంశం-విష్ణుపర్వం 113-15)

అనే సంస్కృత శ్లోకాల్ని

గీ "వచ్చునెడ జయంతంబన వైజయంత

మనగ నీలంబు నారజతాచలంబ

నగ మహామేరు కైలాస నగములన( గ

నింద్ర కూటంబు నా వచ్చె నేడు గిరులు "(2-46) అనే పద్యంలో

తెనిగించడం సోమన ప్రత్యేకత ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు.

"వైశాఖే మాసి హర్మ్య స్థాం ద్వాద శ్యాంత్వాంది నక్షయేం|
రమయిష్యతి యః స్వప్నే సతే భర్తా భవిష్యతి ||"

(హరివంశం-విష్ణుపర్వం 117)

అనే శ్లోకాన్ని

గి " కడఁగి వైశాఖ శుక్ల పక్షంబు నందు
ద్వాదశి దినాంత వేళ సౌధంబు మీఁద
మదన కేళికిఁ గలలోన ఁగదియు నిన్ను
నెవ్వఁడాతండ మగఁడు నీకిందువదన "(5-78) అనే పద్యంలో సోమన అనువదించాడు.

"గృహ మేధం పరిత్యజ్యకిం త్వయా సాధితం పదమ్ |
దంభ యేవ భవాన్ వ్యక్తం శంకే నా స్త్యత్ర కారణమ్ "||

(హరివంశం-భవిష్య పర్వం 111)

"లోకాంశ్చేమాన్ సదా మూఢ నాశయిష్యసి నివృతః|
ఏతాన్ సర్వాన్ వినే తాసి నరకే పాత యిష్యసి ||"

(హరివంశం-భవిష్య పర్వం 111)

అన్న శ్లోకాలు

సీ. అఱుకువ యెఱుకతో నాశ్రమంబిది మెచ్చి
తిది గాక గృహ మేధ యేల యొల్ల
వేపదంబునఁబొందె దిందు మూఢుండవ
కాక సంసార సౌఖ్యంబు మాని
కఱపెదిట్లున్న కొందఱకు నారక పాత

శిలంభుఁ దగునె........ ........(4-50) అన్న సీస పద్యంలో అనువదింప బడ్డాయి.

"అహం త్వం సర్వ గోదేవత్వ మే వాహం జనార్దన|
ఆవయో రంతరం నాస్తి శబ్దైరర్థైర గత్వతే "|| అనే శ్లోక భావం
(హరివంశం-భవిష్య పర్వం 88-60)

సీ. "నీయంద జనియించె నీయందనిఖిలంబు
నడగె నీవాది మధ్యాంత మగుట
నేన నీవన నీవ నేనన వర్తింతు
మిరువుర శబ్దార్థ మేక రీతి "(2-212)

అనే సీస పద్యంలో వ్యక్తీకరింపబడింది.

**3. సోమన స్వతంత్రించి ప్రవేశ పెట్టిన ఘట్టాలు :** నాచన సోమన తన గ్రంథంలో ప్రవేశ పెట్టిన పలు అంశాలను పాత్రల సంభాషణలో చూడవచ్చు. ఇంకా యుద్ధ వర్ణనల పట్ల తిక్కన ఛాయలో నడచిన వాడై సోమన జుగుప్సా వహమయిన యుద్ధ వర్ణనలను కూడా రమణీయంగా చేశాడు. ఈ మహాకవి స్వతంత్రించి ప్రవేశపెట్టిన ఘట్టాలు మూడు 1. ఊర్వశి నరక సంవాదం 2. సత్యభామ నరకునితో యుద్ధం చేయడం 3. కృష్ణుడు రుక్మిణీ సత్యభామలతో జూదమాడడం.

ఊర్వశి నరక సంవాదం ముద్రిత మూల హరివంశ ప్రతులలో కనిపించదు. కానీ నడకుదుటి వీరరాజు పంతులు గారు కొన్ని పాత ప్రతులలో ఊర్వశీ నరకసంవాదముందని తెలియజేశారు. అయితే ఆ లిఖిత ప్రతి లభింపలేదు. ఆంధ్ర ఉత్తర హరివంశాన్ని బట్టి ఎవరయినా సంస్కృతీకరణం చేసి ఉండవచ్చునని విమర్శకులు భావిస్తున్నారు. పొత్తుల సొమ్మయిన ఊర్వశిని తన ప్రాభవం మెరసేటట్టు అనుభవించాలని నరకుడు కోరడం ఈ ఘట్టంలోని ముఖ్య విషయం. ఎత్తుకు పై ఎత్తు వేస్తూ ఊర్వశీ నరకుల సంభాషణను సాగించడం సోమన నైపుణ్యం. ఊర్వశి నరకునితో -

చ. " చతురవచో విలాస ! గుణసాగర! సాగరమేఖలావనీ
పతియగు నీకు నింతులొక బ్రాతియె? నీవిటు గోరుటెల్ల నా
యతులిత భాగ్య; మింత నిజమైన ఁగలంగక మున్న వైభవో
న్నతి మొఱయంగ వచ్చి యొక నాడయినన్ నను గారవించితే."
(1-66)

అని సంభాషించడం ఊర్వశి చతురత్వాన్ని వ్యక్తం చేస్తుంది.

సత్యభామా సహితుడయి శ్రీకృష్ణుడు నరకసంహారార్థం వెళ్లినట్టు తెలుస్తుంది. భాగవత, విష్ణు పురాణాల్లో కూడా ఈవృత్తాంత మిలాగే ఉంది సూర్యోపరిభాగంలో మెరుపుతీగతో కూడిన మేఘంలా భార్యతో గూడిన కృష్ణుడు గరుత్మంతుని మూపు మీద ప్రకాశించాడని చెప్పబడింది. కానీ సంగ్రామంలో సత్యభామకు కూడా సోమన స్థానం కల్పించారు. నరకుడు భూదేవి తనయుడు. సత్యభామ వసుంధర. తల్లి అనుమతి లేక సుతుణ్ణి చంపడం న్యాయం గాదు. సత్యభామ సాక్షిగా కృష్ణ నరకాసురులు పోరాడారు. నరకుడు బాణాన్ని ప్రయోగించి తండ్రి అయిన కృష్ణుణ్ణి తీవ్ర క్షతుని గావించాడు కుమారుని ప్రాణం కంటె భర్త ప్రాణం ముఖ్యం కాబట్టి సత్యభామ యుద్ధం చేయడానికి సిద్ధపడిందని సోమన వ్యంగ్యంగా సూచించాడు.

ఇక మూడవది రుక్మిణీ సత్యభామలతో కృష్ణుడు జూదమాడడం. పౌండ్రక వధానంతరం కృష్ణ బలరాములు ద్వారకలో ప్రవేశింపగా సమస్త యాదవులు కీర్తించారని మూలం చెప్తూ ఉంది కానీ కృష్ణుడు వాళ్లనెలా వినోదింపజేసి సంతోషపెట్టాడో తెలియజేయలేదు. కాబట్టి సోమన తన కాలం నాటి పరిస్థితుల కనువయిన జూదమాడడాన్ని జత చేసి ఈ వృత్తాంతంలో దేశీయతను పోషించాడు. మూలానుసారంగా యాదవులు ఆనందించారని తెలిపి ఆపై వైశంపాయనుడు జనమేజయునితో "అట్టి యెడ యొక్క విస్మయంబు వినంగలద వధరింపుమని " (3-108) జూదమాడడాన్ని ప్రవేశపెట్టాడు.

**4. మూలాన్ని పెంపుగావించిన విధానం :** మూలంలో కథా ప్రధానాలయిన శ్లోకాలుండగా సోమన రసపోషణకై ఆయాభావాలను పెంచి కావ్య పాత్రల నన్నిటినీ సజీవం చేసి మన కళ్ల ముందు అటు ఇటు నడయాడే టట్టుగా చేశాడు. మూలంలోని ఒక వాక్యాన్ని గానీ, ఒక మాటను గానీ లేదా వస్తువును గానీగ్రహించి విపులీకరించడం సోమన విధానమవుతుంది.

కృష్ణుని దగ్గరకు ఒక బ్రాహ్మణుడు వచ్చి తన కుమారుణ్ణి రక్షింపుమని ప్రార్థించే సమయంలో మూల హరివంశంలో -

"....................ద్వి జోత్తమః |

కృష్ణం విజ్ఞాప యామాస త్రాహిత్రాహీతి చాబ్రవీత్ ||"

(హరివంశం-విష్ణుపర్వం 112-8)

రక్షాధికారో భవతః పరిత్రాయ స్వమాం విభో ।

చతుర్థాంశం హి ధర్మ స్యరక్షితా లభతే ఫలమ్ ॥"

(హరివంశం-విష్ణుపర్వం 19-23)

అని రక్షాధికారి అయినవాడు పొందే చతుర్థాంశ ధర్మఫలాన్ని 'నీవు పొందగలవని బ్రాహ్మణుడు కృష్ణుణ్ణి ప్రలోభ పెట్టినట్టు, సామాన్యుడికి ధర్మోపదేశం గావించినట్టు వర్ణింపబడింది. కానీ ఇక్కడ నాచన సోమన కాతరుడయిన బ్రాహ్మణుని వేషాన్ని సహజంగా వర్ణిస్తూ ఆయన దీనాతి దీనుడయి "మురాంతక! మందరధర!భక్తలోక మందార!" (2-8) అనే రీతి విపత్సమయంలో భగవన్నామాన్ని సంస్మరించినట్టు వర్ణించి మూలంలో గల ప్రలోభాన్ని వదలిపెట్టాడు. తన కాంక్షను తీర్చవలసినట్టి అవసరం ఎదుటి వ్యక్తి హృదయాన్ని హత్తుకొనే టట్టు "తడియెత్తు చీరతో దాది కౌగిట చేర్చి చూపంగకన్నార చూడనైతి............................... ... ..

.............లేబరమకాదె బిడ్డలు లేని బ్రతుకు "(2-16) అని వర్ణించడం సోమన ప్రత్యేకత.

రుక్మిణీదేవి తనకు సుపుత్రుణ్ణి అనుగ్రహింపుమని శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించిన సందర్భం మూలంలోని కింది శ్లోకాల్లో చోటు చేసికొంది.

"ద్వారవత్యాం జగన్నాథో వసన్ వృష్ణిభరీశ్వరః।

రుక్మిణ్యా సంగతో దేవో వసంత స్తత్ర పురే హరిః॥

(హరివంశం-భవిష్యపర్వం 73-18)

పుత్రమిచ్ఛామి దేవేశత్వత్తో మాధవ నందనమ్ ॥

(హరివంశం-భవిష్యపర్వం 73-20)

కృష్ణుడు ద్వారకలో రుక్మిణీ దేవితో నివసిస్తూ హరి ఉండగా ఒక నాడు రుక్మిణి కోరికను వ్యక్తం చేసినట్టు చెప్పబడింది. ఇందులోని సూచనను గ్రహించి సోమన ".......రుక్మిణీ హంసీహారమృణాళ హారి భుజమధ్య స్ఫారకాసారుడై, సంసారార్ణవ సార మన్మథ సుధాపారంబునందేలగన్" (2-72) అని వర్ణిస్తూ జగన్నాయకుణ్ణి ఉపలాలనలో సుఖింప జేశాడు. రుక్మిణీ దేవిని "యమునా తరంగ డోలాధిరోహణమున డంబు మీఱెడు మరాళంబు వోలె............రమ్యా గుణమణి రుక్మిణి రమణిప్రీతి "(2-73) అని వర్ణించడం.

పుత్ర సంబంధమయిన కోరికకు అనువుగా ఉంది. రుక్మిణి చిత్తవృత్తిని "....లేనగవు శృంగారంబుగా కన్నులం బారం బేదని లజ్జ తోప" (2-74) అని వర్ణించడం రమణీయం. రుక్మిణిలో భక్తినే గాక స్నేహాన్ని కూడా జోడించడం విశేషం.

శ్రీకృష్ణుడు కైలాసాని కేగ సంకల్పించి యాదవ సంఘాన్నంతటిని ఒక చోట చేర్చి మాట్లాడిన సందర్భంలో మూలంలో -

"పాషాణైః కర్షణీ యైశ్చ సన్నద్ధా భవత స్వ కైః|

పిధాయ చకవాటాని మహా ద్వారాణి యత్నతః ||"

(హరివంశం-భవిష్య పర్వం 74-23)

అని కేవలం పాషాణాలను, కర్షణీయాలను గొని సన్నద్ధులయి మహాద్వార కవాటాలను బంధించి ఉంచండని చెప్పినట్టుంది. కానీ సోమన తన కాలంనాటి పరిస్థితుల కనుగుణంగా నగర రక్షణలనన్నిటిని " కోట సింగారించి కొత్త ళంబుల నెల్ల నట్టళ్ళు పన్నించి "(2-92) అన్న పద్యంలో వర్ణించాడు.

శ్రీకృష్ణుడు బదరికాశ్రమం చేరిన సందర్భంలో అక్కడి మునులు -

"ఇదమర్ఘ్య మిదం పాద్య మిదం విష్టరమే వచ|

కృతార్థాః సర్వదా దేవ ప్రసన్నో నో జగత్పతిః ||" అని ప్రార్థించినట్టు

(హరివంశం-భవిష్యపర్వం 75)

మూలంలో ఉండగా ఆ భావాన్ని ఇంకా రమణీయంగా ఉండేటట్టు "ఆకాశ గంగ నీయడుగున ( బొడమె నీకిట్ల ర్ఘ్య పాద్యంబు లిచ్చు టెంత..... ....మా భక్తియెంత! మా యెఱుకమెత! మాతపోబలమెంత ! మామనికి యెంత" (2-115) అని సోమన వర్ణించాడు. స్వామికి స్వయం ప్రకాశకాలయి ఒప్పే వస్తు విశేషాలను సూచించి పాద్యాదులెంత! అనడంలో చమత్కారం వ్యక్తమవుతుంది.

ఘంటా కర్ణుడనే పిశాచ విభుడు కృష్ణుణ్ణి చూసి "పిశాచ గణ సేవిత మై నిర్మానుష్య ప్రదేశమున తిరుగుచున్న నీవెవడవు? నన్ను ప్రీతింజేయ వచ్చిన నవరవిష్ణువా?" అని అడిగినట్టున్న మూల శ్లోకాలను అనువదించేటపుడు సోమన ద్వితీయాశ్వాసంలో -

ఉ. " ఎక్కడి వాడవన్న కడు నీరపు ( గాఱ డవింజరించెదీ
చక్కని మేనునీ గరువచందము నెందును గాన మక్కటా!
నిక్కము మాకు ( జిత్తములు నీరగుచున్నవి క్రూరసత్త్వము
లెక్కలి గొన్న ( జొక్కి పడదే మదిలో నిను ( గన్న తల్లియున్ "
(ఉత్తర హరివంశం 2-132)

అని కరుణ రస పూరితంగా వర్ణించాడు

పౌండ్రకుని నగరానికి నారద మహర్షి రావడాన్ని గురించి చెప్పిన పద్యంలో సోమన సమకాలిక ప్రభువుల వీర విహారాలను పొందుపరచాడు ఇలాగే స్వప్నంలో ఉషాకన్య పురుష సంగమం పొందినట్టు కలగని దుఃఖిత అయి చెలికత్తెలతో బాధపడే ఘట్టాన్ని కూడా సోమన -"మాతండ్రి కొలువులో మానినీ లకంబ రమ్మను నాపేరు వమ్ముపోయె "(5-90) అనే పద్యంలో విపులీకరించాడు.

బదరికాశ్రమాన్ని గురించి మూలంలో -'శత్రవో మిత్రతాం యాన్తి'అని ఉండగా సోమన నన్నయ పద్ధతిని గాక " పవన వేగ విశీర్ణ పాదపాగ్రంబులజడియకుండగ .బట్టు సామజములు " (2-109) అని ఆయా జంతువులు చూసిన వెంటనే పాడు చేసే వస్తు విశేషాలను పేర్కొని వాటి రక్షణకై ఆయా జంతువులు కాపుండడాన్ని వర్ణించి నవ్యతను ప్రదర్శించాడు.

కోట పట్టడానికి తగిన సాధనాలు, మల్లయుద్ధ, గదా యుద్ధ విశేషాలన్నీ చాలా వరకు సోమన స్వతంత్రించి రాసినవే.

**5. సంక్షేపించిన ఘట్టాలు :** నాచన సోమన మూల హరివంశ ఉత్తర భాగం నుండి రసవత్తరమయిన కథలను మాత్రమే గ్రహించి తక్కిన వాటిని అనువదింపక విడిచిపెట్టడమే గాక స్వీకరించిన కథల్లో సయితం కథాగమనానికి అడ్డు వచ్చేవి, సుదీర్ఘాలయినవి అయిన వర్ణనాంశాలను తొలగించాడు. శ్రీకృష్ణుడు నరక సంహారార్థం ప్రాగ్జ్యోతిషం ప్రవేశించిన సందర్భంలో ముర నిశుంభాదుల తోడి యుద్ధాన్ని మూలం విస్తరింపగా సోమన ఒక్కొక్క పద్యంతో ప్రధాన విషయ నివేదన గావించాడు. మృత బ్రాహ్మణ కుమార వృత్తాంతంలో కృష్ణుడు తానే సర్వమనడాన్ని మూలం విస్తరింప జేయగా సోమన "అపుడు తేజోమయంబైన రూపంబు " (2-58) అనే ఒక సీస పద్యంలో సంగ్రహించాడు. రుక్మిణి కృష్ణుణ్ణి పుత్ర భిక్ష అడిగిన సందర్భంలో కృష్ణుడు "................పుత్రార్థం, బైనది నీకోరిక ....."(2-

82) అని చెప్పడం సమంజసంగా ఉంది.

మూల హరివంశంలో నారద మహర్షి ద్వారకకు రావడం

"తతః కైలాస శిఖరాన్నిర్గతో మునిసత్తమః|

నారదః సర్వలోకజ్ఞః పౌండ్రస్య నగరం ప్రతి "||

(హరివంశం. భవిష్య పర్వం 91-16)

అని ఉండగా నారదాగమనాన్ని సోమన అలంకార యుక్తంగా వర్ణిస్తూ "కైలాసంబున నుండి వచ్చె కలహోత్క స్వాంతుడచ్చోటికిన్ "(3-9) అని జరగబోయే వృత్తాంతాన్ని సూచించాడు. హరికి పౌండ్రకునికి గల అంతరాన్ని ఎన్నడానికి సాత్యకి పౌండ్రకుల సంవాదాన్ని సోమన విపులీకరించాడు.

హంసడిభకోపాఖ్యానంలో హంసడిభకుల వల్ల అవమానితుడయిన దుర్వాసుడు కృష్ణుని దగ్గరకు వచ్చి -

"ఇద మప్య పరం పశ్యతయోః సాహస చేష్టితమ్|

కౌపీనం బహుధా ఛిన్నంత దస్మాకం మహాధనమ్ "||

(హరివంశం. భవిష్య పర్వం 111-61)

అని చెప్పినట్టు మూలంలో ఉండగా సోమన నాటకీయతను చేపట్టి "ఈ కమండలు పఙ్క్తినెటుచూతు నిట్ల తత్పాప మస్త్రంబులు వగులకున్న.........మునులలోపల నాలుక ముల్లు విఱిగె " (4-102) అని వర్ణించాడు. ఇలాగే జనార్ధనుడు తాను ద్వారకలో దర్శింప బోయే కృష్ణుణ్ణి గురించి చెప్పే పద్యం కూడా సోమన రచనా చాతుర్యానికి ఉదాహరణ. "వెలిదమ్మిలో లేత వెన్నెలో యమృతమో కన్నులో చిఱునవ్వో కనికరంబో " (4-138).

బాణాసురోపాఖ్యానంలో బాణుడు తనతో తగిన విధంగా పోరాడే వాళ్లు లేరని శివుణ్ణి ప్రార్థించే ఘట్టాన్ని సోమన యథాతథంగా అనువదిస్తూ "ఖురఖలీనాఘాత కోలాహలంబుతో నేమి నిర్ఘోషంబు నెఱపలేదు................లేదు రాజ్యంబు గలిగియు లేదు ఫలము "(5-19) అని వర్ణించడం విశేషం. మూలంలో పుత్ర ప్రాముఖ్యాన్ని గురించి శ్రీకృష్ణుడు "పతియె భార్య గర్భము నందు పుత్రుడుగ జన్మించును. పుత్రవంతులను గాంచి ఇంద్రుడు గూడ భయపడును. కుపుత్రుని కంటె వంధ్య మేల"ని ఉపన్యాసమిచ్చినట్టుంది.

కానీ సోమన "మానిని !వినవే 'పున్నామ్నో నరకత్రా_యతే'యనుట పుత్రార్థం, బైనది నీ కోరిక నా, మానసమలరించె వేద మార్గోచితమై " (2-82)అని దాంపత్యానికి పరమావధి సంతానాపేక్ష అనడాన్ని కృష్ణుని ద్వారా నిరూపింపజేశారు.

పౌండ్రక సమర వృత్తాంతంలో మూలం "ఏకలవ్య సైన్య వధః" అని ఒక ప్రత్యేక అధ్యాయాన్ని చెప్పగా సోమన దాన్ని సంగ్రహించాడు. ఏకలవ్యుడు పౌండ్రకునికి సహాయుడే గానీ ప్రతినాయకుడు గాడు. ఎలాంటి బలపరాక్రమాదులు కలిగి ఉన్నా బలరాముని చేతిలో ఓడినవాడే. కృష్ణునితో ప్రత్యర్థిగా పోరి అపజయాన్ని గానీ మృత్యువును గానీ పొందలేదు. కాబట్టి తగని వ్యక్తికి ప్రాదాన్య మివ్వడం సోమనకు నచ్చలేదనడం స్పష్టం.

హంసడిభకోపాఖ్యానంలో దుర్వాసమహర్షి శ్రీకృష్ణుణ్ణి నుతించిన భాగం మూలంలో కాస్త విపులంగా ఉంది. కానీ సోమన ఔచిత్యాన్ని పాటించి స్వామి సర్వాధికుడు, సర్వజ్ఞుడు అనడాన్ని స్పష్టపరచి రసపోషణ గావిస్తూ కథాగమనంకుంటు వడక రచన సాగించాడు. "ఏనెఱుంగుదు నిన్ను నేల నాతోడనే వెడమాయములు బ్రహ్మ వేత్త లెఱుగు " (4-95) అనే పద్యంలో ఇందుకు ఉదాహరణ.

బాణాసురోపాఖ్యానంలో ఇందుధర విహార సమయంలో ఉషాదేవికి మనోజాకాంక్ష కలిగింది. పార్వతి 'త్వరలో అలాంటి సుఖం నీకూ కలుగుతుందని' ఉషతో చెప్పి అంతర్హిత అయింది. నాటి నుండి ఉష విరహ బాధకు లోనైనట్టు, తల్లి వైద్యులను పిలవనంపగా వాళ్లు పరీక్షించి దృష్టి దోషం కలిగిందని రక్షాబంధాలిచ్చి వెళ్లారనీ ఆ పై తల్లితో ఉష యధార్థ విషయాన్ని చెప్పిందనీ మూలం వివరిస్తున్నది. ఇంకా ఈ ఘట్టం తరువాత స్వప్న వృత్తాంతం, ఉషాదేవి పరితాపం, విరహ వర్ణనలు సాగాయి. కాబట్టి సోమన ఔచిత్య దృష్టితో ఆమెకు పురుష సందర్శనానికి ముందు కలిగిన విరహాన్ని పరిహరించాడు.

బాణాసురోపాఖ్యానంలో అనిరుద్ధుడు దుర్గాదేవి వల్ల పొందిన వరంతో నాగపాశ బంధ విముక్తిని పొందినట్టు మూలం చెప్తున్నది. అలాగే శ్రీకృష్ణుడు గరుడా రూఢుడయి వచ్చిన సమయంలో గరుడుణ్ణి చూసి సర్పాలు తొలగినట్టు ఇంకొకచోట వర్ణింపబడింది. పూర్వాపరాలకు విభేదముండడం వల్ల సోమన ఔచిత్య దృష్టితో రెండవదాన్నే గ్రహించాడు.

మృత శిశు పునరుజ్జీవన వృత్తాంతంలో అర్జునుడు బ్రాహ్మణ పుత్రుణ్ణి రక్షించడం తెలియక వైష్ణవీ విద్య నాధారంగా స్వర్గ పాతాళాది లోకాల కేగి అక్కడ బ్రాహ్మణ బాలకుణ్ణి చూడలేకుండడాన్ని మూలం ప్రస్తావించింది అంతేగాక వ్యర్థ ప్రయత్నుడై అర్జునుడు అగ్నిలో ప్రవేశించడానికి సిద్ధంకాగా కృష్ణ ప్రద్యుమ్నాదులు నివారించడం అనే భాగాన్ని సోమన విడిచిపెట్టి వ్యర్థ ప్రయత్నుడయిన అర్జునుణ్ణి కృష్ణుడు బుజ్జగించినట్టు మార్పు చేసి రాశాడు.

తత్త్వ కథనంలో యథానువాదాన్ని, ఔచిత్య పోషణలో ఒకింత మార్పును రసదృష్టితో విస్తరణను సోమన తన అనువాదంలో పాటించాడని చెప్పవచ్చు.

★★★

## 6: ఉత్తర హరివంశం : స్త్రీపాత్రలు :

ప్రాచీనాంధ్ర కృతులలో దురవబోధాలనబడే వాటిలో ఉత్తర హరివంశం కూడా ఒకటి. దీనికర్త నాచనసోమనాథుడు. ఉత్తర హరివంశం ఆరాశ్వాసాల గ్రంథం. నరకాసుర వధ, శ్రీకృష్ణుడు బ్రాహ్మణ పుత్రుణ్ణి బ్రతికించడం, పుత్రార్థి అయిన శ్రీకృష్ణుడు కైలాసగిరి మీద తపస్సు చేయడం, పౌండ్రక శ్రీకృష్ణుల యుద్ధం, హంసడిభో పాఖ్యానం ఉషా పరిణయంతో కూడిన బాణాసుర వృత్తాంతం ఈ గ్రంథంలోని ప్రధాన ఘట్టాలు. సోమన ఆశ్వాసాంత పద్యాల్లో 'శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనా మాత్య పుత్ర బుధ రాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహా భారత కథానంతరంబున' అని తిక్కన నామస్మరణ చేసి ఉండడం వల్ల తిక్కనకు పరోక్ష శిష్యుడు సోమన అని తెలుస్తుంది. తిక్కన తన కృతిని హరిహరనాథునికి సమర్పించి నట్టే ఈయన కూడా తన గ్రంథాన్ని హరిహరనాథునికంకిత మిచ్చి తన భక్తిని చాటుకొన్నాడు.

పాత్రపోషణ, రసపోషణ, విచిత్ర పద ప్రయోగం, జాతీయాలను వాడడం, సామెతల్ని చొప్పించడం వంటి విషయాల్లో సోమన అందెవేసిన చేయి. సాదారణంగా కవుల పాత్రపోషణా నైపుణ్యం సన్నివేశాల్లో, విశేషణాల్లో సంబాషణల్లో కాన వస్తుంది. పాత్రపోషణ కావ్యానికి జీవం వంటిది.

కావ్యంలో పాత్రపోషణ రెండు విధాలు కవి ఒకానొక పాత్రను గురించి తానే చెప్పడం. ఇది ప్రత్యక్ష మార్గం. ఆ పాత్రను గురించి ఇతర పాత్రలచే చెప్పించడం. ఇది పరోక్ష మార్గం. ఈ మార్గాన్ని అవలంబించిన వాళ్లలో సోమన కూడా ఒకడు. పాత్రల కనుగుణమయిన ప్రవర్తనను తదనుగుణమయిన పలుకుల్ని ప్రయోగించడంలో నాచన సోమన, తిక్కన మార్గాన్ననుసరించాడు. ఈయన చేసిన పాత్రపోషణను గురించి తెలిసికోవడానికి ముందు గ్రంథంలో గల పాత్రల్ని పరికింపవలసి ఉంది. ఆ పాత్రలు జాతిని బట్టి మూడు విధాలు. దైవత్వ, రాక్షసత్వ మానవత్వాలు గలిగినవి. లింగభేదాన్ననుసరించి పురుషపాత్రలు, స్త్రీ పాత్రలు అని రెండు రకాలు. ఉత్తర హరివంశంలో కనిపించే ముఖ్యమయిన పురుషపాత్రలు నరకుడు, శ్రీకృష్ణుడు, ఇంద్రుడు, అర్జునుడు, శివుడు, పౌండ్రకుడు, హంసడిభకులు, బాణుడు. అలాగే ముఖ్యమయిన స్త్రీపాత్రలు - ఊర్వశి, సత్యభామ, వసుంధర, రుక్మిణీదేవి, ఉషాకన్య, చిత్రరేఖ.

ఉత్తర హరివంశంలో నాటకీయతతో కూడిన ఘట్టం ఊర్వశీనరక సంవాదం నరకుడు స్వర్గాన్ని జయించి సభామండపంలో ఉన్న ఉన్నత రత్న సింహాసనా సీనుడయి ఊర్వశిని తోడి తెమ్మన్నాడు ఆమె దిట్ట కాబట్టి భయకారణంతో " తొడవులూడ్చిన నైన దొయ్యలి రూపుతో జిన్నబోయిన పట్లు "(1-57) చెన్ను. మీరిన విధంగా వచ్చింది సోమన వాడిన బయలు మెఱయ. క్రమము దెలుప, ఆకగొలుప అనేవి ఊర్వశిరాకకు ఇంకా విశేషణాన్ని అతిశయింపజేస్తున్నాయి తనను పొందితే ఉభయ లోక సుఖాలను పొందవచ్చునని నరకుడు చెప్పగా "చతురవచో విలాస! గుణసాగర! సాగరమేఖలావనీపతియగు నీకు నింతులొక బ్రాతియె"(1-66) అని ఊర్వశి నరకుణ్ణి కొనియాడింది ఊర్వశి పొత్తుల తొయ్యలి నరకుడు రక్కసిరాయడు. వాని మీద వలపు లేకపోవడంతో పలుమార్గాలతో తప్పించుకో జూచిన ఊర్వశి చివరకు మాయనవ్వు నవ్వుతూ 'యాగభాగముల కధికారివి కాని నీ మగతనమేటికి?' అని నిందించింది 'ఒకనాడూర్వశి మాట పొందూహించి' నరకుడు మునలనణచాడు ఇక్కడ 'మాటపొందు' ఉంది గానీ ఊర్వశిని 'పొందు మాట' లేకుండడం గమనింపదగింది. సోమన వాడిన లంజియ, మిండతీకం వంటి పదాలు విరసాలు కావచ్చు. సామీప్య సన్నిహితత్వాల వల్ల విరసంగా కనిపించడం సహజం అలా చూస్తే ఎర్రన హరివంశంలో నరకుడు " అరవిందానన! సత్కరింపుము మనోజానీక సంక్రీడలన్" (హరివంశం ఉ.భా 4-42) అనడం కూడా అసభ్యమే అవుతుంది. ఇంకా లంజియ వంటి మాటలు తెలుగులో వాత్సల్య పూరితాలు ఊర్వశీ నరక సంవాదం, జుగుప్సావహమని, రసముల్లసితం కాదని కొందరి మతం. కానీ ఇలాంటి పాత్రల్ని విమర్శించేటప్పుడు సీతారాముల్ని మనసులో ఉంచుకోకుండా రంభారావణాదుల్ని తలచుకోవాలి.

నరకాసురవధలో శ్రీకృష్ణునికి సహాయపడిన వ్యక్తి సత్యభామ. నరకునితో పోరి మూర్ఛబోయిన భర్తను చూసి ఆమె శార్ఙాన్ని అందుకొన్నది వాడి బాణాలను నరకుని మీద కురిపించింది బెదిరించే గర్జన లాంటి శబ్దాన్ని, నాటుతూ సంధాన హస్తంతో భయఎడక సత్యభామ యుద్ధం చేసింది. మెరుపుతీగలనుండి వెలువడుతున్న ఉరుములతో కూడిన పిడుగుల్లా ధనుస్సు అనే మేఘాన్నుండి బాణాలనే క్రూరమయిన పిడుగుల్ని నరకునిపై విడిచింది. అరిని (నరకుణ్ణి) హరిని (శ్రీకృష్ణుణ్ణి) చూస్తూ దరహాసామృతంతో ఆమె సంగ్రామసీమలో విజయం సాధించింది. సత్యయుద్ధ కౌశలానికి మెచ్చి కృష్ణుడు ముందుగా రుక్మిణి అడిగిన కంఠాభరణాన్ని కూడా సత్యకే ఇచ్చాడు

నరకుడు తన అస్త్రలాఘవాన్ని ప్రదర్శిస్తూ సత్యమీద మర్మభేదాలయిన బాణాలను కురిపించాడు. ఆ బాణాలు సత్య అవయవాల్లో అక్కడక్కడ గుచ్చుకొని ఆమె సింగారించిన కుసుమ భూషణాల కొక కొత్త సింగారాన్ని కలిగించాయి. సత్యయుద్ధ కౌశలాన్ని మెచ్చుకొన్న కృష్ణుడు 'నీవు సమరంబె కోరుదు' అంటూ ధనుస్సునందించాడు. నరకుడు భూదేవి పుత్రుడు. సత్యభామ భూమాత. పుత్రుడు తండ్రి మీద బాణాలనుప్రయోగించాడు. తండ్రిసొమ్మసిల్లాడు. కుమార రక్షణం కంటె భర్త రక్షణం అవసరం. కాబట్టి సత్యభామ యుద్ధం చేయడం సమంజసమే అవుతుంది. నరకాసురుని వృత్తాంతంలో సత్య యుద్ధకౌశలాన్ని చక్కగా ఎరిగిన వీరవనితగా పతిప్రాణాలను కాపాడుకోవడంలో వెనుకాడని వీరపత్నిగా, దుష్టుడయిన కుమారుణ్ణి సంహరించడంలో నిష్పక్షపాతంతో వ్యవహరించిన వీరమాతగా మనకు కనిపిస్తుంది.

కృష్ణుడు దేవేరులతో జూదమాడే సమయంలో సత్యభామ మనస్తత్వాన్ని సోమన చక్కగా వర్ణించాడు. సహజంగా సత్య ఈర్ష్యా స్వభావురాలు కృష్ణుడు ముందు సత్యను చూసి 'నెత్తమాడుమ'ని పలికాడు. కానీ సత్య "జూదజీవి, సుమాళివి" అని వ్యంగ్యంగా కృష్ణుణ్ణి ఉడికించింది.అప్పుడు ఆ దశను చూడక 'జాంబవతిని పిలుపుమ'ని కృష్ణుడాదేశించాడు సత్య అసూయతో కృష్ణుణ్ణి తూలనాడింది.

శ్రీకృష్ణుడు చక్రాన్ని ప్రయోగించి నరకుణ్ణి సంహరించిన తర్వాత మాగువారిన చంద్రమండలంలా వదనారవిందం వన్నె దరిగినట్టు ఒక కాంత కానవచ్చింది. ఆమె వసుదేవ నందనుని ముందు నిలిచి "ఏను వసుంధరన్ యుదుకులేశ దయాకరసూకరాకృతిం, బూనిని నాడు నీవు నను బొందిన బుట్టినవాడు వీడు..." (1-181) అని పలికింది. 'ఇచ్చినవాడు గైకొన్నవాడు భగవంతుడు. దీనికి బాధపడనేల?' అని పుత్రశోకాన్ని వెలిబుచ్చింది. 'మునులకోరిక తీర్చడానికి, దేవతలను రక్షించడానికి పుత్రుణ్ణి చంపితివ'ని భూమాత విలపించింది. ఇలా తల్లి దుఃఖాన్ని వసుంధర ద్వారా వ్యక్తీకరింపజేశాడు నాచనసోమన

వేదకాలపు ధర్మపత్నిగా కానవచ్చే రమణీతిలకం రుక్మిణీ దేవి. ఆమె వినోదైకాంత గృహంలో-

గీ "అఖిల లోకైక నాథ! నీయట్టి రూప
విక్రమౌదార్య శౌర్య వివేక నిలయు
నొక కుమారుని దయచేసి యుర్విలోన
గడుపు చల్లని కాంతల గలుపు నన్ను"
(ఉత్తర హరివంశం 2-75)

అని తనకొక సుపుత్రుణ్ణి అనుగ్రహింపుమని శ్రీకృష్ణుణ్ణి కోరింది. 'యమునా తరంగ డోలాధిరోహణమున డంబు మీఱెడు మరాళంబు వోలె '(2-73)అని వర్ణింపబడడం పుత్ర సంబంధమయిన కోరికకు అనువుగా ఉందని చెప్పవచ్చు రుక్మిణీ చిత్తవృత్తిని లేనగవు శృంగారంబుగా కన్నులం బాఱంబేదని లజ్జలోప" (2-74) అని సోమన వర్ణించడం రమణీయంగా ఉంది. ఇక్కడ రుక్మిణిలో భక్తినే గాక స్నేహాన్ని కూడా జోడించడం విశేషం.

బలిచక్రవర్తి కుమారుడయిన బాణుని కుమార్తె ఉష ఉషాదేవి మనస్సులో ముందుగా శృంగార సంబంధమయిన భావాంకురానికి ప్రాతిపదిక పార్వతీ పరమేశ్వరుల గూడి వచ్చిన అప్సరసల నాట్యం.వన, జల కేళుల వల్ల ఉషకు ఒక కోరిక జనించింది. "దెందము మీద జెందొవకు దెప్పరమేమియు లేదు చన్నులం జిందదు..."(5-131) అన్న పద్యంలో ఉషకు పదకొండు సరఅవస్థలు కలిగినట్టు వర్ణింపబడింది.

గీ "కడగి వైశాఖ శుక్ల పక్షంబునందు
ద్వాదశి దినాంత వేళ సౌధంబు మీద
మదన కేళికి గల లోన గదియు నిన్ను
నెవ్వడాతండ మగడు నీ కిందువదన"
(ఉత్తర హరివంశం 5-78)

అని పార్వతి ఉషతో త్వరలో అలాంటి సుఖం నీకూ కలుగుతుందని చెప్పి అంతర్హితయింది. నాటి నుండి ఉష విరహబాధకు లోనైనట్టు చెప్పబడింది. 'కలలో కుమారుడొక డేమో చేసెన్' అని వర్ణింపబడడం వల్ల ఉషాదేవి స్వప్నవృత్తాంతం వ్యక్తమవుతూ ఉంది. అంటే ఉషానిరుద్ధుల సమాగమ వృత్తాంతం సూచింపబడింది. తన స్వప్న వృత్తాంతాన్ని, ఉష తన చెలికత్తె చిత్రరేఖకు చెప్పి పరితపించింది. చిత్రరేఖ బాణుని గొప్పదనాన్ని గురించి చెప్పి ఉషాకన్యను ఓదార్చింది. అప్పుడు ఉష "మాతండ్రి కొలువులో మానినీ తిలకంబ రమ్మను నాపేరు వమ్మువోయె" (5-90) అని పలువిధాల దుః ఖించింది. తనకు కాగల భర్త 'ఏదంపతులకు పొడమెనొ, యేదేశ మునందు కీర్తికెక్కిన వాడో'(5-106) అంటూ బాధపడింది. చిత్రరేఖ ద్వారా సూచింపబడిన చిత్రంలో తన మనోరమణుడయిన అనిరుద్ధుని కనుగొంది. చివరకు చిత్రరేఖ

సహాయంతో ప్రద్యుమ్నకుమారుడయిన అనిరుద్ధుణ్ణే భర్తగా పొందింది. పార్వతి ద్వారా స్వప్న వృత్తాంతాన్ని వరంగా పొందిన బేలగా, చిత్రరేఖ సహాయంతో అనిరుద్ధుణ్ణి భర్తగా పొందిన సాహసిగా ఉష చిత్రింపబడింది.

ఉషానిరుద్ధుల వివాహానికి కారణభూతురాలు చిత్రరేఖ. ఈమె బాణాసురుని మంత్రి కుంభాండుని కుమార్తె. ఉషాదేవి తన స్వప్న వృత్తాంతం తెలియజేయగా చిత్రరేఖ 'నలిన దళాక్షి! నీవు బలినందను కూతుర విట్టి నిన్ను మొక్కలమున నొక్కరుండుదన కౌగిట జేర్చునె?" (5-85) అని బాణుణ్ణి ప్రశంసించింది. తాను గీసిన చిత్రపటంలో ఉషాకన్య గుర్తించిన వ్యక్తిని 'ఏడురోజుల్లో తెచ్చి ఇవ్వగలనని' మాట ఉచ్చింది ఉషను బుజ్జగించింది ప్రద్యుమ్నకుమారుడయిన అనిరుద్ధుని వృత్తాంతాన్ని తెలియజేసింది యదువీరనగరానికి ప్రయాణమయ్యింది. మార్గమధ్యంలో నారదుణ్ణి కలిసి సంగతి తెలియజేసింది. ఆయన వల్ల తామసీ విద్యను పొందింది

కం. "తన మనుమని గొని పోయిన
మనమున గోపించె నేని మధుసూదనుడే
మని శాపమిచ్చునో నా
కనుతలకున నీకు జెప్పకట పోవెఱతున్"

(ఉత్తర హరివంశం 5-183)

అని నారదునితో తాను చెయబోయే పనికి కృష్ణుడు తనను శపిస్తాడేమోనన్న భయాన్ని కూడా చిత్రరేఖ వ్యక్తం చేసింది. అప్పుడు నారదుడు ' నాచేసిన సంవిధానంబున నీవు నిశ్చింత గా ననిరుద్ధుంగొని పొమ్ము ' (5-184) అని ప్రత్యుత్తరమిచ్చాడు. తరువాత చిత్రరేఖ తన నైపుణ్యంతో అనిరుద్ధుణ్ణి ఉషాంతః పురానికి దెచ్చి - " ఇది నీ కోరిన ఫలమ'ని చూపింది. చిత్రరేఖ చేతలన్నీ అత్యంత చిత్రమని ఉష మనసున సంతసించింది. చిత్రలేఖనంలో ప్రజ్ఞావంతురాలిగా, పలు మాయావిద్యల నెరిగిన ప్రతిభాశాలినిగా, ఉషానిరుద్ధుల సమాగమానికి ప్రధాన కారణభూతురాలిగా చిత్రరేఖ చిత్రింపబడింది.

ఇలా శ్రీ మత్సకల భాషాభూషణుడు, సాహిత్య రసపోషణ సంవిదాన చక్రవర్తి, నవీనగుణసనాథుడు అయిన నాచన సోమనాథుడు పాత్ర పోషణలో పేరెన్నికగన్న కవివతంసుడుగా కనిపిస్తాడు. ఈయన పాత్ర చిత్రీకరణ అనంతర ప్రబంధ కవులకు మార్గదర్శకమయ్యింది.

(నవభారతి, డిశంబరు 1979)

★★★

# 7. సోమన తీర్చిన జనార్దనుడు

ఆంధ్ర సాహిత్యంలో ఉత్తమోత్తములన దగ్గ కవుల్లో నాచన సోమన ఒకడు. సోమన కవిత్వ సంపదే ఆయనకు ఉత్తమ స్థానాన్ని సంపాదించి పెట్టింది. సోమన రచించిన గ్రంథం ఉత్తర హరివంశం. ఇందులో ఆరాశ్వాసాలున్నాయి. ప్రథమాశ్వాసంలో నరకాసుర కథ. ద్వితీయా శ్వాసంలో మృతశిశుపునరుజ్జీవనం. కృష్ణుడు కైలాసానికి వెళ్లి శివుని గురించి తపస్సు చేయడం. ఘంటా కర్ణుని వృత్తాంతం. తృతీయాశ్వాసంలో పౌండ్రక వధ. చతుర్థాశ్వాసంలో హంసడిభకోపాఖ్యానం. పంచమ, షష్ఠా శ్వాసాల్లో బాణాసుర కథ చెప్పబడ్డాయి. మూలంలో ఎన్నో కథలుండగా సోమన ఉత్తర భాగంలోని కృష్ణప్రాధాన్యమయిన కథలను మాత్రమే ఎన్నుకోవడం ఆయన ప్రత్యేకత.

పాత్రపోషణలో, యుద్ధవర్ణనల్లో, రాయబారాలు నడపడంలో సోమన తిక్కన ప్రజ్ఞను పుణికిపుచ్చుకొన్నట్టు తెలుస్తుంది. హంసడిభకుల దగ్గర నుండి కృష్ణుని దగ్గరకు జరిగిన జనార్దనుని రాయబారం సంజయరాయబారాన్ని, తలపింపజేస్తుంది. కథ, సంఘటన, వర్ణన, రస సంవిధానాలతో బాటు పాత్ర పోషణలో కూడా సోమన తన సంవిధాన చాతుర్యాన్ని ప్రదర్శించాడు.

పాత్ర శబ్దానికి యోగ్యత అని అర్థం. ఆధారమని కూడా పర్యాయార్థం ఉంది. యోగ్యత అంటే సామర్థ్యం. ఇది కార్యసాధనంలో ఉంటుంది. ఈ సాధనం ఇచ్ఛాపూర్వకం. ఈ యిచ్ఛకాధారభూతుడయిన పురుషుడు పాత్ర శబ్ద వాచ్యుడు. సమరసాలయిన కొన్ని చేతల యొక్క, అనుభూతుల యొక్క పరంపర ప్రదర్శింపబడుతూ పాత్రలు స్థిరత్వం కలవిగా చేయబడడమే పాత్రపోషణ. కావ్యంలో ఇది రెండు విధాలు. కవి ఒకానొక పాత్రను గురించి తానే వచించడం. ఇది ప్రత్యక్షమార్గం. ఆ పాత్రను గురించి ఇతర పాత్రల ద్వారా చెప్పించడం రెండో పద్ధతి. ఇది పరోక్ష మార్గం. పాత్రపోషణ వాక్యరూపంలో కొంత, కార్యరూపంలో కొంత వ్యక్తమవుతుంది.

పాత్రల కనుగుణమయిన ప్రవర్తనను తదనుగుణమయిన పలుకులను ప్రయోగించడంలో సోమన సిద్ధహస్తుడు. ఈయన పాత్రపోషణాచాతురిని గుర్తించడానికి కావ్యంలోని ఏ కథలోని పాత్రలనయినా ఉదాహరణగా తీసికోవచ్చు. ప్రస్తుత చర్చనీయాంశమయిన జనార్ధనునిపాత్ర హంసడిభకోపాఖ్యానంలోనిది. ఈ కథలో హంసడిభకులు, జనార్దనుడు, దుర్వాసుడు, శ్రీకృష్ణుడు సాత్యకి,బలరాముడు, హిడింబుడు చెప్పుకోదగ్గ

పాత్రలు ఈ పాత్రలన్నిటిలోనూ జనార్దనుని పాత్రకు ఒక విశిష్టత ఉంది జనార్దనుణ్ణి కేవలం ఒక వ్యక్తిగా గాక ఉన్నత గుణ సంపన్నునిగా, ఉత్తమ రాయబారిగా, విశిష్ట విష్ణుభక్తి పరాయణుడుగా సోమన తీర్చిదిద్దాడు

**1. ఉన్నత గుణ సంపన్నుడు :** సాళ్వ దేశాధిపతి బ్రహ్మదత్తుడు. ఈయన కుమారులు హంసడిభకులు. బ్రహ్మదత్తుని మిత్రుడు మిత్రసహుడు ఈయన కుమారుడే జనార్దనుడు. మిత్రసహుడు విష్ణువు నారాధించడం వల్ల జన్మించిన వాడు జనార్దనుడు.హంసడిభకులు ఈశ్వరుణ్ణి ఆరాధించడానికి హిమవన్నగానికి వెళ్లగా జనార్దనుడు స్వగృహంలోనే విష్ణువు నారాధించాడు. జనార్దనసమేతులయి హంసడిభకులు వేటకు వెళ్లి వివిధ వన్య మృగాల్ని వేటాడి ఒక తటాకోత్తర వనప్రదేశంలో సశిష్యుడయిన దుర్వాసమునిని చూశారు హంసడిభకులు దుర్వాసుని సమీపించి ఆయన యతివేషాన్ని అపహసించారు. జనార్దనుడు వాళ్ల దురాలాపాల్ని వారించాడు.

కం "న్యాయము దప్పకు డీ పురు
షాయుష జీవికయు లౌకికాచారముని
శ్శ్రేయస సిద్ధియు జెడు యతి
నాయక దూషణము చేసినన్ మనుజులకున్"

(ఉత్తర హరివంశం 4-52)

అని యతులను అపహసించడం హితం కాదన్నాడు. 'చెలిమి మీతోడ జేయుట చెట్ట తనము' అని వాళ్లతోటి మైత్రి వల్ల తనకు ముప్పువాటిల్లుతుందని భీతిల్లాడు. ఇది జనార్దనుని ఉన్నత వ్యక్తిత్వానికి తార్కాణం. దుర్వాసుడు ఆగ్రహానుగ్రహదృక్కులతో హంసడిభక జనార్దనుల్ని చూసి జనార్దనునికి కృష్ణమైత్రి ప్రాప్తిస్తుందన్నాడు. దుర్వాసుణ్ణి అవమానించిన హంసడిభకుల్ని చూసి జనార్దనుడు ".....చెడిరకట కటా! వీరనుచు విధివినోదము, వారింపగ మనుజకోటి వశమే" (4-72) అని బాధపడ్డాడు. ఇది ఈయన స్నేహభావానికి పరాకాష్ఠ.

హండిభకులు తమ తండ్రి బ్రరహ్మదత్తుణ్ణి రాజసూయ యాగం చేయుమని కోరారు. ఆయనందుకు అంగీకరించాడు. సహజ సౌజన్య స్వభావుడయిన జనార్దనుడు చతురతతో-

గీ " రాజసూయంబు చేయ నేరాజుఁ దలచు
నాతనికి రాజులరిగాపులయినఁ గాని
నిర్వహింపదు మనమెల్లి నేడు సేయు
లావు మెఱయునె ధర యింగలాల పుట్ట"
(ఉత్తర హరివంశం 4-120)

అని వారించాడు బలవంతులయిన రాజుల బలపరాక్రమాలను తెలియచేశాడు యాదవులతో ఉన్న వైరాన్ని గుర్తు చేశాడు అయినా హంసడిభకులతని మాటను లక్ష్యపెట్టలేదు. ఎవ్వరూ తమ కొకలెక్క గాదని అహంకరించారు యాదవనగరానికి రాయబారిగా జనార్దనుణ్ణి వెళ్లి ఉప్పుకప్పమడుగుమన్నారు

**2. ఉత్తమ రాయబారి:** జనార్దనుడు సంతోషంతో కృష్ణుని రూపాన్ని మదిలో నిలిపి యాదవనగరానికి బయలుదేరాడు కృష్ణుణ్ణి చూడబోవడం తన జన్మఫలమని భావించాడు ద్వారక ప్రవేశించాడు బలభద్ర సాత్యకి ప్రభృతుల పేరోలగంలో ఉన్న గోపాల చూడామణిని దర్శించాడు తనపేరు చెప్పి కృష్ణునికి నమస్కరించి ఉచితాసనాసీనుడయ్యాడు కృష్ణుడు కుశల ప్రశ్నానంతరం ఆయన రాకకు కారణమడిగాడు. జనార్దనుడు చెప్పడానికి కొంతసందేహించాడు 'ఏలికలేమి చెప్పినా యథాతథంగా చెప్పడం దూతకర్తవ్యమని వాళ్ల ప్రభు సందేశాన్ని వినిపించుమని' కృష్ణుడు జనార్దనునికి ధైర్యం చెప్పాడు. బలవంతులయిన రాజుల్ని కప్పమడగడం పాడి కాదన్న భావన ఇక్కడ జనార్దనుని ఉత్తమ రాయబారి లక్షణాన్ని తెలియజేస్తుంది. 'హంసడిభకానుమతంతో బ్రహ్మదత్తుడు రాజసూయం తలపెట్టాడనీ యాదవుల్ని ఉప్పుకప్పంగా తెమ్మని చెప్పమని' హంసడిభకులు తననాదేశించినట్టు జనార్దనుడు కృష్ణునికి తెలియజేశాడు అందుకు కృష్ణుడు రోషానికి మూలమయిన హాసం చేసి హంసడిభకులతో యుద్ధం తనకు సంభవిస్తున్నట్టు చెప్పాడు మధుర, ప్రయాగ, పుష్కర సరస్తీరాల్లో ఏదైనా ఒకదాన్ని యుద్ధభూమిగా ఎన్నుకోవలసిందిగా వాళ్లతో చెప్పిరమ్మని సాత్యకిని తనరాయబారిగా జనార్దనుని వెంట సాళ్వనగరానికి పంపించాడు.

జనార్దనుడు రాకుమారుల మందిరానికి వెళ్లి తాను వెళ్లివచ్చిన వృత్తాంతం, సాత్యకి రాక వాళ్లకు తెలియజేశాడు. తాను వెళ్లివచ్చిన వృత్తాంతాన్ని చెప్పుమని హంసుడు జనార్దనుణ్ణి అడిగాడు. జనార్దనుడు కృష్ణదర్శనంలో తాను పొందిన అనుభూతిని కింది పద్యంలో ఆవిష్కరించాడు.

సీ "ఉరము కౌస్తుభరత్న ముదయాద్రి తటమున
బొడతెంచు కలువల బోటుబోటు
శిరము కిరీటంబు సురగిరి నెత్తాన
రాజిల్లు పగలింటి రాజు రాజు
కటిపచ్చఁ బట్టు దిగ్దంతి కుంభస్థలిఁ జూపట్టు రేయెండ జోడుజోడు
చేతిశంఖంబు గర్జిత గజేంద్రము కేలఁ
బరుగు వెన్నెల పూవు బంతి బంతి
తే. యై కొలువులోనఁ దేజోమయంబు సేయ
మౌక్తికవితాన మయ సభామండపమున
సత్యభామా సఖీకటాక్షములగములఁ
జూఱగొనుచున్న దేవకీ సుతునిఁ గంటి"
(ఉత్తర హరివంశం 4-181)

"నేను మీరు చెప్పిన కప్పం విషయాన్ని చెప్పడానికి మొమాట పడ్డాను కృష్ణుడు చెప్పమంటే చెప్పాను. నా మాటలకు నవ్వని వాళ్లు ఆ సభలోలేరు దుర్వాసనారదాదులతో మాట్లాడుతూ నామాటల్ని కృష్ణుడు నిర్లక్షించాడు." అన్న జనార్దనుని మాటలు అతని నిష్పక్షపాత రాయబారానికి వన్నెదెచ్చాయి హంసునికి ఆగ్రహాన్ని తెప్పించాయి. "ఓరీ బ్రాహ్మణాధమా! నా ముందే శత్రువుల్ని ప్రశంసిస్తావా?కృతఘ్నుడా? సభల్లో ఎలా మాట్లాడాలో తెలియని వాడివి. వైరి చుట్టమయ్యావు. నిన్ను చంపకూడదు. మాపట్నం విడిచివెళ్లు" అన్న హంసుని మాటలు జనార్దనుని సహనానికి పరీక్ష.

**3. విశిష్ట విష్ణుభక్తి పరాయణుడు :** హంసడిభకుల రాయబారిగా జనార్దనుడు ద్వారవతికి వెళ్లాడు. హయారూఢుడయి వాళ్లను వీడ్కొని వెళ్లే సందర్భంలో అతని మనసు ఆనందత రంగాల్లో ఓలలాడింది. మాధవదర్శన భాగ్యం తనకు లభించడం అదృష్టమని భావించాడు. కృష్ణుణ్ణి గురించి పరిపరివిధాల తలపోశాడు. భగవంతుడయిన యదూద్వహుని పట్ల ఈయన ప్రదర్శించిన స్మరణభక్తి దిగువ పద్యంలో వెల్లడవుతుంది.

సీ. " యదుకులాంబుధి చంద్రు నానందమునఁ జూచు
రామాదిహిత చకోరముల లోన
దనుజారిపారిజాతముఁ జేరి పొదిగొన్న
రాజన్య రాజకీరములలోన

వసుదేవ సుత సరోవరములో నోలాడు
సనకాది దివ్యహంసములలోన
గోపాలనవపుష్పగుచ్ఛంబు మూఁగిన
పరిచారికా ద్విరేఫములలోన

తే గలయఁ దోలు బాము నోములు గలవు గాన
సెలవు లేక జన్మంబులు చెడియె నాకు
మీద జన్మంబు గలుగనిర్మించెనేని
కమలజుని పేర దాపటి కాల బొమ్మ"

(ఉత్తర హరివంశం 4-137)

రాజసూయాధ్వరం చేయవద్దని వాదిస్తూ హంసడిభకులకు కృష్ణుని పేర విహారాన్ని గురించి చెప్పే సందర్భంలోనూ, యదుసింహుని కొలువులో ఆయన్ను కొనియాడేటప్పుడూ, స్వస్థానికి తిరిగివచ్చి కృష్ణుణ్ణి చూశానని చెప్పే సందర్భంలోనూ జనార్దనుడు చేసిన కృష్ణ కీర్తన అయిదు పద్యాల్లో (ఉత్తర హరివంశం 14-122 నుండి 126 వరకు )వర్ణింపబడింది. ఉదాహరణకు ఒకటి

స "నరకాసుర ప్రాణ నాళోత్తరణ కేళి
రణకేళి వలకేళి రమణఁ జూపెఁ
గంసదానవశిరః కమల కృత్తనమేలు
తనమేలు చేయి పెద్దలకు నొసఁగెఁ
జాణూర ముష్టిక క్షతజకీలాలంబు
నాలంబులో నెల్ల నలవు వఱపె
ముర హయగ్రీవాంత మూలపేనావలి
నావలిదలఁ గఁ జీకాకుఁ వఱచె

తే. వీరరససార కాసార విహరణంబు
విష్ణునకు నొప్పు నతనితో నిగ్రహింప
దొరకొనిన వచ్చు మనకు ముద్దులు మునింగి
పాఱవెంపళ్ళు తమకెంత బంటి యనుట"

(ఉత్తర హరివంశం 4-124)

రాజసూయ యాగ సందర్భంలో హంసడిభకులకు కృష్ణునితో వైరం తప్పదనీ కృష్ణుణ్ణి యుద్ధంలో గెలవడం దుస్సాధ్యమనీ జనార్దనుడు హంసడిభకులకు తెలియజేశాడు. తన ప్రభువుల దగ్గరే వాళ్లకు గిట్టని వాసుదేవుణ్ణి జనార్దనుడు శ్లాఘించడం అతని విష్ణుభక్తి పరాయణతకు చక్కని నిదర్శనం.

నాచన సోమనాథుడు నవీన గుణసనాథుడు. పాతకన్నా కొత్తను అభిమాంచి ఆదరించేవాడు. కాబట్టే తిక్కన హరిహరనాథతత్త్వం ఈయనను ఆకర్షించింది అనుసరించి కావ్యంలో పలుచోట్ల ప్రతిపాదించడానికి ప్రయత్నించాడు. హరహరాభేదాన్ని పాటించినా ఈయన మనసు కృష్ణుని పట్ల కొంత మొగ్గు చూపినట్టు తెలుస్తుంది దాదాపు ఉత్తర హరివంశంలోని అన్ని కథల్లోనూ కావ్యగత పాత్రల ద్వారా విష్ణునామ సంకీర్తన ప్రత్యక్షంగానో పరోక్షంగానో చేయించి తన అభీష్టాన్ని నెరవేర్చుకొన్నాడు హంసడిభకోపాఖ్యానంలో జనార్దనుని పాత్రను ప్రత్యేకించి విష్ణునామ స్మరణకు, సంకీర్తనకు ప్రవేశపెట్టి తన పూర్వుల కంటే విలక్షణమయిన స్థానాన్ని ఆంధ్ర సాహితీ జగత్తులో సంపాదించుకొన్నాడు.

(స్రవంతి, జూన్1992)

★★★

# 8. సోమన నవీన గుణాలు

చిన్నయసూరి 'అలికంబునయక్షిని డాఁచినట్టి సర్వజ్ఞుఁడ'ని సోమనను ప్రస్తుతించాడు. అది మొదలు కొందరీయనను 'సర్వజ్ఞ బిరుదాంకుడం'టున్నారు సోమనకు గల బిరుదాల్లో నవీనగుణ సనాథుడన్న దొకటి. ఈ నవీన గుణాలు ఎలాంటివి అనడంలో పండితుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ గుణాలు వ్యక్తికి గాక రచించిన కావ్యానికి సంబంధించినవని చెప్పాలి. సోమన నిత్యజీవితంలో ఎలాంటి కొత్త గుణాలను అలవరచుకొన్నాడో మనకు తెలియదు ఆయన కవితాధారలో మాత్రం అతనికన్నా ప్రాచీనుల్లో అంతగా వ్యాప్తికి రాని గుణాలు కనిపిస్తున్నాయి అవే నవీన గుణాలని రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు భావించారు.

విశ్వనాథ సత్యనారాయణ "సాహిత్య రసపోషణము, నవీన గుణ సనాద లక్షణము రెండును సోమనలో కలిసియుండును. కవిత్రయము యొక్క పద్యరచనకు, ఇతని పద్యరచనకు గల భేదముననుసరించి నవీన గుణముల నిర్ధారింపదగున"ని విపులీకరించారు

డా|| (శ్రీమతి) పి యశోదా రెడ్డిగారు "ప్రజ్ఞానవనవోన్మేషశాలినీ ప్రతిభా" అన్న భామహుని నిర్వచనాన్ని గుర్తు చేశారు "అపూర్వవస్తు నిర్మాణ క్రమమయిన ఒకానొక శక్తి ప్రతిభ. కాబట్టి నవీనగుణం ప్రతిభావిశిష్టం ప్రతిభావంతుడయిన సోమన బహుకావ్య, శాస్త్ర, బహుభాషాగ్రంథాధ్యయన రూపమయిన వ్యుత్పత్తికి తోడు కావ్యాన్ని రచించి నవ్యతను కనబరచాడు. గ్రంథ ప్రారంభం, కథాకల్పన, రసపోషణాచాతుర్యం, అర్థవిశేషాలు మొదలయిన అంశాలపట్ల సోమన నవీనగుణాలు వ్యక్తమవుతున్నాయని" డా|| యశోదారెడ్డిగారు పేర్కొన్నారు

గుణాలను కావ్యగుణాలుగా భావించి భోజుడు ప్రకటించాడు శబ్దార్థగుణాలను ఆంధ్ర సాహిత్యంలో సమన్వయింప జేయడం వల్ల సోమన నవీన సనాథుడయ్యాడని మరికొందరి తలపు.

**(అ) రాళ్లపల్లి వారి నవీన గుణ సనాథత్వ వివరణ:** కవితాకళను మూడు రకాలుగా వర్గీకరింపవచ్చు.1. వస్తుకళ 2 రచనాకళ. 3. భావకళ సంస్కృత సాహిత్యంలో కూడా మొదట భావం, ఆపై వస్తువు తరువాత రచన క్రమంగా ప్రాధాన్యం గడించి చదువరుల నాకర్షించాయి. వేదపురాణాల్లోని భావతీవ్రత తరువాతి కావ్యాల్లో కానరాదు. బాణభట్టు రచనల్లో వస్తుకళకు

ప్రాధాన్యమియ్యబడింది. ఆపై వెలువడిన సంస్కృత వాఙ్మయంలో శబ్దార్థాల చిత్ర రచనలు పుంఖానుపుంఖాలుగా ప్రబలి క్రమంగా అర్థం కంటె శబ్ద మెక్కువ ప్రాముఖ్యం వహించి నిలిచింది. సరసత్వం కన్నా చమత్కారం సాహిత్య ధర్మంగా పరిణామ మొందింది ఆంధ్ర సాహిత్యంలో కూడా ఈపద్ధతి సాగి ప్రాచీనమయిన భావపద్ధతి ప్రబల మయింది. ఇలాంటి రచనా కళకు శ్రీకారం చుట్టిన వాడు సోమన కావడం వల్ల ఈయనకు నవీన గుణసనాథుడన్న బిరుదు సార్థకమవుతున్నది.

**1. వస్తుకళ :** పద, అర్థాలకు చేరిన అంగాల్లో ఒకటి రెంటిని మాత్రమేరు కేక సర్వాంగాలతో మన హృదయాల్లో ముద్ర పడేట్టు చెప్పే సామర్థ్యం సోమన కుంది ఉదాహరణకు పిశాచద్వయ వర్ణన.

సీ." వికృతాననంబులు విరళదంతంబులు
నిడుపైన దౌడలు నిక్కు మెడలు
ముడివడ్డ బొమలును ముమ్మూల ముక్కులు
బల్ల వెంద్రుకలును బడికితలలు
బొక్కి బొమ్ములు లోఁ తుఁ బొట్టలు మిడిగ్రుడ్లు
గూనివీఁపులు నిడుఁ గ్రొంకి వ్రేళ్లు
బూరకాళులు నీచబోయిన చేతులుఁ
గోలమూఁపులు గుదిగొన్న తొడలు

తే. నతి భయంకర గతి సూప నట్టహాస
కహ కహా రావముల తోడఁ గాననయ్యె
దావపావక ఘన శిఖాదగ్ధతాల
సాల సంకాశమగు పిశాచద్వయంబు "

(ఉత్తర హరివంశం 2-122)

ఇలాగే కోటలగ్గపట్టడం,గదాయుద్ధం, జూదం మొ|| వాటిని వర్ణించేటప్పుడు సర్వాంగాలను వివరించడం. యాభైఏడు దేశాలను గురించి సీస పద్యాన్నంతా ఒక్క సమాసం చేస్తూ ఛందోనియమాలను తప్పక మధ్యమధ్య అను ప్రాసను నిర్వహించిన తీరు కూడా ఈ విభాగంలో చేరుతుంది.

సీ. "పాంచాల పాండ్య బర్బర కిరాతాభీర
కురువిదేహ విదర్భ కుకురగౌళ
గాంధార మగధ కొంకణ కళింద పుళింద
సింధు సౌవీ రాంధ్ర చేరచోళ
సాముద్ర సాల్వకోసల కళింగ కుళింగ
వత్ససౌరాష్ట్రాంగ వంగ మత్స్య
సూరసేన సుధేష్ణ సుహ్మ కాశకరూశ
లాట కర్ణాట మాళవవరాట

గీ కుంతలావంతి ఘూర్జర కుహ్మక త్రి
గర్త బహుధాన యవన టెంకణ దశార్ణ
పుండ్ర బాహ్లిక ద్రవిడ కాంభోజ హూణ
కేకయ వసాతి కాశ్మీర కేరళములు"

(ఉత్తర హరివంశం 5-144)

**2. రచనాకళ :** ఏదైనా ఒక భావాన్ని తెలియజేయడానికై అర్థాన్ని కల్పించవలసి వచ్చినప్పుడు దాన్ని ఎన్ని విధాల సాధ్యమో అన్ని విధాల కల్పించడం. ఆ అర్థాన్ని తెలియజేయడానికి ఎన్ని పదాలను ప్రయోగింపవచ్చునో అన్నిటినీ ఉపయోగించడమే రచనా కళ ఈ పద్ధతి ప్రాచీనుల్లో ఉన్నా సోమన విస్తరించాడు. ఉదా|| " వడకు పన్నగరాజు పడగల మీఁద సర్వం సహా కాంత పేరణము సూప" (4-216). శౌరి పాంచజన్యాన్ని పూరింపగా ఆభీషణ ధ్వనికి ప్రపంచమంతా కలగుండు పడిందన్న భయభావాన్ని సూచించేటట్టు సోమన విస్తరించాడు ఉదా|| " మంగలములోని ప్రేలాల మాడ్కి........................ శౌరి పూరింప నప్పాంచజన్యరవము"(4-216)

**3. భావకళ :** ప్రాచీనుల్లో భావానికి అర్థరచనబంటు. తరువాతి వారిలో దీర్ఘ రచనకు భావం బంటు అర్థంలో లాగా శబ్దంలోనూ సోమన వైవిధ్యాన్ని పాటించడం ఒక నవీన గుణం. ఉదా|| హంసహలధరుల గదా యుద్ధం. " ఇట్లు గదా విహారంబున హంసహలధరులు రుధిరధారా సారంబు నందడిసి వడిసెడక వారింపక యోసరిలక యొలంబు గొనక పంటింపకపాదు కొనకసడలక శంకింపక.............. ......గదలుసారించియు సైరించి యుంజొట్టి యుంగట్టియుఁ గదల్చియు నదల్చియు........... .......... .." (4-248) అన్నచోట కదనంచేసే వాళ్ల గదల కన్నా కవిత్వం రాసే వారి

కలానికే గౌరవ మెుక్కువని రాళ్లపల్లివారు చమత్కరించారు:

వస్తు, రచన, భావ కళలతో బాటు సోమన రచనలో అర్థ, శబ్దాలకు కూడా ప్రాధాన్యమియ్యబడినట్లు చెప్పవచ్చు.

**4. అర్థరచన :** చెప్పవలసిన మాటలను సాధ్యమైనంతవరకు చమత్కారంగా చెప్పడమే అర్థరచన.దీన్నే ఉక్తివైచిత్రి అని చెప్పవచ్చు అనిరుద్ధుని వలచి విరహవేదనలో ఉన్న ఉషాకన్య చెలికత్తెతో 'సిగ్గు చిత్రమున్ వాదులు పెట్టుకొన్నయవి' అని చెప్పుకొన్నది. సిగ్గు - కోరికలందు పురుషత్వ. ఆరోపణం చేయబడిందనడమే. ఒకపక్క సిగ్గు, ఇంకొకపక్క ఆశ బాధించాయనడం సహజోక్తి. అదే మాటను ఇంకొక చోట" తలపునకు జక్కనుండెడి తలపు లేదు, లజ్జ బోద్రోవ లజ్జకు లజ్జలేదు"(5-115) అని సోమన వర్ణించాడు.

**5. శబ్దరచన :** అనుప్రాసలు, అంత్యప్రాసలు సోమనకు అందుకొన్నట్లు చేతికి చిక్కుతాయి. ఒక్కొక్కప్పుడు యమకం ఉన్నది ఉన్నట్టుగా వచ్చిచోటు చేసికొంటుంది. పద్యంలోనూ గద్యంలోనూ ఏకనాదంగల పదాలను కూర్చిగజ్జెల గంటల గొలుసులా సోమన రచన సాగించాడు. ఉదా|| " భ్రాంతంబు విభ్రాంతంబు విద్ధం బావిద్ధంబు విష్లుశంబు విసృతంబాకరంబు వికరంబు భిన్నంబు......................వెక్కసంబున"(4-256)

"చనిచని కాంచెనంత ఋషి సంహతి సారసకేసరాంతరాసన" (1-106) అనే పద్యంలో నిరోష్ఠ్యరచన పాటింపబడింది

రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మగారి దృష్టిలో సోమన కవిత మాని బొమ్మలాట. చిత్రాలయిన బల్లలు, పలువన్నెల పూవులు, వింతవింత రకాల గాజుపళ్లెరాలు గల పాత్రలు గలిగి కొత్తకొత్త పేర్లు, రుచులు గల వంటలతో ఇంటి ఆలుబిడ్డలను సయితం మరిపించే హోటలు ఫలహారం లాంటిది.

**(ఆ) విశ్వనాథ సత్యనారాయణ గారి వివరణ:** సీస పద్యాన్ని రాయడంలో సోమన కొత్తమార్గం వేశాడనవచ్చు.ప్రబంధ కవులందరూ సోమన మార్గాన్నవలంబించారు. శ్రీనాథుడు కూడా దీనికి అతీతుడు కాడని తెలుస్తుంది. "వడకు పన్నగ రాజు పడగల మీద సర్వం సహాకాంత పేరణము సూప " (4-216) వంటి పద్యాలను "ఉర్వీధర శ్రేణులుఱ్ఱూత లూగంగ నేడు గాడ్పులు వీచునెన్నడేని" (కాశీఖండం 2-51) అని శ్రీనాథుడు అనుకరించాడు.

'పఱితి పాలయ్యెనన్న ', 'సీటగలసెనన్న' మొదలయిన సీస చరణాంతాల్లో విలక్షణాలయిన శబ్దాలను కూర్చి ఏకానేకక్రమాన్ని సంధించి సీస పద్యానికి మెరుగుపెట్టడం సోమన నేర్పు. 'కొలువగనేరనిన్ను', ' పిలువగ నేరనిన్ను' మొదలయినవి కూడా ఇలాంటివే

కవిత్రయం వారు సర్వథా భావ ప్రధానంగా తదనుకూల శబ్ద ప్రయోగం చేశారు కానీ సోమన శబ్దంలోని సొగసు వల్ల భావానికి దీప్తి గలిగించే ప్రయత్నం చేశాడు. ఉదా|| "ఉరము కౌస్తు భరత్న ముదయాద్రి తటమునఁ బొడ తెంచు కలువల బోటు బోటు "(4-181). అర్థంలోని చమత్కృతి తద్భ్రాంతతో కూడిన యమకం నుండి పుట్టున్నది. ఇది ఆనాటి రచనలో కొత్తగుణం

హృదయంగమాలు, గడుసుదనం గల పలుకు బళ్లను ప్రయోగించడం లో సోమన దిట్ట ఉదాహరణకు 'శిరసుండగ మోకాలను సేసలు వెట్టుట' (1-96) ఇక్కడ ఒరుదడపనేల? అనడంలో విరోధినామోచ్చారణ విముఖత్వం ప్రదర్శింపబడింది. శిరస్సుతో పోల్చడం వల్ల పూజార్హత్వం సూచింపబడింది ఇలాంటివే మరికొన్ని 'పరుగుతో దాగరయునెండపలసినట్లు '(4-54 , ' లెఁదరమకాదె బిడ్డలుసేసి బ్రతుకు'(2-16),'వెలుగు చేన్మేసిన గాచువారలెందు గలరె జగతి'(5-40) మొ||

రుక్మిణి తనకు పుత్రునిమ్మని భర్త అయిన శ్రీకృష్ణుణ్ణి కోరింది వరమడిగింది. ఇలా అడగడం వేదకాల ధర్మం శృంగార రస చూడామణిగా స్త్రీసంగమం కామ భావ మధురంగా మానవుడు తీర్చిదిద్దుకొన్న నాటి ధర్మమిది తరువాత ఈ రసవిషయం పెరిగింది ప్రేమ మాధుర్యం హెచ్చింది కృష్ణుడిచ్చిన సమాధానం ప్రేమ మార్గానికి సన్నిహితం అది రసమార్గంలో ఉంది. " వనజదళాక్షి! నీకు తగవా యిటు లాడుట" (2-79) అన్న పల్కులు గుర్తింపదగ్గవి. లక్ష్మీనారాయణులయిన రుక్మిణీ కృష్ణుల్లో వేదకాలపు ధర్మాన్ని,రస ధర్మాన్ని కలిపిచెప్పడం సోమన నవీనగుణ సనాథ లక్షణానికి తగిన ఉదాహరణమని విశ్వనాథ వారు పేర్కొన్నారు.

**(ఇ)డా|| (శ్రీమతి) పి. యశోదారెడ్డి గారి అభిప్రాయం:** సోమన గ్రంథ ప్రారంభ, కథా కల్పన, రసపోషణాదులలో నూతనత్వాన్ని ప్రదర్శించి నవీనగుణ సనాథుడయ్యాడని శ్రీమతి రెడ్డిగారి అభిప్రాయం.

**1. గ్రంథ ప్రారంభం :** సోమన హరివంశాన్నంతా తెనుగుచేశాడని కొందరు, ఉత్తర భాగాన్ని మాత్రమే అనువదించాడని మరికొందరు అభిప్రాయపడ్డారు. పీఠికా భాగం లేకపోవడం, పూర్వకథాస్మరణ ముండడం కారణాలుగా పేర్కొని సోమన పూర్వ హరివంశాన్ని రచించాడని నడకుదుటి వీరరాజు పంతులు తలచారు. కానీ పరిశీలించి చూస్తే సోమన పూర్వ హరివంశాన్ని రచింపలేదనడమే సమంజసం. సుకవిస్తుతి, దైవప్రార్థనాదులు సోమన చేయలేదనడం పరిశీలింపక చెప్పే మాటవుతుంది 'శ్రీ సర్వమంగళా' అనే కందపద్యం దైవస్తుతిని, కవిస్తుతిని, వస్తు నిర్దేశాన్ని గావిస్తున్నది శ్రీ శబ్దం వల్ల లక్ష్మీసరస్వతులు నుతింపబడ్డారు. ఇంకా వ్యాస మహర్షి ప్రస్తుతింపబడ్డాడు. తాను వర్ణించబోయే కథ నారాయణ కథ అని, అతడు వ్యాస మనోనివాసి అని కథా సూచన చేయబడింది కాళిదాసాదులు గ్రంథావతరణ ప్రసంగాలు చేయకుండడాన్ని చూస్తే ఆ సంప్రదాయాన్నే సోమన పాటించాడనిపిస్తుంది. దీన్ని ఒక నవీనగుణంగా పరిగణింపవచ్చు.

**2. కథా గ్రథనం :** దండలు గుచ్చేవాడు పువ్వుల తెరగుల్ని గుర్తించి మాలలు అల్లినట్టు సోమన హరివంశంలోని కథలను పరిశీలించి విశిష్టమూ, ప్రధాన రసపోషకాలు అయిన కథలను మాత్రమే ఏర్చికూర్చాడు ఇందొక నవ్యత గోచరిస్తున్నది నిర్వచనోత్తరరామాయణం లాగా ఉత్తర హరివంశం ఖండానువాదం. నరకాసురుని కథలో శ్రీకృష్ణ ఖగోళాధిపత్యం, బ్రాహ్మణుని వృత్తాంతం వల్ల మృత్యువుపై అధికారం, పిశాచద్వయ వృత్తాంతం వల్ల వలసిన పదవుల నిచ్చే అధికారం, పౌండ్రక వధ వల్ల దుష్ట శిక్షణ, బాణాసురుని కథ వల్ల హరిహరాభేదత్వం చెప్పబడ్డాయి. ఈ పద్ధతిని హర్షించిన శ్రీనాథుడు హరివిలాసాన్ని ఇలాగే కూర్చాడు

**3. రసపోషణా చాతుర్యం :** సోమన సాహిత్య రసపోషణాచతురుడు ప్రధానాలయిన శృంగారాదుల్నే గాక మిగిలిన రసాలను కూడా పోషించడంలో సోమన దిట్ట. అంగాంగీ శోభిత రసాలనే గాక రసాభాసాదులను కూడా వర్ణించడాన్ని బట్టి సోమన రసపోషణా చాతుర్యం వ్యక్తమవుతుంది. ప్రధానంగా పరస్పర విరుద్ధ రసాల నొక్కచోట కూర్చడంలో రస సంవిధానం ప్రస్ఫుటమవుతుంది. ఉదా|| " అరిఁ జూచు ౹౹ హరి ఁజూచుఁ జూచుకములందందమందార" (1-162) అనే పద్యంలో వీర శృంగారాలు పోషింపబడ్డాయి.

**4. వివిధ శాస్త్ర పారగత్వం :** పాండిత్యానికి గౌరవమేర్పడుతున్న కాలం నాటి వాడు సోమన. కాబట్టి వివిధ విషయాలను క్రోడీకరించడమే

గాక వాటిని సాంగోపాంగంగా వర్ణించాడు. ఇది ఆనాటి నవ్యత. ఉదా|| వేట సాధనాలు -దీమములు, జోడెంపువలలు. మల్లయుద్ధం - రింజవట్టుట, కడువరానకు జొచ్చుట. ఖడ్గ యుద్ధం - భ్రాంతము, విభ్రాంతము. పలువృత్తులతో పరిచయం - వసంత మాడెడు వారుంబోలె చిమ్ముట, జూదరుల వోలె దండ మరువకుండుట మొ||

**5. విచిత్ర పదప్రయోగాలు :** సోమన పదప్రయోగం చాలా విచిత్రమైంది సైకంపుబైదలి మూక (చక్కని స్త్రీల సమూహాలు), బండ్లు పిసుకు(బురద చేయడం), రాగవాగలు (పాము వంటి పగ్గాలు) వీటితో బాటు పేరల్గొపించిన, తనమయము వంటి వ్యాకరణ కార్యాలను సోమన చేసి ఉండటం గమనార్హం. ఇంకా నిఘంటువుల కెక్కని పెక్కు పదాలను ప్రయోగించడంలో సోమన చతురుడు.

**(ఈ) భోజాని గుణాలు :** ' నవీన గుణ సనాథ' లోని గుణ శబ్దాన్ని ఆలంకారిక గ్రంథాల్లో చెప్పిన గుణాలుగా గ్రహించాలని కొందరి మతం కావ్య శోభాకరాలయిన ధర్మాలు గుణాలు. గుణాలు నిత్యాలు అలంకారాలు అనిత్యాలు. పరిశీలించి చూస్తే దోషాలు కూడా గుణాలే అవుతాయి. మాలలు కూర్చే వాడు పూలమధ్య ఆకులు చేర్చడం, కాటుక మలినమయినా కామినుల కన్నులకు పెట్టినపుడు సౌందర్యావహం కావడం ఇలాంటివే. ఇంకాపునరుక్తం సహజంగా దోషమయినా భయదుఃఖాదుల్లో గుణంగా పరిణామమొందుతుంది

భోజుడు ప్రబంధ గుణాలని పద్నాలుగు గుణాలను పేర్కొన్నాడు అసంక్షిప్త గ్రంథత్వం, అవిషమ బంధత్వం, అనతి విస్తీర్ణ సర్గాధిక్యం, శ్లిష్ట సంధిత్వం అన్నవి శబ్దగుణాలు చతుర్వర్గ ఫలాయత్వం, చతురోదాత్త నాయకత్వం, రసభావనిరంతరత్వం, విధినిషేధ వ్యుత్పాదకత్వం, సుసూత్ర సంవిధానకత్వం అన్నవి అర్థగుణాలు. రసాను రూప సందర్భత్వం, పాత్రానురూప భాషత్వం, అర్థానురూప ఛందస్త్వం, సమస్త లోక రంజకత్వం, సదలంకార వాక్యత్వం అన్నవి ఉభయగుణాలు సోమన పురాణాన్ని ప్రబంధంగా తీర్చడానికి ప్రయత్నించడం వల్ల భోజాని గుణాలను పాటించాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. వాటిలో కొన్నిటిని మాత్రం పరిశీలిద్దాం.

మొదటిది అసంక్షిప్త గ్రంథత్వం. సంక్షిప్తం కాని గ్రంథ స్వభావం కలిగి ఉండడం. అలాగని మరీ సంక్షిప్తం కారాదు. ప్రధాన విషయ విస్మరణ మూకారాదు. సోమన ఈ విషయాన్ని తు.చ. తప్పక పాటించాడనవచ్చు.

మూలహరివంశం పెక్కు కథలతో, ధర్మచర్చలతో, స్తుతులతో నిండింది అందు ఉత్తర భాగాన్ని మాత్రమే గ్రహించి సోమన అనువదించాడు. కృష్ణ ప్రాధాన్య కథలను మాత్రమే చేర్చాడు ముఖ్యమయిన కథా ఘట్టాలను మార్చలేదు. హరిహరస్తుతి యథాతథంగా అనువదింపబడింది. కాబట్టి అసంక్షిప్త గ్రంథత్వ నియమం పాటిపబడిందవ వచ్చు.

రెండవది అవిషమ బంధత్వం. విషమాలు కాని విషయాలను జత చేయడం. హరివంశంలోని పారిజాతాపహరణ, ప్రద్యుమ్నాది కథలను సోమనవదలిపెట్టడం ఈ విభాగంలోచేర్చవచ్చు. మొదటిది కృష్ణ మాహాత్మ్యానికి తగింది గాదు. రెండోది కృష్ణ ప్రాధాన్యం కలిగింది గాదు. అనిరుద్ధ వివాహానంతరం ప్రద్యుమ్నోదయ కారణాన్ని చెప్పడం విషమం. కాబట్టి సోమన ఈ వృత్తాంతాన్ని, ద్వితీయాశ్వాసంతో జతచేసి సుసూత్ర సంవిధాన కత్వ నియమాన్ని కూడా పాటించాడు.

మూడోది. అనతి విస్తీర్ణ సర్గాధిక్యం, సర్గలు అతివిస్తీర్ణం కారాదు. సర్గలలో ప్రతిపాదకాలయిన కథల ధర్మశాస్త్ర చర్చలందైక్య గుణానికి విలుంటుంది. కాబట్టి సోమన ప్రథమాశ్వాసంలో నరకాసుర సంహార కథను చేర్చాడు ద్వితీయా శ్వాసంలో పుత్ర లాలసత్వరూపమయిన కథను జోడించాడు. ఇలాంటివే తక్కినవి.

ప్రబంధం చతురోదాత్త నాయకత్వం కావడం ముఖ్యం. ఉత్తర హరివంశంలో నాయకుడు శ్రీకృష్ణుడు. ఈయన పురుషోత్తముడు. పంచమామ్నాయ రూపంలో వెలశాడు. ప్రసిద్ధమైన భారతానికంతటికీ ఈతడు పట్టుగొమ్మ. వేదవ్యాసుడు ప్రతిపాదించిన అద్వైతధర్మ సమగ్రస్వరూపం. అమూర్తమయినట్టిది, సర్వలోక కల్యాణ కారకమయినట్టిది. హరిహరాభేద రూపమైనట్టిది అయిన ధర్మాద్వైత విధానానికి రూపుకట్టినవాడు కృష్ణుడు. అలాంటి ధర్మ స్వరూపుడయినే నాయకుడు తనవారనక, పెఱవారనక దుష్టసంహార, శిష్ట రక్షణాదులను గావించాడు. కుమారుడయినా నరకుని సంహరించడం ఆయన ధర్మబుద్ధికి తార్కాణం. ధర్మబద్ధమైన రుక్మిణి కామాన్ని తీర్చడం కామానికుదాహరణ.

ఉభయ గుణాల్లో సదలంకార వాక్యత్యం సోమన సొమ్ము. శబ్దార్థాలంకారాలు రెండూ చేరుతాయి ఉదా॥ "ప్రాగ్జ్యోతిషంబు గదిసి సదృగ్జ్యాటంకృతులు లేక దితిజుల మీద " (1-146) " .........తలపడి సాయకనికరంబుల గరంబుల మనికట్లపట్లకు దునిమిన మనుకొని

కరవాలంబులు . .....' "(4-229) మొదలయినవి '...... కలలోన నొకనాడు గదిసి వరము, వేడికొనుమన్న నిరువుర వేడెసుతుల . ." (4-7) అని హంసడిభకో పాఖ్యానంలో చెప్పబడింది కలలో కనబడి ఇచ్చినవాడు కాబట్టి కలచెదిరితే వస్తువులుండనట్టు వాళ్లజీవితం కూడా శాశ్వతం కాలేదనడం.* ఇలాగే 'నభో జలదంబున కింద్ర చాప సంధానము చేయగా ననిరుద్ధుడు పూర్ణశశినిభాననుఁ డగుట' (5-240, 241) మొదలయినవి.

పాత్రానురూప భాషత్వానికి ఊర్వశి నరకసంవాదం, పౌండ్రక సాత్యకుల పరస్పర అధిక్షేపణలు, జనార్దనుని వాక్యాలు వంటివి ఉదాహరణలు పాత్రల సంస్కారం, సన్నివేశాలనుసరించి రచనగావించడంలో సోమన నిపుణుడు ఊర్వశి వేశ్య నరకుడు కామాంధుడు కాబట్టి 'లంజె మాటలు గలవె'అని అనడం, 'లంజియనౌదు నేను' అని ఊర్వశి నొక్కి చెప్పడం లాంటివి తప్పులు గావు. 'ఓరీ బ్రాహ్మణధూర్త! ఓరీ యాదవ! మొదలయిన సంబోధనలు నటులు రంగస్థలం మీద నిలబడి పలికేటట్టు సోమన వర్ణించాడు

ఇలా భోజుని గుణాలన్నిటినీ సోమన రచనలో సమన్వయింపజేయవచ్చు ఆంధ్రసాహిత్యానికిది కొత్తకావడం వల్ల సోమన నవీన గుణ విఖ్యాతుడు కావడంలో సందేహమే మాత్రమూ లేదు. నేర్పరయిన కంసాలి చేతికిచ్చిన బంగారపు ముద్దవలె సోమన తన కళా కౌశలంతో ఉత్తర హరివంశాన్ని తీర్చిదిద్దినాడనడం సమంజసం

★★★

# 9. సోమన సాహిత్యరసపోషణ

పండితులు, కవులు, విమర్శకులు సోమనాథుని కవిత్వాన్ని గురించి తమ తమ అభిప్రాయాలనుప్రకటించారు. అంతేగాక సోమన కూడా తన కవిత్వాన్ని తానే విమర్శించుకొని నిర్ణయం తీసికొన్నట్టుగా ఆశ్వాసాంతగద్యలో "శ్రీమత్సకలభాషాభూషణ సాహిత్యరసపోషణ సంవిధాన చక్రవర్తి సంపూర్ణ కీర్తి నవీన గుణ సనాథ నాచన సోమనాథ.. " అని రాసికొన్నాడు ఈ విశేషణాలు త్తమ కవిత్వానికి ప్రాణాలనదగినవి.

సోమనకు గల బిరుదాల్లో సాహిత్యరసపోషణుడొకటి ఈ సాహిత్య రసపోషణను పలువురు పలురకాలుగా నిర్వచించి ఉన్నారు విశ్వనాథ సత్యనారాయణగారు - " సాహిత్యము యొక్కయు, రసము యొక్కయు పోషణము సాహిత్య .రసపోషణము. సహితముల భావము సాహిత్యము, సహితమనగా తత్కాలమందు అనిష్టమై యనంతరకాలమునందు ఇష్టాపత్తి హేతువు అనగా పారలౌకిక విషయము వేదవేదాంగముల యందలి పరమార్థములే పారలౌకిక విషయములగును. తత్ప్రతి పాదకము సాహిత్యమ"ని పేర్కొన్నారు

సహితాల భావం సాహిత్యం, సహితాలంటే కూడుకొని ఉన్నాయన్న సమూహార్థాన్ననుసరించి సర్వశాస్త్రార్థాలతో, సర్వకళలతో నిండిందని కూడా చెప్పవచ్చు.

రాజశేఖరుడు తన కావ్య మీమాంసలో 'శబ్దార్థాల యధాతథమయిన కలయికే సాహిత్యమ'ని నిర్వచించాడు. కుంతకుడు తన వక్రోక్తి జీవితమనే గ్రంథంలో "సహితయోర్భావః సాహిత్యమ్" అని చెప్పి ఉన్నాడు. " విచిత్రైవ విన్యాసభంగీ సా సాహిత్యమ్ ఉచ్యతే " అని రాయడం వల్ల లోకోత్తర చమత్కార జనకమయిన శబ్దార్థాల విచిత్ర విన్యాసమే సాహిత్యమని కుంతకుని అభిమతం.

సాహిత్యాన్ని గురించి రాస్తూ శ్రీ రాఘవన్ ఒకచోట " Just as poetry is finer speech, Sahitya is the finer sambandha between Sabda and Artha" అని పేర్కొన్నారు.

సాహిత్య దర్పణం పీఠికలో సాహిత్య శబ్దానికి మరొక విదమయిన నిర్వచన మీయబడింది. ' Sahabhava means that poetry has in it all the eighteen vidyasthanas' అని చెప్పబడింది. కాబట్టి సాహిత్యమంటే

అష్టాదశవిద్యా సంభృతత్వమని సూచింపబడింది

ఇలా కనిపించే నిర్వచనాలను పరిశీలిస్తే సాహిత్య శబ్దానికి రెండు ప్రత్యేక నిర్వచనాలు గోచరిస్తున్నాయి 1 శబ్దార్థాల సుసంగతి వల్ల ఏర్పడే శోభావిశేషం 2 అష్టాదశ విద్యల కలయిక. తర్క వ్యాకరణ మీ మాంసాదుల సంగతి ఈ నిర్వచనాలను బట్టి చూస్తే ఈ రెండు విషయాలూ సుసంగతాలై నాచనసోమనకు గల్గ సాహిత్య రసపోషణుడన్న బిరుదును సార్థకం చేస్తున్నాయి కాబట్టి సోమనాథుడు సాహిత్యరస శబ్దాన్ని. ఒక విశిష్టార్థంలో ఉపయోగించినట్లు తెలుస్తుంది ఈతడి సాహిత్య శబ్దాన్ని కేవలం వాఙ్మయ రూపార్థంలోగానీ. అన్వయ జ్ఞాన రూపార్థంలో గానీ లేక శబ్దార్థాల యథాతథమయిన సహభావమనే అర్థంలో గానీ స్వీకరింపక భోజ కుంతకాదుల ననుసరించి లోకోత్తర చమత్కార జనకమయిన శబ్దార్థాల విచిత్ర విన్యాసమని భావించినట్టు తెలుస్తున్నదని శ్రీమతి యశోదా రెడ్డిగారభిప్రాయపడ్డారు.

రసశబ్దం బ్రహ్మవాచి 'విజ్ఞాన మానందం బ్రహ్మ' అన్న శ్రుతి బోధితమయిన విజ్ఞాన తత్త్వాన్ని ఆనందరూపమయిన పరబ్రహ్మంగా స్వీకరించే 'రసోవైసః' అన్న శ్రుతి ఉపపన్నమైంది ఆ బ్రహ్మమే రసం. 'ఎతస్యైవానందస్యాన్యాని భూతాని మాత్రాముపజీవన్తి' అన్న వాక్యాన్ని బట్టి చూస్తే కావ్యానదం కూడా బ్రహ్మానంద రూపమే అని తెలుస్తున్నది భరతుడు 'నహిరసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే' అని తన నాట్య శాస్త్రంలో రస ప్రాధాన్యాన్ని కొనియాడాడు విభావానుభావ సాత్త్విక వ్యభిచారాదులచే పుష్టి నొందిన స్థాయీ భావం రసమై సహృదయ హృదయ రంజనంగావిస్తుంది. ఇలాంటి రసాన్నే ఆలంకారికులు కావ్యానికి ప్రాణం వంటిదన్నారు. సోమన నాట్యరసాన్నే సాహిత్యరసమన్నాడు. తిక్కన కావ్యరసమన్నాడు సాహిత్య కావ్యాలకు సూక్ష్మ భేదమున్నా రెంటికీ అర్థమొకటే

మహా పండితుడు, మహాకవి అయిన నాచన సోమన కావ్య నిర్వచనాన్ని చెప్పడంలో తానూ పాలుపంచుకొన్నట్టయింది. సాహిత్య రసపోషణ అన్నపదాన్ని ప్రయోగించి తద్వారా శబ్దార్థాలతుల్య ప్రాధాన్యాన్ని ఉగ్గడించి కావ్య శరీరం శబ్దమొక్కటే గాక శబ్దార్థయుగళమని సూచించాడు. సాహిత్యపదం కావ్యపరంగా తరతరాలనుండి వాడబడుతున్నది. కాబట్టి కావ్యమంటే శబ్దార్థయుగళమనీ ఆ శబ్దార్థాలు రెండూ తుల్య ప్రాధాన్యంతో రసవంతంగా పొసగి ఉండాలనీ కావ్య నిర్వచనం చేసినట్టుగా సాహిత్యరసపోషణ అనే పదాన్ని, ప్రత్యేకంగా సోమన ప్రయోగించాడు. ఈయన ఉత్తర హరివంశంలో

ఆశ్వాద్యమానాలు, ఆకరకాలు అయిన శబ్దార్థాల చేత. తదితరాలయిన కవి ప్రౌఢ వ్యాపారాదుల చేత శబ్దార్థపాకాల రెంటినీ గరిష్ఠ స్థాయిలో పరిణతి పొందించి సాహిత్య పోషణ గావించాడు. ఇదే అద్భుతమయిన ఈయన శైలి అయింది.

ఊర్వశీ నరక సంవాద ఘట్టంలో నరకుడు యాగ భాగాలిమ్మని మునుల్ని బాధించినప్పుడు -

కం" మనుజాశనులట, బలులట,

మునులట, యాగంబులట, నమో విశ్వ సృజే" (1-94) అనే పద్యంలో భావశబ్ద సౌందర్యాలు రెండూ కవిప్రౌఢిని తెలియజేస్తున్నాయి. సోమన పద్యాల్లో శబ్దార్థాలు రెండూ పరస్పర శోభాకరాలయి నడచాయి ఉదాహరణకు 'చతురవచోవిలాస! గుణసాగర! సాగర మేఖలావనీ " (1-66) అన్న పద్యాన్నిగ్రహింపవచ్చు.

"ఎక్కడి వాడవన్న కడు నీరపు గాఱడవింజరించెదీ " (2-132) వంటి పద్యాల్లో సుకుమార పద భావాల కూర్పు గోచరిస్తుంది

కం"తండ్రి ఁగను ఁగొన వెఱచి సౌధంబు లోన

మఱు ఁగుపడు నింతి పతి ఁజూడ మఱియు వెడలు " (5-244) అనే పద్యంలో భావానుగుణమైన చేష్టావర్ణన వ్యక్తమవుతుంది "చెలులు బొమ్మల పెండ్లి చేయుచో లజ్జింతు మగనికై యేనేల మరులు కొంటి" (5-115) అనే పద్యంలో పాత్ర మనోభావ చిత్రణ కనిపిస్తుంది.

నాచన సోమన ఆయా పాత్రలకుచితమయిన ప్రౌఢగతుల సంభాషణాదులను చొప్పించి, నాటకీయతను ప్రదర్శించి సహజత నాపాదించి ఉన్నాడు. ఉదా॥ " కలిగె నొక జాంబవతి వెన్నెల వడఁ బడెదేల వలపు నీతల వేగెన్. " (3-115) సోమన యుద్ధ వర్ణనల్లో తిక్కననుసరించి వాటిని కడురమ్యంగా వర్ణించాడు. యుద్ధవర్ణల్లో సంబాషణాదులను చేర్చి యింపు గూర్చడంలో సోమన దిట్ట. ఉదాహరణకు పౌండ్రకసాత్యకు లొకరినొకరిని అధిక్షేపిస్తూ తలపడిన సమయంలో "ఎవ్వడు రోరి తాను నొక యెక్కుడు వీరుఁడ పోలె రాత్రిమైఁ " (3-43) అంటూ సాత్యకి పౌండ్రకుని ఎదుర్కోవడం

సోమన రచనలో దీర్ఘ సమాస రచన అధికం. ఉదారణకు

"కంసారాతి మురామరారి నరక క్రవ్యాద ముఖ్యామర
ధ్వంసాపాదన వీత కంటకవతిన్ ద్వారావతిం రుక్మిణీ
హంసీహారమృణాల హారి భుజమధ్య స్ఫార కాసారుఁడై
సంసారార్ణవ సార మన్మథ సుధాపారంబునం దేలఁగన్"

(ఉత్తర హరివంశం 2-72)

అనే పద్యంలో దీర్ఘ సమాసాలున్నాయి శబ్ద చమత్కారం. దుష్కర ప్రాసలను వాడటం కూడా సోమనకు పరిపాటి ఉదాహరణకు

ఉ "భానన భానుమండల విభాసి విభాకర దివ్య భవ్యసం
ధాన విధాన దక్షిణ సుధాకరుణా రసపూరహారిచే
తో నయనా తపోనిధి విధూత తమః స్ఫురణాంతరంగని
ధ్యాన పరాయణాపరమతత్త్వ మయస్తవ వైభవోన్నతా"

( ఉత్తర హరివంశం 3-160)

అనే పద్యంలో భానన- భాను, విభాసి- విభాకర, దివ్య - భవ్య వంటి శబ్దాలు చమత్కారంగా కూర్చబడ్డాయి

ఉత్తర హరివంశంలో ధీరోదాత్తుడయిన శ్రీకృష్ణుడు నాయకుడు. అంగిరసంవీరం అంగం శృంగారం కానీ రస ప్రాధాన్యాన్ని గురించి చెప్పవలసి వచ్చినప్పుడు వీర శృంగారాలను రెంటినీ సమ ప్రాధాన్యంతో సోమన పోషించాడని చెప్పవచు శృంగారవీరాదులు సహజంగా సహృదయులకు ఆనంద కలిగిస్తాయి కానీ సోమన ఇతర రసాలనుకూడా అత్యంతాభినివేశంతో సర్వాంగ సుందరంగా వర్ణించాడు ఇదే సాహిత్య రసపోషణమని విమర్శకుల తలపు

ఉత్తర హరివంశంలో రెండు సందర్భాల్లో శృంగార రసం ప్రధానంగా వర్ణించబడింది. ఈ రెండూ రెండు విధాలుగా వెలశాయి 1 రుక్మిణీ కృష్ణుల శృంగారం 2. ఉషా నిరుద్ధుల శృంగారం

రుక్మిణి తనకొక సుపుత్రునిమ్మని కృష్ణుణ్ణి కోరిన సందర్భంలో నాచన సోమన మిక్కిలి నిపుణంగా ఈ శృంగారాన్ని కింది పద్యంలో వర్ణించాడు.

సీ. "యమునా తరంగ డోలాధిరోహణమున
దంబు మీఱెడు మరాళంబు వోలె
హరినీలమణి మనోహర మందిర స్తంభ
ముల వినోదించు కీల్బొమ్మవోలె
దళిత నీలోత్పల దళదామ సంగతిఁ
గొమ రారు సంపంగి గుత్తి వోలెఁ
దరుణ తమాల పాదప శిఖా శాఖలఁ
జెలు వారు వలరాచచిలుక వోల ఁ
తే. బారిజాత గోవర్ధనోత్పాటన మున
బలిమి తోడవైన మురవైరి బాహుయుగము
తెప్పగా మన్మథాంబుధిఁదేలు చుండె
రమ్యగుణమణి రుక్మిణీ రమణి ప్రీతి"

(ఉత్తర హరివంశం 2-73)

ఇందులో శ్రీకృష్ణుడు ఆలంబనం కాగా అనుభవించిన కామోపభోగాన్నంతటినీ కవి హృదయానందకరంగా వర్ణించాడు. ధర్మశృంగారంగా తీర్చడానికై పుత్ర సంబంధమైన రుక్మిణి కోరికను చేర్చాడు ఇక్కడ భర్త అభిమానానికి స్త్రీ సౌందర్యాదులే కాక పుత్రుల కలిమిని కూడా ఒక కారణంగా చెప్పడం ఔచిత్య పోషకం.

ఉష విషయంలో సోమన చేసిన శృంగార రసపోషణ సశాస్త్రీయమై ఆ రసపోషణలో అతనికి గల సామర్థ్యాన్ని వెల్లడి చేస్తున్నది. ఉషాదేవి మనస్సులో మొదట శృంగార సంబంధమైన భావారంభానికి ప్రాతిపదికగా పార్వతీ పరమేశ్వరుల గూడి వచ్చిన అప్సరసల నాట్యాన్ని, వనజలకేళులను వర్ణించాడు ఇలాంటి క్రీడాదుల వల్ల ఉష మనస్సునందొక కోరిక భర్తృసంయోగ సంబంధి అయిపొడమింది. ఉదా||

ఉ. "డెందము మీద జెందొవకు డెప్పర మేమియు లేదు చన్నులం
జిందందు ఘర్మవారి చెవిఁజేర్చిన లేఁజిగు రించుకంత యుం
గందదు నాసికాగ్రమునఁగన్నుల బాష్పము లూరవింక నీ
సుందరి ఁగావ నేరఁడు ప్రసూనశరుండని యార్త మూర్తులై"

(ఉత్తర హరివంశం 5-133)

దశవిధ అవస్థలనే గాక సోమన ఈ ఉషా విరహసందర్భంలో పదకొండు నర అవస్థలను వర్ణించాడని వేలూరి శివరామశాస్త్రి గారు పేర్కొన్నారు.

సోమన రసతత్త్వాన్ని సంపూర్ణంగా ఎరిగినవాడు కాబట్టి విరుద్ధరసాలను ఒక్కచోట వర్ణించి కూడా ఆ రసాలకెక్కడా లాఘవం కల్పింపక నేర్పు ప్రదర్శించాడు సర్వలక్షణ వేత్త అయిన నాచనసోమన నరకాసురునితో యుద్ధం చేసే సత్యభామా సౌందర్యాన్ని చిత్రించే సందర్భంలో ఇలా వర్ణించాడు

మ. "అరిఁ జూచు ౯హరిజూచు ( జూచుకములందందందమందార కే
సరమాలా మకరంద బిందు సలిల స్యందంబులందంబులై.
తొరుగంబయ్యెద కొంగొకిత తొలగందోడ్తో శరాసారము౯
దరహాసామృత పూరముం గురియుచుందన్వంగి కేళీ గతిన్"

(ఉత్తర హరివంశం 1-162)

ఇక్కడ వీర శృంగారాల సమప్రాబల్యం స్పష్టంగా నిరూపింపబడింది

నాచన సోమన కేవలం రసాలనే గాక విరోధి రసాంగాలను కూడా చమత్కారంగా వర్ణించి దక్షతను ప్రదర్శించాడు ఉదాహరణకు పరమసుకుమారమూర్తి అయిన సత్య వీర రసాధిదేవత అయిన విధానాన్ని చాలా చమత్కారంగా చెప్పి అందులోని విరోధాన్ని, సందేహాన్ని తొలగించాడు ఉదా||

సీ "తంత్రీ వినోదంబు తడవు సైపని వ్రేళ్ల
గొనయంబు తెగలపై (గోరు కొనుట
యుద్ధంబు పిడిముట్టనలయు పాణితలంబు
లస్త్రకంబితీయించు లావుకలిమి
చెలికత్తెనొత్తిలి చీరలేని యెలుంగు
సింహనాదంబు చే (జెదరకునికి
ప్రమద నర్తన కేలిబరిథవింపని పదం
బెదురాణంబుల నల (త (బడమి

తే. సోయగపుఁజిత్రరూపంబుఁజూచు చోట
వేసరు విలోచనంబులు వికృతదైత్య
లక్ష్య మీక్షించుటయు మొక్కంలంపు గెలుపు
గైకొనియె సత్యభామ సంగ్రామ సీమ. "

(ఉత్తర హరివంశం 1-161)

నరకుడు సత్యపై మర్మభేదాలయిన బాణాలను ప్రయోగించాడు. ఆ బాణాలు సత్య అవయవాల్లో అక్కడక్కడ గుచ్చుకొని సత్య సింగారించిన కుసుమభూషణాల కొక కొత్త సింగారాన్ని గూర్చాయని సోమన వర్ణించాడు

బ్రహ్మదత్తుని కుమారుల్లో ఒకడయిన హంసుడు యమునలో మునిగిన విషయాన్నెరిగిన డిభకుడు దఃఖావిలచిత్తుడై -

క." వ్రేలెడు వెంద్రుక లిరుగడఁ

దూలఁగఁదలయూచుఁదొప్పుదొప్పున నోరుం

గేల నడచికొను సెలవుల

లాలలు దొరుగంగ నన్నలాయని యొఱలున్ "

(ఉత్తర హరివంశం 4-302)

అని తీవ్రవేదనను అనుభవించాడు. ఇక్కడ కరుణ హాస్యాలు రెండూ పొందుపరచపడ్డాయి. నరకుడధ్వర భాగాలనీయ నిరాకరించిన మునులను దైత్యపరివారం పఱచిన పాట్లను -" జడలు కంపలు వట్టి జరగనీ కున్నచో విడిపింప శిష్యుల వెదకువారు " (1-102) అని రాసిన సందర్భంలోనూ ఆశ్రయ భేదం వల్ల హాస్యరసం ప్రతీయమానమయింది.

సోమన కరుణరసాన్ని చిత్రించడంలో మానవప్రకృతి కత్యంత సహజమైన విధానాన్ననుసరించి రచన సాగించాడు. ఆలంకారిక మతాన్ని బట్టి ఇష్టజనవినాశనం, శాపాదుల వల్ల కలిగే క్లేశం వల్ల కరుణ ముత్పన్నమవుతుంది. ఉత్తర హరివంశంలో ఇష్ట జన వినాశం వల్ల కలిగిన కరుణానికి ప్రధానంగా రెండు ఘట్టాలున్నాయి. నరకుడు సంహరింపబడిన పిదప భూదేవి విలపించడం. ఉదా|| " మాఁగు వాఱిన చంద్రమండలంబును బోలె వదనారంవిందంబు వన్నె దఱుఁగ" (1-178). ఇలాగే హంసుడు యమునలో అణగదొక్కబడిన తరువాత డిభకుడు -

సీ "నాయెల్లి నీడన నరలోక మేలుదు నను లావు వఱితిపాలయ్యెనన్న
దేవేంద్రునకు నైనఁదేఁ జూడఁగరాని గౌరవోన్నతి నీటఁగలసెనన్న"....
(ఉత్తర హరివంశం 4-300)

అనివిలపించడంలో కరుణ రసముత్పన్న మయింది.

నరకుని దుండగాలను పరమపురుషుడయిన శ్రీకృష్ణునితో చెప్పడాని కేతెంచిన ఋషులుకృష్ణుని కొనియాడదలచి "పన్నగంబుల రాజు ఁబగవాడు ఁగూడి నీ శయనంబు ఁబయనంబు సంతరింప" (1-119) అని స్తుతించడంలో శాంత్యద్భుతాలు చక్కగా మేళవింపబడ్డాయి.

పుత్రార్థిని అయిన రుక్మిణి కృష్ణునితో తనకు పుత్రునను గ్రహింపుమని కోరేటప్పుడు-

శా" ఆ రామాతిలకంబు మన్మథ వినోదైకాంత గేహంబులో
గారామై యొకనాడు లేనగవు శృంగారంబుగా ఁగన్నులం
బారం బేదనిలజ్జతోప హరికిం బాద ప్రణామ క్రియా
ప్రారంభంబగు భక్తి గుట్మలిత హస్తాంభోజయై యిట్లనున్"
(ఉత్తర హరివంశం 2-74)

అని రచించడంలో భక్తి శృంగారాల కలయిక ఉంది ఇలాగే

క "పెదవులు దడుపుచుఁ బదములు
గుదిగొన ఁదత్తఱపుమాట గుత్తుక దగుల ౯
ముదుసలి తనమున బెదరున
వదలిన యంగములు మిగుల వడకఁగడంకన్
(ఉత్తర హరివంశం 3-136)

అనే పద్యంలో భయానకంద్యోతకమవుతుంది "ఇట్లు తలపడి సాయకనికరంబు లఁగరంబుల మనికట్లపట్లకుఁదునిమిన మునుకొని కరవాలంబులు వదనంబులం గఱచికొని కదనంబులకుం బఱచువారలు నుం... .."(4-229) అన్నవచనంలో బీభత్సం కనిపిస్తుంది. ఇలాగే "అరుణాం భోరుహపత్త్రనేత్రుఁడు సముద్యద్భ్రుకుటీ భంగభానుర ఫాలస్థలుఁడుం. ........" (1-117) అన్నపద్యంలో అద్భుతం పోషంపబడ్డాయి.

నాయికా నాయకులు, అనుభావాలు, సంచారీ సాత్త్విక భావాల పరిపుష్ట స్వరూపాన్ని ప్రపంచించి రసపోషణ చెయ్యడం సుకరం. కానీ ఒక్క సంచారీ భావం వల్లనే అనుభావ విశేషంతో రసాన్ని పోషించడం కష్టమయినా సోమన అలాంటి రచన కూడా చేసి ఉండడం విశేషం. ఉదాహరణకు శృంగార రసాన్ని సంచారీ భావం చేత ఉషా కన్యకలో చిత్రంగా మూర్తి కట్టించాడు. "కిసలయపత్త్రికఁ మకరకేతన నూతన వార్తలన్నియుంబొసగ లిఖించి యందు దలపూవులు దమ్మియు నాస చేయు "(5-125) ఇలా ఒక పద్యంతోనే ఏయే రసాన్ని ఎక్కడెక్కడ, ఏయే భావాన్ని ఎక్కడెక్కడ మూర్తి కట్టించాలో తెలిసిన నేఱజోదు నాచన సోమన.

రసాభాస, రసభావాభాసాదులను మిక్కిలి రక్తితో వర్ణించడం కవులలో కనిపించదు. సోమన అలా గాక వాటిని చమత్కారంగా వర్ణించాడు. ఉదాహరణకు ఊర్వశీనరక సంవాద ఘట్టాన్ని గ్రహింపవచ్చు. ఊర్వశీనరకుల సంభాషణను పురస్కరించుకొని ఇక్కడ హేయమయిన శృంగారం ప్రదర్శింపబడిందని కొందరభిప్రాయపడ్డారు. పరిశీలిస్తే ఇక్కడ శృంగార రసాభాసముందే కానీ శృంగార రసంలేదు. ఎందుకంటే వర్ణ్యాలయిన పాత్రల ప్రవృత్తి ఉచితమయినప్పుడు స్థాయి అయిన మనోవృత్తి రసాన్ని, వ్యభిచారి అయిన మనోవృత్తి భావాన్ని స్ఫురింపజేస్తాయి అనుచితమయినప్పుడు క్రమంగా రసాభాస భావాభాసాలను స్ఫురింపజేస్తాయని సిద్ధాంతం. ఇక్కడ విజేత అయిన దైత్యుడు వేశ్య అయిన ఊర్వశిని కోరడంలో అనౌచిత్యం లేదు కేవలం నరకునికూర్వశిపట్ల జనించింది మోహం. ఆ మోహం వల్ల ఊర్వశి తనను కాదని ఈసడించినా వానికాజ్ఞానం కలుగలేదు. కాబట్టి ఇక్కడ నరకునిలో ఆభాసాభావ రూపమైన రతి ఉంది. నరకుడు సంభాషణారంభంలోనే ఊర్వశిని ఉత్తమ నాయికవలె "..................సతులు దోడనె డాగిరి దైత్యభీతలై, ప్రోలు దొలంగి తేమిటికిఁ బొత్తుల దానవు నీవు తొయ్యలి "(1-61) అని సామాన్యంగానే వ్యవహరించాడు.

ఊర్వశి నరకుని -

ఉ "లంజియనౌదునేను; వినులావున నీ వమరేంద్రుగెల్చిన
న్నుం జెఱపట్టి తెమ్మని వినోదము చేసితి గాక చిత్తమె
ల్లం జెడి యుండరిత్త యొడలం జవి చేరునె? చిల్కవోయినం
బంజర మేమిసేయ? రసభంగము సంగతిలోన మెత్తురే"

(ఉత్తర హరివంశం 1-72)

అని ఎత్తి పొడిచే సందర్భంలో 'రసభంగము సంగతిలోన మెత్తురే ' అని సోమనాథుడే ఊర్వశి నోట చెప్పించాడు అందువల్ల ఈ సంభాషణ రసాభాసమే కానీ రసవంతం కాదని చెప్పవచ్చు. దీని తరువాతి సంభాషణలు సహజ సుందరాలు ప్రధాన రసాలను వర్ణించడం ఒక యెత్తు. రసాభాస భావాభాసాదుల నౌచిత్య భంగం కాకుండా వర్ణించి సహృదయుల హృదయాలను ఆహ్లాదాన్ని కూర్చడం ఇంకొక యెత్తు. కాబట్టి ఈ ఘట్టాన్ని కల్పించి సోమన తాను పేర్కొన్న సాహిత్య రసపోషణ దక్షతను ప్రదర్శించుకొన్నాడు.

కావ్యంలో రసదృష్టి, కథాదృష్టి రెండూ ప్రధానాలు. ఒకే కథతో నడిచే కావ్యంలో రసదృష్టి ఉంటుంది ఈ కథాదృష్టితో రాసే కావ్యంలో వస్తుగత శిల్పమధికం ఊర్వశీనరక సంవాద ఘట్టంలో రసం శృంగారాభాసం. నరకుడు 'మునులనవమానించినసందర్భంలో రౌద్రాభాసం. మునులు కృష్ణునికి నివేదించే సమయంలో కరుణరసం, నరకాసురవధలో వీరరసం పోషింప బడ్డాయి. అనుదాత్తనాయకుడు శృంగారం లభించనప్పుడు రౌద్రాన్ని పొందుతాడు. ఇక్కడ నరకుని విషయంలో శృంగారం రౌద్రంలో పర్యవసించింది నరకుడు మునులను బాధించడంలో రౌద్రం కనిపిస్తుంది మునులు బాధపడడంలో కరుణం ఉది. కాబట్టె రౌద్రం కరుణంలో పర్యవసించింది. ఈ కరుణమే మునులు కృష్ణునికి నివేదించేటప్పుడు వీరరసస్థాయి ఉత్సాహంలో పర్యవసించింది చివరకు అన్ని రసాలూ వీరంలో పర్యవసించాయి ఇలాగే హంసడిభకోపాఖ్యానం, బాణాసుర గర్వభంగం వంటి ఘట్టాల్లోనూ వీరమే ప్రధానం. ఉత్తర హరివంశంలో భిన్న కథలను, భిన్నరసాలను ప్రవేశింప జేసినా సోమన కథల్లోనే గాక రసపోషణలో కూడా ఒక సంవిదానకాన్ని పాటించాడు

సోమన ఏ రసాన్నైనా అత్యంతాభినివేశంతో సర్వాంగ సుందరంగా వర్ణించి సహృదయుల కానందాన్ని కలిగించి సాహిత్య రసపోషణ అన్న విశేషణాన్ని సార్థకం చేసికొన్నాడు.

★★★

# 10. సోమన సంవిధాన చక్రవర్తిత్వం

విధానమంటే చేయడం, ఆజ్ఞ, పూజ, ఉపాయం అనే అర్థాలున్నాయి సంవిధానమనడం వల్ల బాగా కూర్చడం అనే అభిప్రాయంమేర్పడింది. మహాకవి భవభూతి నాటకాదుల్లో విచిత్ర సంఘటన మేర్పడినప్పుడు "అహో సంవిధానకమ్" అని ప్రయోగించి ఉన్నారు. సంవిధానకమంటే కూర్పు. పూర్వా పరాల కనుపపత్తి ఏర్పడనప్పటికీ సుసంఘటితాలు కావడం, కథోపకథలు యోగ్యతతో పొత్తు కుదిరి ఉండడం, వర్ణనలు ఒకదానివెంట ఒకటి కలిసి రావడం అనే నానార్థాలు చెప్పడానికి ఇక్కడ వీలుంది. నాచన సోమన కూడా ఉత్తర హరివంశ కథా భాగాల్లో సంవిధాన శబ్దాన్ని ప్రయోగించి ఉన్నాడు."......నా చేసిన సంవిధానంబున నీవు నిశ్చింతంబుగా ననిరుద్ధుం గొనిపొమ్ము" (5-184) ఈ సంవిధానాన్ని గురించి పండితుల్లో పలు అభిప్రాయాలున్నాయి.

"సంవిధాన చక్రవర్తియనగా ఒక సంవిధానమున్నపుడు తానచట చక్రవర్తివలె వ్రాయుదుననుట అనగా లోకోత్తరముగా వ్రాయుదు ననియే కదా! కవితామార్గమున నట్టి సంవిధానమును పరిపోషించుట పరమోత్కృష్ట దశయందుండు నన్నమాట. ఎదుటి మానిసి యొక్క మనఃప్రవృత్తిని గ్రహించి దానినాధారముగ చేసికొని తనకిష్టమైన పనిని గడుసుదనముతో సుకుమారముగ నెరవేర్చుకొనును. కవిచక్రవర్తి చేయుపని యిదియే. ఉత్తమ కవి ఈ నిగూఢమగు మానవ ప్రవృత్తి నాధారముగా చేసికొని తనకావ్యము నందలి ఘట్టముల తీర్చిదిద్దును" అని విశ్వనాథ సత్యనారాయణగారు తెలియజేసి ఊర్వశీ నరక సంవాదాన్ని ఉదాహరించారు.

"ఏ కథనైనను విభజించి చూచినచో అందుకొన్ని సంవిధానములు లేక సన్నివేశములు కన్పించును. ఆ సన్నివేశములను ఉచిత రీతి కలిపి కథ నడిపించుటలోనే కర్త నేర్పు వ్యక్తమగును కల్పింపబడిన ఆ సన్నివేశములు ప్రాయోభావమున ఎంత సన్నిహితములయి ఎంత సహజములుగా నుండిన కథ యంత నిసర్గముగా, నంతరమణీయముగా గోచరించును. కథ సాగుచుండగా కొన్ని క్లిష్ట పరిస్థితులరుదెంచును. అందుండి పాత్రలు వెలువడుటకు యత్నింతురు. ఆ యత్నమతిలోక సన్నివేశములతోనో, విశ్వసనీయములు కాని దివ్య మహిమాను భావములతోనో కూడి యుండినచో కథ సహజత్వమును కోల్పోవును. అట్టి సహజ సన్నివేశములను రమణీయముగ కల్పించుటలోనే కవి కథాకథన కౌశలము గోచరించును. నాచనసోమన ప్రతి కథలోను కొన్ని

సన్నివేశములను నిసర్గ రమణీయములుగా కల్పించి తన సంవిధాన ఘటనా సామర్థ్యమును ప్రకటించి యున్నాడు" అని ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు పేర్కొన్నారు. ఉత్తర హంశమాధారంగా సోమన సంవిధానాన్ని పలు విధాలుగా వర్గీకరింపవచ్చు.

**1. కథాసంవిధానం :** నాచన సోమన ఉత్తర హరివంశాన్ని రచించాడు. కానీ కొందరు పూర్వ హరివంశాన్ని కూడా రచించాడని చెబుతారు సోమనకు గల బిరుదాలను బట్టి, లభ్యమయిన ఉత్తర హరివంశాన్ననుసరించి సోమన పూర్వ హరివంశాన్ని రచింపలేదనే చెప్పవచ్చు. మూల హరివంశంలో పెక్కు కథలుండగా ప్రధానమయిన ఆరుకథలను మాత్రమే గ్రహించడంలో సోమన కథా సంవిధాన వైచిత్రి కానవస్తుంది. పారిజాతాపహరణ వృత్తాంతం రమణీయమయినా కృష్ణ లీలా వినోదానికి తగదని సోమన పరిత్యజించాడు ప్రద్యుమ్నునికథ రసవత్తరమయినా కృష్ణ ప్రధానం కాకపోవడం వల్ల వదలి పెట్టాడు. ఇక గ్రహించిన కథల్లో ఉత్తరోత్తర ప్రాముఖ్యాన్ని కల్పించడం సోమన సంవిధానమవుతుంది.

కృష్ణునికి ఖగోళాధిపత్యాన్ని కల్పించడం నరకాసురుని కథ వల్ల కలిగిన ప్రయోజనం బ్రాహ్మణ బాలకుని రక్షించడం వల్ల మృత్యువును శాసించే అధికారం సంక్రమించిందనడం ఘంటా కర్ణాదుల నను్గ్రహించడం వల్ల యథేచ్ఛగా పదవులనిచ్చే సార్వభౌమత్వాన్ని ప్రతిపాదించడం. పౌండ్రక వధాదుల వల్ల దుష్ట జన శిక్షకత్వాన్ని నిరూపించడం. పుత్రార్థం తపస్సు చేయడం హరిహరాభేదాన్ని ప్రస్ఫుటం చేయడమే ఇలా ఈ సత్యాలకనుగుణమయిన కథలను మాత్రమే సోమన గ్రహించడం ఆయన కథా సంవిధానం.

**2. ఉపాఖ్యాన సంవిధానం :** పురాణాదుల్లోని ఉపాఖ్యానాలు కేవలం ధర్మ ప్రతిపాదకాలు మూల హరివంశంలో పెక్కు ఉపాఖ్యానాలున్నా సోమన కొన్నిటిని మాత్రమే గ్రహించాడు. ఉదాహరణకు ఇందు ధరోపాఖ్యానం.

కృష్ణుడు పుత్రార్థి అయి శివుని గురించి తపస్సు చేశాడు. ఈశ్వరుడు ప్రత్యక్షమయి 'నీమది కుమారాపేక్ష నాలో నెఱుంగుదు" నంటూ

క." నీ కొడుకు నీకు నిచ్చితి
గైకొనుము విరించి చిట్టకాలకులోనై
నాకు బగ యగుట నంగము
లేకున్నా డతడు కొఱత లేదతని పయిన్"

(ఉత్తర హరివంశం 2-184)

అని చెప్పాడు. ఈ కథను సోమన కాస్త విస్తరించి రాశాడు. ఇక్కడ శివుడు రెండు విషయాలను ప్రస్తావించాడు. 1. కృష్ణునికుమారుని అతనికివ్వడం 2. విరించి చిట్టకాలకు లోనై మన్మథుడు పగకావడం తారకునికి వరమిచ్చినవాడు బ్రహ్మ. ఆవరమివ్వడంలో కూడా 'త్రిలోచన సూనుండొకరుండు తప్ప ఇతరులు చెఱుప జాలర'నడాన్ని పేర్కొన్నారు. కానీ తారకుడు 'జితేంద్రియుల కేటి సంతతి'? అని ఊరకున్నాడు. దేవేంద్రాదులతో ఈ రహస్యాన్ని చెప్పినవాడు కూడా బ్రహ్మ. ఇంద్రుడు పితామహుని మాటలుగా మన్మథునికుపదేశం గఱపాడు. అంటే అన్నిటికి బ్రహ్మకారకుడయ్యాడనడం ఇక్కడ ధ్వని. బ్రహ్మ చేష్టితం వల్ల మన్మథుడు పరమ శివునకు పగయ్యాడు కాబట్టి అనుతాపాన్ని పొంది మన్మథుడు బతకడానికి శివుడు మార్గాన్ని ఉపదేశించాడు. ఇలా రాయడం వల్ల పూర్వాపర సంవిధానం కుదిరింది.

**3. సంఘటనా సంవిదానం** : మూలహరివంశంలో ముందుగా అనిరుద్ధుని వివాహం చెప్పబడింది. ఆపై రుక్మిణి కృష్ణుణ్ణి చూసి తనకు ఒక కుమారుని ప్రసాదించుమని కోరినట్టుగా వర్ణింపబడింది. అనిరుద్ధుని తండ్రి ప్రద్యుమ్నుడు. మనుమని వివాహం చెప్పి తండ్రి జననానికి కారణభూతమయిన కథను తరువాత చెప్పడం అసంగతం. కాబట్టి సోమన ద్వితీయాశ్వాసంలో (అనిరుద్ధ వివాహాత్పూర్వం) రుక్మిణి కృష్ణుణ్ణి కుమారుని దయచేయుమని కోరడాన్ని వర్ణించాడు. మృతశిశు పురుజ్జీవన వృత్తాంతానంతరం పుత్ర దర్శన లాలస రూపమయిన కథను జోడించడం సంఘటనా సంవిధానం ఇలాగే మూలంలో నరకసంహారార్థం సత్యభామ వెళ్లినట్టుంది. కానీ యుద్ధం చేసినట్టు లేదు. ఎర్రన సత్యభామ యుద్ధాన్ని సంగ్రహంగా వర్ణించాడు కృష్ణుడు తాను అలసి పోవడాన్ని పేర్కొని సత్యభామకు ధనుస్సునందించాడు ఉత్తర హరివంశంలో శ్రీకృష్ణుడు 'నీవు సమరంబె కోరుదు ' అంటూ ధనుస్సునిచ్చినట్టు సోమన వర్ణించాడు. నరకుడు భూదేవి పుత్రుడు. సత్యబామ భూమాత. కుమారుడు తండ్రిపై బాణాలను ప్రయోగించాడు. తండ్రి సొమ్మసిల్లాడు. కుమార రక్షణం కన్నా భర్త రక్షణ మవసరం. కాబట్టి సత్యభామ విల్లు చేపట్టి యుద్ధం చేయడం సమంజసం. ఇలాగే పౌండ్రక

వధానంతరం కృష్ణుడు దేవేరులతో నెత్తమాడడం సోమన సంఘటనా సంవిధానానికి మరో చక్కని ఉదాహరణ. మూలంలో దేవేరులు సంతృప్తి చెందారని మాత్రమే ఉంటే ఆ సంతోషాన్ని తన కాలానికనువయిన రీతిలో సోమన పెంపొందించాడు. ఉషా వృత్తాంతాన్ని చివర చెప్పడం వల్ల కావ్యం మంగళాంతమయింది.

**4. సంభాషణా సంవిధానం :** మూలహరివంశం కథా ప్రాధాన్యం కాబట్టి అక్కడ సంభాషణలత్యల్పం. సోమనప్రజ్ఞ అంతా సంభాషణల్లోనే కనిపిస్తుంది. ఎత్తుకుపైఎత్తు వేయిస్తూ పాత్రల మనస్తత్వాన్ని చిత్రీకరించడం సోమన ప్రత్యేకత పాత్రలననుసరించి భాష భావాలు మారడం సంభవిస్తుంది ఇలాంటి రచనలుచెయ్యడంలో సోమన సిద్ధహస్తుడు ఉదాహరణకు ఊర్వశి నరక సంవాదం దేవేంద్రునణచడం, స్వర్గ విజయం నరకుని దోషాలు గావు రాజ్యం పింభోజ్యం కానీ మునులను బాధించడం మహాపరాధం " హవిర్భాగములందని నీయింద్ర పదవి యేల " అని ఊర్వశి నరకుని మందలించింది కాబట్టి 'ఒక నాడూర్వశి మాటపొందు ' తలచి నరకుడు మునులణచాడు 'మాట పొందు తలచెను కానీ పొందు మాటను తలపడయ్యె ' ఇలాగే పౌండ్రకసాత్యకుల సంభాషణ " అయ్యాదవగోపాలుం, డెయ్యెడ నున్నాడొ పసుల నెందడచె నొ కో" (3-46) అని పౌండ్రుడు సాత్యకితో పలికాడు

బ్రాహ్మణుడు తన వృత్తాంతాన్ని తెలియ జెప్పే సందర్భంలో " . ..అవ్విప్రుని యార్తభంగి, చూచు మురవైరి శోకంబు జూడ లేక, వెడలెనాకును గన్నీరు" ... (2-9)అని అర్జునుడు పలికాడు '..........దీక్షితుడైన నాకు, రా ననువగు నెల్లి భూసురకులాగ్రణి !........." అని కృష్ణుడు చెప్పాడు. 'నాకును గన్నీరు' అన్నవాక్యంలో గల సముచ్చయాన్ని బట్టి అర్జునుడు " .....వసుధామరు ప్రా, ర్థన దీర్ప నన్ను బనుపుము " (2-20) అని కృష్ణుణ్ణి కోరడం చక్కగా ఉంది.

**5. రస సంవిధానం :** సోమన సాహిత్య రసపోషణుడు. ప్రధానాలయిన శృంగారాదులనే గాక తక్కిన రసాలను కూడా పోషించడంలో సోమన దిట్ట కథాదృష్టితో గాక రసదృష్టితో కథల నేర్చి కూర్చిన మహాకవి అంగాంగి శోభిత రసాలనే గాక రసాభాసాదులను కూడా వర్ణించడాన్నిబట్టి రససంవిధానంలో సోమన మిన్న అని అంగీకరించక తప్పదు. ప్రధానంగా పరస్పర విరుద్ధరసాల నొక్కచోట కూర్చడంలో రససంవిధానం

ప్రస్ఫుటమవుతుంది. శబ్దసంవిధానంలో ఎగుడుదిగుడులున్నట్టు రస సంవిధానంలో కూడా ఉంటాయి. "నానారస సమావేశము ఘటించి ప్రధాన రస స్ఫూర్తి కంగములుగా చేయును. ఉత్తరరామచరిత్ర యందు కరుణాద్భుతములు, మాలతీ మాధవము నందు శృంగారాద్భుతములు, వీర చరితమున వీరాద్భుతములు, నానా రససమావేశము గావించి "ఓహో రసములు పరస్పరము స్పర్థించుచున్నవి. " అని భవభూతి పేర్కొన్నాడు. ఇలాగే సోమన కూడా పెక్కు రసాలను పోషించాడు. ఉదా ||"అరిజాచుఁ హరిజాచు (c జూచుకములందందంద మందార......దన్వంగి కేళీగతిన్" (1-162) అన్నచోట వీర శృంగారాలు పోషింపబడ్డాయి.

ఇతివృత్తంలో లేని ఐక్యాన్ని రసపోషణలో తోపింపజేయడం సోమన రస సంవిధానమని డా|| జి.వి. సుబ్రమణ్యం గారి అభిప్రాయం. "వంశమభివృద్ధి చెందడానికి మూలం సంతానం. దాన్ని పొందడమెంత అవసరమో సన్మార్గంలో పెట్టి ధర్మబద్ధంగా పోషించడమూ అంతే అవసరం. కులపాంసనులు, దుష్టులు అయిన పుత్రులను కనడంకన్నా నిస్సంతులయి జీవించడం మేలు పూర్వజన్మకర్మలవల్ల అలాంటి వాళ్లు జన్మించినా ధర్మవీరుల వల్ల నిహతులు కావడం తథ్యం. పుత్రభావమెంత మధురమో, ఎంత మృదులమో, అధర్మ పరుడయినా పుత్రునిమరణ భావమన్నది అంత దుస్సహం. ఈ నిత్య సత్యాన్ని వ్యంగ్యంగా ప్రపంచితమయ్యేటట్టు పుత్ర సంబంధ ప్రసక్తి యుక్తాలయిన కథలను గ్రహించి అనుసంధించినాడీ సంవిధాన చక్రవర్తి కాకుంటే నరకాసుర వధానంతరం భూదేవి దుఃఖమెందుకు ? పుత్రార్థి అయి వాసుదేవుడు చేసిన ఘోర తపమెందుకు? కులపాంసనులైన హంసడిభక సంహార మెందుకు? పరమశివుని పుత్రుడని భావింబడిన బాణునితో వంశాంకుర రక్షణార్థం చేసే కృష్ణుని యుద్ధమెందుకని డా|| జి.వి సుబ్రమణ్యం గారు 'వీర రసమ'న్న గ్రంథంలో చర్చించి ఉన్నారు.

**6. ఔచిత్య సంవిధానం :** " అనౌచిత్యాదృతే నాన్య ద్రస భంగస్యకారణమ్, ప్రసిద్ధౌచిత్య బంధస్తు రసస్యోపనిషత్పరా" అని క్షేమేంద్రునిఅభిప్రాయం. అనౌచిత్యానికన్నా రసభంగానికి వేరే కారణం లేదు. రసవిషయంలో ఔచిత్యం ముఖ్యం. సోమన పద, వాక్య, ప్రబంధార్థ గుణాలంకార రసాదుల్లో ఔచిత్యాన్ని పాటించాడు. కావ్య ఔన్నత్యానికి ఔచిత్యం ప్రధానం

సత్యభామా సహితుడయి శ్రీకృష్ణుడు నరకాసురుని సంహరించడానికి ప్రాగ్జ్యోతిషానికి వెళ్లాడు అప్పుడా నరకుడు కృష్ణుని

క " నీవేల వచ్చితిచటికి
నేవాడవు మొప్పుటఁక నేపారెదు నీ
లావరిపులుగెక్కడియది
యీవారిజనయన యెవ్వరేర్పడ జెపుమా"

(హరివంశం ఉ భా 5-210)

అని ప్రశ్నించినట్లు ఎర్రన పేర్కొన్నాడు నరకుడంతటి క్రూర దానవుడు సత్యా కృష్ణులను గరుత్మంతాదులను తెలియని అవివేకా? అన్న సందేహం ఇక్కడ కలుగుతుంది కాబట్టి సోమన ఈ ఘట్టాన్ని సంభాషణలో ప్రసక్తికి తీసికొనిరాలేదు

ఉషాదేవి అనిరుద్ధునితో పొందిన సంభోగానుభవాన్ని ఎర్రన విపులీకరించాడు అది విరసం కావడం వల్ల ఔచిత్యాన్ని పాటించి సోమన 'కలలో కుమారుడొక తేమో చేసెన"ని వర్ణించాడు. ఔచిత్య పోషకుడయిన సోమన పంచమాశ్వాసంలో అనిరుద్ధుని చేత -

క "నా కనక ప్రాసాదము
నా కొలుపు విలాసినులును నాచుట్టములున్
లేకున్న నేమి కౌగిట
నీ కామిని యున్నజాలు నెల్ల చవులకున్ "

(ఉత్తర హరివంశం 5-208)

అని పలికించడం మాత్రం ఔచిత్యం కాదని చెప్పవలసి ఉంది

**7. చమత్కార సంవిధానం :** సంస్కృతసాహిత్యంలో భిన్న సంప్రదాయాలను వ్యక్తపరచే ఆలంకారిక గ్రంథాలున్నాయి అలంకార, గుణ, రీతి, ధ్వని, వక్రోక్తి, అనుమితి, ఔచిత్య, చమత్కార సంప్రదాయాలు ఇక్కడ చివర చెప్పబడిన చమత్కార సంప్రదాయాన్ని పాటించిన వాడు ఆంధ్రుడయిన విశ్వేశ్వర కవి చంద్రుడు. ఇతని కాలం క్రీ.శ. 14 వ శతాబ్దం. అంటే సోమనకు సమకాలీనుడు. కుంతకుడు కావ్యామృత రసాస్వాదంవల్ల చమత్కృతి సిద్ధిస్తుందన్నాడు. రీతి చమత్కార శూన్యమైన కావ్య మానంద దాయకమెన్నటికీ కానేరదు ' ప్రతిపుష్పం నుండీ తుమ్మెదలు మధు బిందువుల్ని సేకరించి ఒకచోట కూర్చినట్టు కవి కూడా అన్ని కావ్యాంగాల నుండి చమత్కారాలను

కూర్చి ఆస్వాదించి ఆనందిపజేస్తాడ'ని విశ్వేశ్వర కవి చంద్రుడు ప్రతిపాదించాడు.

సోమన పై సంప్రదాయానికి చెందిన వాడు. ఈయన చమత్కారం కావ్యాంగాలన్నిటా గోచరిస్తుంది. ప్రధానంగా కవితాశైలి విషయంలో చూడవచ్చు శైలి అంటే విశిష్ట పద రచన. ఇది కవి వ్యాపారమే కానీ దేశ స్వభావం కాదు. శైలినే ప్రాచీనాలం కారికులు రీతి, మార్గం, ప్రస్థానం అని పేర్కొన్నారు. కుంతకుని మతాన్ననుసరించి శైలి మూడు విధాలు. 1. సుకుమారం 2. విచిత్రం 3. మధ్యమం. వీటిలో సోమనది విచిత్రశైలి. ప్రతిభాజాత శబ్దార్థ చమత్కారం, అలంకార సహితం, ఉక్తివైచిత్రి, ప్రతీయమాన అర్థ చమత్కారం, వక్రోక్తి నిబంధనలు విచిత్ర శైలిలో ఇముడ్తాయి. ఉదాహరణకు నిరోష్ఠ్య రచన చేయడం (చనిచనికాంచెనంత ఋషి సంహతి..................నత్తఱిన్ 1-106), అచ్చ తెనుగు పదాల కూర్పు (" తొలుకారు మెఱుగుల తోటలో నాడెడు రాయంచ కొదమతో రాయజాలి". 2-171) వంటివి. ఇలాగే సీస పద్యాలను రాయడంలో విచ్ఛిత్తిని చూపడం. ఉదా ||"................ఉఙ్ఘాత లూగెడు నుదయాస్త గిరులతో నాకాశ లక్ష్మి కోలాటమాడ "4-216) ఇక్కడ సోమన క్రీడా బోధక ధాతువును గ్రహించడం గుర్తింపదగింది. ఈ విభాగంలోనే విశేష ప్రాసలు, ప్రయోగాలు, యమకాగులు చేరుతాయి. ఉదా||

క. "ప్రాగ్జ్యోతిషంబు గదిసి స
దృగ్వ్యాటంకృతులు లేక దితిజుల మీదన్
· దృగ్జ్యోత్స్న జేవురింపగ
దిగ్వ్యోగగనాంతరంబు దివురగ నార్చెన్. "

(ఉత్తర హరివంశం 1-146)

**8. పాత్రపోషణా సంవిధానం :** కావ్యంలో పాత్రపోషణ రెండు విధాలు. కవి ఒకానొక పాత్రను గురించి తానే వచించడం. ఇది ప్రత్యక్ష మార్గం. ఆ పాత్రను గురించి ఇతర పాత్రల చేత చెప్పించడం. ఇది పరోక్ష మార్గం. పాత్రపోషణ వాక్యరూపంలో కొంత, కార్యరూపంలో కొంత వ్యక్తమవుతుంది. ఒక పాత్ర స్వభానుగుణంగా ఇతరులతో సంభాషణా రూపంలో మాట్లాడిన వాక్యాలను ఇంకొక పాత్ర చెప్పడం వ్యాఖ్యాన ప్రాయంగా ఉంటుంది. స్వవాక్యం వల్ల పాత్రలగుణగణాలు స్వయం వ్యక్తమయితే పరుల వాక్యాలు వాటిని ఋజువు చేస్తాయి.

పాత్రల కనుగుణమయిన ప్రవర్తనను తదనుగుణమయిన పలుకులను ప్రయోగించడంలో తిక్కన కోవకు చెందిన వాడీ నాచన సోమన. ఈతని పాత్ర పోషణను గుర్తించడానికి ముందు, గ్రంథంలోని పాత్రలను పరికింపవలసి ఉంది. ఆ పాత్రలు జాతినిబట్టి మూడువిధాలు. దైవత్వ, రాక్షసత్వ, మానవత్వాలు గలవి. లింగభేదాన్ననుసరించి పురుష పాత్రలు, స్త్రీ పాత్రలు అని రెండు రకాలు. స్థితి భేదాన్ననుసరించి పాత్రలను నడపడంలో సోమన సంవిధానం వ్యక్తమవుతుంది ఉదాహరణకు దుఃఖం ఈ దుఃఖం బహువిధాలు. తల్లి దుఃఖం వేరు తండ్రి దుఃఖం వేరు అలాగే సోదర వియోగం వల్ల, గౌరవహాని వల్ల కలిగే దుఃఖాలు వేరు వేరు. తల్లివగ వసుంధర పట్ల, తండ్రి దుఃఖం బ్రాహ్మణుని పట్ల, సోదర వియోగం డిభకుని పట్ల వ్యక్తమయ్యాయి. రోషసమ్మిళిత మయిన దుఃఖం దుర్వాసునిలో వ్యక్తం చేయబడింది.

మార్పికాలయిన గుణాలను పాత్రల స్వభావాన్ననుసరించి పోషించడంలో కవి ప్రతిభ వ్యక్తమవుతుంది ఉదా|| కృష్ణుడు దేవేరులతో నెత్తమాడడం సత్యభామ సహజంగా ఈర్ష్యా స్వభావురాలు కృష్ణుడు మొదట సత్యా ముఖం చూసి 'నెత్తమాడుదమ'ని పలికాడు 'నేను నెత్తము నీతో నాడు నెడ రుక్మిణి కనుగొనున'న్నాడు కానీ సత్య 'జూదరివి, సమాళివి' అని వ్యంగ్యంగా అతన్ని ఉడికించింది అప్పుడా దశను గుర్తింపక 'జాంబవతిని పిలువుమ'ని కృష్ణుడాదేశించాడు. సత్య అసూయతో కృష్ణుని తూలనాడింది. క్షణక్షణం పరిస్థితుల కనుగుణంగా మారే స్వభావాలను సోమన ఇక్కడ వర్ణించాడు. ఇలాంటివి కావ్యమంతా కనిపిస్తాయి.

**9. వర్ణనా సంవిధానం :** కథకు అతికే వర్ణనలను సాగించడం సోమన పద్ధతి ఆవర్ణనలు కూడా నాతివిపులం. నాతి సంగ్రహం. సోమన సంయమనం కలవాడు. వర్ణనలు కథకు పోషకాలుగా ఉండాలన్న సత్యాన్ని సోమన పాటించాడు "యమునా తరంగ డోలాధిరోహణమున డంబు మీఱెడు మరాళంబువోలె ....రమ్య గుణమణి రుక్మిణీ రమణి ప్రీతి " (2-73) అన్న పద్యం రుక్మిణీ కృష్ణుల పరస్పరానురాగాలను ప్రస్ఫుటం చేస్తుంది. అనుకూల దాంపత్యం ఏకాంతవాసం కావడం వల్ల తరువాత రుక్మిణి కోరుకునే పుత్ర సంబంధమయిన కాంక్ష కనుకూల వాతావరణం కలిగేటట్టు సంవిధానం చేయబడింది.

బాణాసురుని వృత్తాంతంలో బాణుడు 'నభోజలదంబున నింద్ర చాప సంధానము చేయ' వచ్చాడు. 'అనిరుద్ధుడు చిఱునవ్వొలయగ పూర్ణ శశిని భాసనుడై నాడనడంలో వైజ్ఞానిక సత్యముంది. పౌండ్రకుని వృత్తాంతంలో భానుబింబ వర్ణన గమనింప దగింది. " కుంకుమ హత్తించి కొనగోం(దీర్చిన పురుహూతునిల్లాలి బొట్టనంగ......... .....భాను బింబంబు కన్నుల పండువయ్యె" (3-86) రాత్రి గడచింది. జయాపజయాలు నిర్ణీతం కాలేదు. కృష్ణుడు తెల్లతెల్లవారే సమయంలో సమరభూమి కేగుదెంచాడు. పరమాత్మ సాన్నిధ్య రాహిత్యాన్ని బట్టి అంధకారం. కృష్ణుడు సూర్యుడు. సూర్యోదయమయితే అంధకారం నశిస్తుంది. ద్వారకకు వాటిల్లిన అనర్థం తొలగుతుందని అభిప్రాయం.

సోమన ఒక పద్యంలో వర్ణనా సమయంలో ఒక విశేషణాన్ని ప్రత్యేకంగా ఉపయోగిస్తే ఆవర్ణనాసందర్భంలోని పద్యాలన్నీ ఆవిశేషణాన్ని పురస్కరించుకొనే విచిత్రంగా సాగుతుంటాయి. ఉదాహరణకు ద్వితీయాశ్వాసంలో పరమశివుణ్ణి పారిజాత వృక్షంలా ఊహింపజేయడం. "లలిత విద్రుమ లతాలావణ్యమగు జటాజూటంబు జిగురాకు జొంపమైన.............నాత్మలో గంటి గన్నారనంటి కొంటి . " (2-175). వర్ణన కదా ! అని వదలిపెట్టక తరువాత పద్యంలో "కుజము కుంజరముచే గూలునో కూలదో కూలుకుంజరము నీకుజము కూల్చె........... .......పారిజాతంబు నామ్రోల బండియుండ " (2-176) అని వర్ణించడం సోమన ప్రత్యేకత. ఈ పద్యాల్లో ఒకటి మహాదేవునికి నిత్యాలంకారాలయిన ఆయా వస్తు విశేషాలను వృక్షాంగాలతో రూపించి పుష్పఫల భరితమయిన పారిజాత వృక్షమని చెప్పబడింది. రెండవ పద్యంలో పరమశివుడొనరించిన గజాసుర వధాదులను పేర్కొవడం జరిగింది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని చూస్తే సోమన ప్రదర్శించిన సంవిధానం కూడా వటవృక్ష ప్రాయమని భావింపవచ్చు.

★★★

# 11. నాచనసోమన శైలి

శిల్పార్థంలో శైలీ ప్రయోగం సాగిందని డా॥ పాటిబంద మాధవ శర్మగారి అభిప్రాయం.రసాభివ్యక్తి సమర్థమయిన కావ్యాన్ని నిర్మించడం కవి ఇచ్ఛ.అంగిఅయిన కావ్యనికి అంగాలయినవాగర్థాలు. ఛందోఽలంకారాలు సుస్నిగ్ధ సంధిబంధాలయి యథోచితంగా సన్నివిష్టం కావాలి అలాంటి సన్నివేశంలో కవి అంతర్బహిరింద్రియాల ఏకాగ్ర మయిన వ్యాపారమే శిల్పమవుతుంది 'అనంత జన్మాభ్యాస సంస్కారం శీలమయితే అదే స్వార్థంలో శైలి అనబడుతుంది ఇహ జన్మాభ్యాస సంస్కారం శిల్పం మహర్షుల్లో శీలమైంది మహాకవుల్లో శిల్పమవుతుంది అప్రయత్న ఫలసిద్ధి శీలమయితే సప్రయత్న సిద్ధి శిల్పమవుతుందని' డా॥ పాటిబంద మాధవ శర్మ గారు తెలియ జేశారు

సౌందర్యం రెండు విధాలు స్త్రీ పురుష భేదం అందు మొదటిది మిశ్రణం, మధురం రెండోది గంభీరం, బంధురం, ఈనియమం సాహిత్యాది కళ ల్లోనూ అన్వయింప వచ్చు మధురమైంది ఆలంకారిక శైలి విచిత్ర మైంది క్షాత్రశైలి విశిష్ట పదరచనను ప్రాచీనాలంకారికులు రీతి, మార్గం, ప్రస్థానమని పేర్కొన్నారు. తిక్కనది విచిత్ర శైలి కొన్నిసార్లు కేవలంలోకాను కరణం చేస్తూ, మరికొన్ని సార్లు ఉత్పథాని కెగసి తాత్త్విక లోకాల కంట పెరిగి మరికొన్ని సార్లు రెంటికి మధ్య ఆలంకారిక మార్గాల కొదిగినడపడం విచిత్రం శబ్ద సంవిధానంలో ఎగుడు దిగుడు లున్నట్లు చెప్పడం విచిత్రశైలి సోమన తిక్కన ననుకరించినవాడు కావడం వల్ల ఈయనది విచిత్రశైలి అని చెప్ప వచ్చు

సర్వకళా శాస్త్ర పారంగతుడయిన సోమన శైలిని గురించి చెప్పవలసి వస్తే ప్రధానంగా ఆశైలి మిక్కిలి ప్రౌఢమైందనే చెప్పాలి సూక్ష్మంగా పరిశీలించే కొద్దీ ఈయన శైలి అపురూప మయిన నవీన గుణ సనాథమై అడుగడుగునా వింత చెలువాన్ని ప్రదర్శిస్తుంటుంది బహుముఖ ప్రజ్ఞా భూషితమయిన

సోమనశైలిరస ప్రియులైన తరువాతి కవుల కెందరికో ఒరవడిఅయి చివరకు ప్రబంధ శైలిగా రూపొందిందనిచెప్పడం అతిశయోక్తి కాదు. సోమన కేవలమొకసారి దృష్టిని ప్రసరింపజేయడం వల్లనే ఆ వస్తువుకు సంబంధించిన సర్వవిషయాలనుఆకళింపు చేసికొంటాడు.ఆ వస్తువు యొక్క బాహ్యా స్వరూప వర్ణనకు తోడు,ఆంతర ప్రకృతిని వర్ణించి దాని సూక్ష్మ రూపాన్ని కూడా దృశ్యమానం చేస్తాడు. ఈ వర్ణనల్లో ఇతడెప్పుడూ దేశకాల సమయ సదాచారాలకు వెలితి గాక ఆయావస్తు స్వభావానుగుణమైన వర్ణనలనే విచిత్రంగా తీర్చిదిద్దుతాడు.సోమనలోప్రతిభా పాండిత్య కవిత్వాలు నిండారి ఉండగా ఈయన భావాలతిగంభీరాలై శుచిమంతాలై, అనన్య సాధారణాలై భాసిస్తుంటాయి. అత్యంత ప్రగాఢాలయిన ఇతనిభావాలు మెరుపు తీగ ల్లాంటి పదబందాలతో కూడి ప్రకాశిస్తుంటాయి.

సంస్కృతంలో గౌడి, వైదర్భి పాంచాలి అనే కవితా రీతులు ప్రసిద్ధాలు పరుషాక్షరయుక్తమయిన పదాలు,దీర్ఘసమాసాలుగల రచనారీతి గౌడి అనీ, సమాస విరహితమై మృదుపదఘటితమైన రీతి వైదర్భి అని ఆలంకారికులు నిర్వచించారు. ఈ రెంటికీ మధ్య వర్తించేది పాంచాలి.

``సమగ్ర గుణా వైదర్భీ !ఓజః కాంతి మతీగౌడీ

యా మాధుర్య సౌకుమార్యోప పన్నా పాంచాలీ తాసామ్|

పూర్వా గుణ సాకల్యాత్"|| అని వామనుడు,

``వైదర్భీ పాంచాల్యౌ ప్రేయసీ కరుణే భయాన కాద్భుత యోః|

లాటీయా గౌడీయే రౌద్రే కుర్వాత్ యథౌ చిత్యమ్"|| అని రుద్రటుడు

ఏయే రసాల కేయే రీతులుపయుక్తాలవుతాయో నిర్వచించారు. కుంతకుడీ పేర్లన్నిటినీ తొలగించి ఇంకొక విధమైన రీతిని మార్గమని నామకరణం చేసి వ్యవహరించాడు. ఇతన్ననుసరించి1సుకుమార మార్గం2విచిత్ర మార్గం3 మధ్యమ మార్గం అని రీతులు మూడు విధాలుగా ఏర్పడ్డాయి.ఈమూడు

రీతుల్లో నాచన సోమన శైలి సుకుమార మార్గమని కొందరు. విచిత్రమార్గమని కొందరు చెబుతున్నారు. కానీ రెండు మార్గాల కలయికలో కూడిన ఒకానొక విశిష్ట రీతే సోమన శైలి

``భావావేశ మున్నచో కవి శైలికై యొకరిపై నాధార పడవలసిన ప్రమేయము లేదు. పర్వతాగ్రము నుండి పరవళ్లు ద్రొక్కు ప్రవాహము సముద్రమునకు సహజముగ గమించు రీతి నుద్వేగ వంతములైన భావములు సహృదయ హృదయ రంజనము జేయగలవ" నివాస్ ఇర్వింగ్ అనే పాశ్చాత్య రచయిత భావించాడు. భావ సంపన్నుడయిన మహాకవి సోమన శైలికోసం తడవు కోకుండా అదే వచ్చి ఆయన నాశ్రయించింది

సోమన శైలిలో కావ్య పాకం నిండారి ఉంది రాజశేఖరుడు వామనా చార్యుని వాక్యాలనుదాహరిస్తూ-

``యత్పదాని త్యజన్త్యేవ పరివృత్తి సహిష్ణుతామ్|

తం శబ్ద న్యాయ నిష్ణాతాః శబ్ద పాకం ప్రచక్షతే||" అని శబ్ద పాకాన్ని నిర్వచించాడు. ఇక్కడ కావ్యపాకమంటే పరివృత్తి వైముఖ్య మని తెలుస్తుంది. కావ్యంలో ఒక పదాన్ని తొలగించి సమానార్థకమైన ఇంకొక పదంతో ఆ పూర్వపు సొగసును తీసికొని రాలేనంతటి బింకమున్నట్టయితే అది శబ్ద పాకమన బడుతుంది ఈ గుణాన్నే ప్రౌఢి అన్నారు.

పాశ్చాత్యులు కూడా ఈ లాంటి కవితా ప్రౌఢే కావ్యానికి గీటు రాయి లాంటిదని పేర్కొన్నారు `` The infallible test of the blameless style. ...... ..is its untranslatableness in words of the same language with out injury to the meaning"( S T Coleridge- Biographia Literaria) ఏ కవితా శైలిలో అర్థ భంగాన్ని కలిగింపక అదే భాషలో మార్చడానికి వీలు లేదో ఆ శైలే నిర్దుష్ట మైందని పాశ్చాత్య విమర్శకుల అభిప్రాయం.ఈ నిర్వచనం సోమన శైలి కెంతైనా తగి ఉంది సోమన పద్యాన్నుండి ఒక్క పదాన్ని తీసి అదే అర్థంలోఉపయుక్తమయ్యే మరి ఏ యితర పదం నుండీ ఆ పూర్వపు

రామణీయరాకతను తీసికొని రాలేము. కాబట్టే ఈయన శైలి చాలా ప్రౌఢమూ రమణీయమూ అయిందని చెప్పవచ్చు.

కుంతకుడు వక్రోక్తి జీవితంలో-

``మార్గాను గుణ్య సుభగః మాధుర్యాది గుణోదయః|

అలంకరణ విన్యాసం వక్రతాతి శయాన్వితః||

వృత్తౌచిత్య మనోహారి రసానాం పరిపోషణమ్"|| అని చెప్పిన విధానాన్ని అనుసరించి మార్గాను గుణ్య సుభగమై, మాధుర్యాధి గుణోదయమై, అలంకరణ విన్యాస వక్రతాతి శయాన్వితమై,వృత్తౌచిత్య మనోహరి అయి రసపోషణ చేస్తూ రచించిన కవితారీతే సోమన కవితారీతి అదే ఈతని శైలి. ఈ పై లక్షణాలు ఉత్తర హరివంశంలో ఉండడం వల్ల సోమన వామనుని రీతి సిద్ధాంతాన్ని ఆదరించి రచన గావించినట్లు తెలుస్తుంది.

కొందరు పెద్దలు నన్నయ శైలిని గురించి రాస్తూ దాన్ని చాళుక్య శైలి అని పేర్కొన్నారు. ఈ విధానం ప్రాచీన సంప్రదాయాని కన్నా కొంత భిన్నంగా కనిపిస్తూ ఉంది. దేశాల పేర్లను పురస్కరించుకొని రీతులను వ్యవహరించడం భారతీయ సంప్రదాయం. రాజవంశాలను, రాజులను పురస్కరించుకొని వ్యవహరించడం పాశ్చాత్య సంప్రదాయం.ఇలాగే నాచన సోమన శైలిని గురించి రాస్తూ మానవల్లి రామకృష్ణ కవిగారు `కాకతీయ శైలి' అని పేర్కొన్నారు. తిక్కన శైలి కూడ కాకతీయ శైలే. చాళుక్యుల తరువాత ప్రసిద్ధి చెందిన వాళ్లు కాకతీయులు. ఈ కాకతీయ శైలినే దివ్యకావ్యఫక్కి అని వేటూరి ప్రభాకర శాస్త్రి గారన్నారు. ఈ దివ్య కావ్య ఫక్కి అన దగిన కాకతీయ శైలే నాచన సోమన శైలి. కాంతి అనే గుణ విశేషం ఈయన శైలిలో ఉంది. ఈతడు తన పద్యాల్లో కాంతి ప్రసాదాది గుణాలకు తోడు పరుపోష నాగరికాది వృత్తులను చేర్చాడు. శబ్ద పాకాన్ని పరిపక్వం చేసి పద్యాలకొక విధమైన మెరుగును, కాంతిని అధికంగా కూర్చాడు. అందువల్ల ఇతని పద్యాలు జీవచైతన్యంతో ప్రకాశిస్తుంటాయి. దివ్య కావ్య ఫక్కికి

ప్రతీకగా వెలసిన కాకతీయ శైలి నవీన గుణ సనాథుడయిన సోమనచే జిలుగుల సంతరించుకొని విజయ నగర శైలికి (తరువాతి ప్రబంధశైలికి) మార్గాన్ని సుగమం చేసింది ఈయన శైలీ రామణీయకత అపూర్వమైంది. ఇది కాంతి గుణంతో ఉజ్వలమై ప్రకాశిస్తుంటుంది ఉదా॥

సీ. ``నరకాసుర ప్రాణ నాళోత్త రణకేళి
రణకేళి వలకేళిరమణ జూపెఁ
గంసదానవ శిరః కమల కృత్తనమేలు
తన మేలుచేయి పెద్దలకు నొసగె
జాణూర ముష్టిక క్షతజ కీలాలంబు
నాలంబులో నెల్లనలవు వఱపె
ముర హయ గ్రీవాంత్ర మూల ఫేనావలి
నావలి దలగ జీకాకు పఱచె

తే.. వీరరస సార కాసార విహరణంబు
విష్ణునకు నొప్పు నతనితో విగ్రహింప
దొరకొనిన వచ్చు మనకు ముద్దులు మునింగి
పాఱ వెంపళ్లు తమకెంత బంటియనుట
(ఉత్తర హరివంశం4-124)

సకల భాషా భూషణుడు, సర్వ శాస్త్ర పారంగతుడు,మహాకవి అయిన నాచన సోమన ఉత్తర హరివంశంలో ప్రదర్శించిన పాండిత్యం, వ్యాకరణ పద ప్రయోగాది వైచిత్ర్యం పాఠకుల కాశ్చర్యాన్ని కలిగిస్తాయి కేవలం సంస్కృతసమాస గ్రథనం లోనే కాక తెలుగుసమాసపు కూర్పులో కూడాప్రౌఢత్వాన్ని ఉట్టిగట్టుకున్న ఈ ఉత్తరహరివంశంలో నేటికి నిఘంటువుల కెక్కనిపదాల ప్రయోగం బహుళంగా ఉండి పాఠకుల్ని పెక్కు చిక్కుల బెట్టుంటుంది. సోమన ఉత్తరహరివంశంలో ఉపయోగించిన తెలుగు భాషను పరిశీలిస్తే అదితిక్కన తెలుగుభాషను తలపింప జేస్తుంది. కానీ సోమయాజి భారత భాగాల్లో కన్నా సోమన హరివంశంలోని పద ప్రయోగంలో కన్నడపు

పొత్తు కొంత గోచరిస్తుంది. సోమన సొగటాలాట, దుర్గ సంరక్షణం, వేట , మల్ల బంధవిశేషాలు మొదలయినవాటిని వర్ణించేటప్పుడు కేవలం దేశీయ మైన పదజాలాన్ని ఉపయోగించి వర్ణనగావించాడు. సోమన కోటను శత్రువుల నుండి భద్రపరచే విధానాలను తృతీయాశ్వాసంలో వర్ణించాడు.

ఉదా|| ``కోట సింగారించి కొత్తళంబుల నెల్ల నట్టళ్ళు పన్నించి యాళువరికి............... ..బెట్టి పెట్టుడు నడుహట్టి మట్టిలావు" (2-92)

కొత్తళము=కోటపైనున్న ప్రధాన సైన్య స్థానం,

అట్టళ్ళు=కోట వాకిలి పైనుండు ఇండ్లు,

దంచనము=ఫిరంగి,

దద్దడంబులు=చిన్న మిద్దెలు,

పలుగాడి తలపులు= ఎంట్రెన్స్ గేట్స్ లాంటివి,

బాళెములు= కత్తులు మొదలయినవి.

శత్రువులు కోటను భేదించే విధానంలో వంకర దాకకు చేరి(ప్రవేశ ద్వారానికి చేరి),పంతగాడ్రు (మల్లురు), లాంటి పదాలు ప్రయోగింప బడ్డాయి.

యుద్ధంలో ఉపయోగించే నాటి సాధనాలు :- సురియ, కఠారం, తరువలి, కొంగవాలు, చక్రం, ముసలం,శూలం, వడిశెళ్ళు, భల్లం, ఒడ్డనం మొ|| స్వస్తిక, సర్వతో భద్రం, నంద్యా వర్తం మొ|| గృహ విశేషాలు భారంగి, లంగిణి, కలియ మొ|| గుర్రపు కళ్ళేల పేర్లు. కరాళించడం(సకిలించడం), లాతచేయడం(తన్నడం), కొక్కరించడం(కోడివలె దగ దీయడం)మొ||గుర్రాలు నడచేటప్పుడు చేసే చేష్టా విశేషాలు.కాలువలు, జోడెంపు వలలు, కన్నె వలలు, కాలురులు,వలలు మొదలయినవి వేటసాధనాలు. సవ్య మండల ప్రచారం, వలవంక దిరగడం, పక్కళంబ వడం మొదలయినవి గదాయుద్ధ విధానాన్ని తెలియజేస్తాయి. కడవ రాసకు జొచ్చడం, డొక్కరం హత్తడం, బిడగొనడం, తోరహత్తం మొదలయినవి మల్లయుద్ధ విశేషాలు భ్రాంతం,

విభ్రాంతం, విద్ధం, ఆవిద్ధం లాంటి ముప్పై రెండు ప్రచారాలను సోమన తెలియజేశాడు.

సేవకుల వోలె చొరవ వేసి కొనడం, ప్రతి గ్రహీతలం వోలె ధార ఏమరకుండడం,జూదరుల వోలె దండ మరువ కుండడం లాంటి ప్రయోగాల వల్ల సోమనకనేక వృత్తులతోగల పరిచయం వ్యక్తమవుతుంది. వాదులాడు (తగవులు పెట్టుకొను), వాట్లీడు (అడ్డంకులు చెప్పేవాడు), అడియరి (బానిస) వంటివి జూదమాడ గూడని వాళ్ళను గురించి తెలియజేస్తాయి సోమన సంస్కృతవ్యాకరణ మర్యాదననుసరించి దుర్వాసోముని, ఘనమహోమిశ్రంబు, మాతరపితృ వందనంబును, దుర్వాసః పరి వ్రాడ్విభున్ లాంటి ప్రయోగాలను చేశాడు.

విచిత్ర పద గ్రథన కళా ప్రావీణ్యుడయిన సోమన శ్రుతి సుభగత్వాన్ని చేకూర్చడానికై అనుప్రాసాది శబ్దాలంకారాలను, ద్విత్రి చతుష్పాసాది విశేషాలను ప్రవేశపెట్టి సహజ సుందర యతి ప్రాసరూపమైన ఆంధ్రవాణికి అత్యధిక సొబగుల్ని కూర్చాడు ఔచిత్యాన్నెరిగి చేసిన ఆయా జిలుగుల వల్ల ఉత్తర హరివంశం `పాదబద్ధో2క్షరసమః తంత్రీలయ సమన్వితః ' అన్న వాల్మీకి మహాకవి సూక్తిప్రకారం శ్రుతికింపు గూరుస్తూ శబ్దాలంకృతమై ఛందస్వరలయమై కానవస్తున్నది

సోమన అలంకారాలన్నీ అప్రయత్న సిద్ధాలయి సందర్భోచితంగా అతుకుతూ ఎంతో లోకోత్తరంగా ఉంటాయి ఉదాహరణకు ఇందు ధరోపాఖ్యానంలో జలక్రీడ సలుపుతున్న పార్వతిని ``కరసరసిరుహంబున నొక, సరసిరుహంబమర వదనసరసీ రుహమున్" (5-68) అని వర్ణించిన పద్యంలో శబ్దాలంకారాలు ఇమిడి ఉన్నాయి ఇక్కడ ఇతడుపయోగించిన `ధరణీధరతనయ దొంతి తామర జూపెన్' (3-68) అన్నమాటలో గల మనోహరలంకార ప్రయోగం మైమరపింప జేస్తుంది ఇలాగే ``మఱియు దానవ సైన్యంబు మాఱులేక ..... బవరమున నొక్కరుడు నేడు పల్లు వోలె" (1-43)అని రచించాడు. ఇంద్రుడు ఏదుపల్లు వోలె నిలిచె అనడం

ఉపమాలంకారం, ``కుంకుమ హత్తించి కొనగొర దీర్చిన పురుహూతి నిల్లాలి బొట్టనంగ" (3-86) అన్న పద్యంలో ఉత్ప్రేక్ష చోటుచేసి కొన్నాయి. ``తెలుగు వాఙ్మయ మున నితర కవులెవ్వరును సాధారణముగా ప్రయోగించి యెఱుగని యుపమానములను, అర్థాంతరన్యాసములను, దృష్టాంతములను నీతడు ప్రయోగించెను`` అని వేటూరి ప్రభాకర శాస్త్రి గారు తెలియజేశారు.

చ. ``కదిసితిమంత దంత పరిఘుద్వీప ఖండిత దేవదారువ్రు-

మదన వినోద కందళితమాస మానసవాస భీరువుం

బ్రదర పదాచ్యుత క్రకచ పాటి తలస్తక దేశ చారువ్రు-

ముదిత చమూరువ్రు- ఫలితమూలనమేరువు నా సుమేరువ్రు-"

(ఉత్తర హరివంశం2-38)

అన్న పద్యంలో శబ్దాలంకారాలయిన అంత్యాను ప్రాసం, వృత్యను ప్రాసం ఉన్నాయి.ఆశ్వాసాంత పద్యాల్లో అంత్యాను ప్రాసం చోటు చేసికొంది.

సోమనాదుని కవితాధార అత్యద్భుతమైంది. అందుకే లక్షణ, గ్రంథకర్తలచేత విషమ ప్రాసలు దుష్కర ప్రాసలు అని పేరు పెట్టబడిన వాటిని అవలీలగా అనాయాసంగా నిబంధించి ధారచెడకుండా రచన గావించాడు జకార ప్రాసంటే ఇతనికిష్టం `ంజ``జ్వ' అనే అక్షరాలను కూడా ప్రాసస్థానాల్లో ప్రయోగించాడు ``ప్రాగ్జ్యోతిషంబు గదిసి, సద్భుగ్జ్యా టంకృతులు లేక దితిజుల మీదన్"(4-146) అన్న పద్యంలో గ్జ్యో-గ్జ్యా లు ప్రాస స్థానంలో ఉన్నాయి. ``ఎద్రిచిన కాలపాకమున నీ గతి నీ మది గ్రోధ వల్లికం గాక కులంబు వాతులన్"(4-109)అన్న పద్యంలో మొదటి రెండు పాదాల్లో త్రిప్రాసను, తరువాతి రెండు పాదాల్లో ద్వి ప్రాసను వాడాడు

పద్యంలో వలె వచనం లోనూ ప్రాస నియమాన్ని పాటించి రచన చేసే ప్రక్రియ కాద్యుడు సోమనే అని చెప్పవచ్చు. ఉదా`` ||.............మర్మంబులు గీఱియు, మహీతలంబులు దూఱియు బ్రేవులు వెఱికియు బెను మూకల

కుటీకియు, సీసకంబులు వగిలించియు,శిరంబులు నొగిలించియు,గెదువులు గఱచియుంగరవాలంబులు సఱచియు...... "(1-148)అన్నది అను ప్రాస యుత వచనం.

`భీరపు పొత్తము గట్టుకొని పోయె పోయిన పోకై'(1-32)`కొఱవిందల బరికిగొన్న కొఱడులు గారే'(4-106)లాంటి జాతీయాలను, `చిల్కవోయిన పంజరమేమి సేయ? '(1-72)' ఎంత దటిగిన మిరియాలుం జొన్నలు సరిపోవే'(1-75) లాంటి సామెతలను,`నీ కనుదోయి వెన్నెలలు నిండక కోర్కులు నాకు నిండునే' (1-62)`ఉర్విలోన గడుపు చల్లని కాంతల గలుపు నన్ను '(2-75)లాంటి ప్రౌఢోక్తులను నాచన సోమన శైలిలో చూడవచ్చు ఇలాంటి ప్రఖ్యాతశైలి అనంతరకవులయిన శ్రీనాథాదులకు మార్గ ధర్శకమయిందనడంలో విప్రతి పత్తి లేదు.

☆☆☆

# 12. నాచన సోమనపై తిక్కన ప్రభావం

సంస్కృతంలో కాళిదాస మహాకవి ఎంతటి వాడో తెలుగులో కవితా మర్మజ్ఞుడయిన తిక్కన కూడా అలాంటివాడు కాబట్టే రామరాజ భూషణుడు ``కుండలీంద్రుండు తన్మహనీయ స్థితి మూలమై నిలువ "(వసు చరిత్ర1-10)అని వినుతించాడు. కవిత్రయంలో ఒక్కొక్కరు ఒక్కొక్కకవితా సంస్థ ఆమూడు సంస్థల్లో తిక్కనసంస్థమిక్కిలి పెద్దది ఇరవయ్యో శతాబ్దంలో తిరుపతి వేంకట కవుల్ని గురువులుగా తలచడం ఎంత గౌరవమో ప్రాచీనకాలంలో తిక్కన దారిలో నడవడం ఆనాటి కవుల కంతకీర్తి ఆ మార్గంలో నడచిన వాళ్లలో అగ్రగణ్యుడు నాచనసోమన.ఆమహాకవికి తిక్కనపై ఎక్కువ మక్కువ ఉందనడానికి ఆశ్వాసాంత గద్యమొక ప్రబల నిదర్శనం. నన్నయ, ఎర్రన భాస్కరాదులను తలపక తన వంశ ప్రసిద్ధులను ప్రస్తావింపక సంబంధ బాంధవ్యం లేని తిక్కనను స్మరించడం కేవలమాతని పట్ల సోమనకు గల భక్తినే తెలియజేస్తుంది ``ఇదిశ్రీమదుభయ కవి మిత్ర కొమ్మనామాత్య పుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారత కథానంతరంబున శ్రీ మత్సకల భాషాభూషణ సాహిత్యరసపోషణ సంవిధాన చక్రవర్తి సంపూర్ణ కీర్తి నవీన గుణ సనాధ నాచన సోమనాధ ప్రణీతంబైన యుత్తర హరివంశంబు" అని సోమన ఆశ్వాసాంత గద్యల్లో పేర్కొన్నాడు

``సోమన తనకున్న సకల భాషా భూషణ సాహిత్య రస పోషణాది శక్తులన్నియు తిక్కనశక్తి తరువాతనే గణింపదగినవని సూచించు కొనెను.తక్కిన కవులందరి కంటె నధికుడని,తిక్కన కంటె కాదు సుమా! అని తోచునట్లు సకల గుణములు గల తిక్కన భారత కథానంతరము తాను నవీన గుణ సనాధుడన్నట్లు వ్రాసెను."- అని భారతీదేవి గారు `తరువాతి కవులపై కవిత్రయ ప్రభావము' అనే గ్రంథంలో పేర్కొన్నారు. తనకంటె అన్నివిధాల తిక్కన అధికుడనడాన్ని సోమన చెప్పక చెప్పాడని ఇందలి తాత్పర్యం. తిక్కన మీద ఎనలేని గౌరవం, తన సామర్థ్యం మీద అనంత విశ్వాసమున్న వాడు కావడం వల్ల అతని పేరు పక్కన తన పేరుండ దగిందనీ భారతానంతరం తన హరి వంశం చదువ దగిందనీ సూచించాడు. అంతేగాక తిక్కన ఉత్తర రామాయణాన్ని రాయగా తానుత్తర హరివంశాన్ని రాశాడు. ఆయన హరిహర నాధుణ్ణి ఆరాదింపగా తాను కూడా ఆరాధించాడు. అర్చావతార మూర్తిగా గాక భావనా రూపంగా హరిహర నాధుణ్ణి ఆరాధించడంలో కూడా వీళ్ళిద్దరి మధ్య సామ్యముంది తిక్కన కావ్య

రసాన్ని కొనియాడగా సోమన దాన్నే సాహిత్య రసమని పేర్కొన్నాడు "ప్రాత వడ్డమాటలు పనికి రావని తిక్కన యనగా సోమన నవీన గుణసనాథుడయ్యెను ఆయన కథార్థమును ఘటిత పరము చేయుదుననగా తాను సంవిధాన చక్రవర్తి యయ్యెను" అనిడా॥పాటిబంఢ మాధవ శర్మ గారు నిర్వచనోత్తర రామాయణ పీఠికలో ప్రవచించి ఉన్నారు. తిక్కన ఒక అనంత తేజుడు ఆతేజంలో గల సరళశైలి, రసపోషణం, పాత్ర పోషణం, మానవమానసికతత్త్వనిరూపణం, వృత్తపరిగ్రహణవివేకం ఆలంకారిక రచన, సంభాషణా సంవిధానం, దేశీయ పదప్రయోగం,జాతీయపదానుబంధం మొదలయినవాటిలో తమకు నచ్చినవాటిని గ్రహించి తరువాతి కవులు తమ కవితా గృహాలను వెలిగించు కొన్నారు తిక్కనతో ఆంధ్రవాఙ్మయంలో రెండు మార్గాలేర్పడ్డాయి మొదటిది సంస్కృత మార్గానుకరణం, రెండోది దేశీయ మార్గావలంబనం. సోమన తిక్కన పద్ధతుల గ్రహించి తన కావ్య క్షేత్రంలో యథేచ్ఛ సంచారం గావించాడు

**1. ఘట్టాలు, అనుకరణ** :- నిర్వచనోత్తర రామాయణంలో గల రంభా రావణ సంవాదానికి మెచ్చి సోమన ఊర్వశీ నరక సంవాదాన్ని విస్తృతి గావించాడు."అతులిత ధైర్య సార'కరుణాలయ మానస!"(6-60)అని రంభ సంబోధిస్తే ఊర్వశి "చతురవచో విలాస!గుణసార!(1-66)అని పొగడింది... "నేను లంజియుం గావుదు,వాని తోడితమకంబది లంజియగాదు(6-72)అని రంభ పలికితే ఊర్వశి "లంజియ నౌదు నేను, విను లావున నీవమరేంద్రు గెల్చి"(1-72)అని నొక్కి చెప్పింది రావణునికంటె నరకుడుఉన్నతుడు. "నాకంటె మిగులువిటు నీలోకమునకాదు. "(6-71)అని రావణుడంటే నరకుడు "...రామలలో నగుబాటు దేను నీకే గలుగంగ (1-64) అని వచించాడు ఇలాగే కుబేర భటుల పలాయనాన్ని సోమన నరక బాధితులైన బదరికా వనమునుల పలాయనంతో జత గావించాడు. బాల మృతికై బ్రాహ్మణుడు విలపించే ఘట్టంలో, జనార్దుని రాయబారంలో, యుద్ధ వర్ణనలు చేయడంలో తిక్కన అనుకరణ ముంది.

**2. పద్యానుకరణం:-** సోమనకు ఉత్తమ స్థానాన్ని సంపాదించి పెట్టింది అతని కవిత్వ సంపదే. తిక్కన రచనా విధానాన్ని సోమన అనుకరించాడని అనడం సుస్పష్టం. తిక్కన ఉద్యోగ పర్వంలో.......

ప్ర ``గాండీవ జ్యారవం బుత్కటమయి పెలుచం(గమ్మినన్ భీము బాహా
దండంబేపారి శుంభద్గద జడియచు రౌద్రంబు గాదేచినన్వే
దండ ద్వంద్వంబు మాఱ్కొందఱమి కవలు మాద్యద్గతిందాకినం జా
కుండంబోకుండ గౌరవ్యులకు వశమె బిట్టుల్కి మూర్ఛిల్ల కుండన్"
(ఆంధ్ర మహాభారతం - ఉద్యోగ పర్వం1-323)

అని రచింపగా సోమన ఉత్తర హరివంశ ద్వితీయా శ్వాసంలో

ప్ర ``గాండీవా రావ ఝుంపా ఘటిత భయ దివౌకః పురాంతః పురింధ్రీ
గండా భోగ శ్రమాంభః కణ కలుషిత గంగాతరం గాభిషంగా
ఖండా స్మత్కాండ పాళీ కబళిత సకలాకాశ సీమా నిశాంతో
ద్దండాతిక్రాంత గర్వాంతక యమ భట సంతానముంగా నన్నైతిన్"
(ఉత్తర హరివంశం2-27)

అన్న పద్యాన్ని రచించి ఉన్నారు

తిక్కన విరాట పర్వంలో ``యోధా గ్రేసురుడిద్ద తేజుడు రణోద్యాగాను రక్తుండు "(విరాట5-11) అని ఉండగా`` వీరాగ్రేసురుడే కలవ్యుడు ధనుర్విద్యాన వద్యుండు`` (3-28) అని సోమన ఉత్తర హరివంశం పౌండ్రక వృత్తాంతంలో ఉంది.

``కర్ణుడు దుస్సేనుడు గల్గగ నా కొరులేల(ఉద్యోగ 2-.295)అని ఉద్యోగ పర్వంలో నుండగా ``నాకీ తమ్ముడు ఖడ్గముం గలుగఁ గా నాకేశుడుఁ సాటియే "(4-190) అని హంస డిభకోపాఖ్యానంలో ఉంది.

విరాట పర్వంలో ద్రౌపది కీచకుణ్ణి భయపెట్టే సందర్భంలో ``దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాప స్ఫుర .........(విరాట 2-55) అని ఉంటే సోమన హంస డిభకో పాఖ్యానంలో ``దుర్వారోద్గమ

రోషభాషణములై ధూర్త ప్రలాపంబులం"(4-74)అని అదే ఎత్తుగడలో రచించి ఉన్నాడు.

**3. వర్ణనలు :-** ఒక వస్తువు యొక్క సమగ్ర స్ఫూర్తిని దానికి సంబంధించిన బహు అంశాల చేత కలుగ జేసే ప్రయత్నమే వర్ణన. జడచేతన వస్తువిభాగం చేత కావ్యం లోని వర్ణనలు రెండు విధాలు సూర్యోదయాదులు జడాలు. కథలోని పాత్రలు చేతనాలు తిక్కన వర్ణనలు కథాంశంలో సహజంగా ఆవిర్భవించి ఉత్తరకథకు పోషకాలయి రసాని కుద్దీ పనాలుగా ఉంటాయి. తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో మాత్రం రెండుచోట్ల కథాప్రాధాన్యం తగ్గించి వర్ణనల నించుక విస్తరించాడు. మొదటిది రంభా రావణ సంవాదం రెండవది సీతారాముల దాంపత్య శృంగారం. తిక్కన జాడలో నడచిన సోమన కూడా ఊర్వశీ నరక సంవాదంలో శృంగారాభాసాన్ని రుక్మిణీ కృష్ణుల్లో శుచిత్వ శృంగారాన్ని వర్ణించాడు ఇంకాకొన్ని ఉదా|| తిక్కన భానుబింబ వర్ణనను ``నీరజాకరములు నిష్ఠమైజేసిన" (విరాట2-24)అనే పద్యంలో చేస్తే సోమన ``కుంకుమ హత్తించి కొనగోర దీర్చిన పురోహూతు నిల్లాలి బొట్టనంగ........ ..........భాను బింబంబు కన్నుల పండువయ్యె"(3-86)అని వర్ణించాడు. ఈ రెండు వర్ణనలకూ సామ్యముంది. తెల్లవారిన తరువాత కథను నడిపించడానికి సమర్థమయిన విషయమా రాత్రి జరిగింది. అందువల్ల తెల్లవారడం విధిగా వర్ణింప బడింది. అలౌకిక ఉపమానంతో తిక్కన భాను బింబాన్ని వర్ణించాడు. సోమన ఇంకొక పద్ధతి నవలంబించాడు. కృష్ణుడు ఉదయాన్నే వచ్చాడు. పోరుభీకరంగా సాగింది. అంధకారమలముకొంది. ఇక్కడ అంధకారం కృష్ణాభావమే కృష్ణుడే సూర్యుడు. సూర్యోదయంతో అంధకారం తొలగేటట్టు ద్వారకకు కలిగిన అనర్థం తొలగుతుందనడమే.

వర్ణనల్లో పర్యాయ పదాలు పయోగించి వస్తువును క్షుణ్ణంగా ఆలోచింప చేయడంలో తిక్కన సిద్ధహస్తుడు. ఉదాహరణకు పద్మవ్యూహప్రవేశం. "కరులనుచ్చిపోవుచు తేరుల విఱుచుచు హయదట్టంబులనురుము సేయుచు....

(ద్రోణ. 2-18) అని తిక్కన వర్ణన. ఇలాగే సోమన -`` ఇట్లు గదా విహారంబున హంసహలధరులు రుధిర ధారాసారంబు నందడిసి వడిసెడక వారింపక యోసరిలక యోలంబు గొనక పంటింపక పాదుకొనక....." (4-248) అని హంసహలధరుల యుద్ధాన్ని వర్ణించారు

ఘోర రణరంగాన్ని నాటకరంగంగా మార్చడం అన్న పద్ధతిని సోమన పాటించాడన వచ్చు. ఉదాహరణలు కొన్ని.

``ఇతని కితండె సాటియగు నీతని కితడె సాటివచ్చు" (4-257)

`` ఎవ్వడు రోరి తాను నొక యెక్కడు వీరుడ పోలె రాత్రి మై" (3-43)

``ఏమిర బాణ వ్రీడన విహీన భయోద్ధత మానసుండ వై" (6-198)

**4. పాత్రపోషణ, నాటకీయత :** పాత్రశబ్దానికి యోగ్యత అని అర్థం. ఆధారమనీ పర్యాయార్థం ఉంది. యోగ్యత అంటే సామర్థ్యం. అది కార్యసాధనలో ఉంటుంది. ఆ సాధన ఇచ్ఛాపూర్వకం. ఏతదిచ్ఛకాధార భూతుడయిన పురుషుడు పాత్రశబ్ద వాచ్యుడు. సమరసాలయిన కొన్ని చేతల యొక్క, అనుభూతుల యొక్క పరంపర ప్రదర్శింపబడుతూ పాత్రలు స్థిరత్వం కలవిగా చేయబడడమే పాత్రపోషణ. ఇది రెండువిధాలు. 1. అంతర్వర్ణనం 2. బహిర్వర్ణనం. తిక్కన రచనను నాటకీయత అని వ్యవహరిస్తారు. ఇలా అనడం ఆయన రచన రసప్రధానమని భంగ్యంతరంగా నిరూపించడమే. కావ్యాలు రెండు విధాలు శ్రవ్యం, దృశ్యం. దృశ్యం ప్రయోగం పొంద డానికి అవకాశముంది. శ్రవ్యానికి ఆ అవకాశం లేదు. తిక్కన ఉభయకావ్య శిల్పపారగుడు. అంగోపాంగ సహితమయిన ఆంగికాభినయం, కాకుస్వర సహితమయిన వాచికాభినయం, ముఖరాగ సహితమయిన కోపాభివ్యక్తి, రౌద్రవ్యంజక వర్ణఘటితాలు. ఉపమాద్యలంకారాలతో ప్రౌఢ వాక్యాల్లో చిన్న చిన్న ఛందోరూపాలతో రెప్పపాటులో జరిగిన సన్నివేశాలను కళ్ల ఎదుట రూపుగట్టటట్టు చేయడం తిక్కన ప్రత్యేకత పాత్రల ప్రవేశ నిష్క్రమణాలు,స్థితి గతి భేదాలు భ్రూనేత్ర కర్మ భేదాలు హాస బేదాలు వంటి నటనోచిత భంగిమలు తిక్కనలో వలె సోమనలో నూ గోచరిస్తున్నాయి. ఉదాహరణకు

``వాసవుడేనుగు దిగి, సింహాసమున ననుండి దిగి జనార్దనుడు" (1-125) అన్న పద్యంలో ఆంగికాభినయం కనిపిస్తుంది. ``నాకును గద నీకును గద, నాకును నందకము నీకును నందకమహహా" (3-95) అన్న చోట వాచికాభినయం గోచరిస్తుంది

``ఓరీ బ్రాహ్మణ ధూర్త నాయెదుర నోహో సాహసం బెట్టిదో" (4-187) అన్నది సంభాషణాత్మకం. ఇలాగే అల్లనవ్వు, చిఱునవ్వు, కవకవ నవ్వు, వెగ్గలపు నవ్వు, నవ్వకనవ్వు మొదలైనవి కూడా తిక్కన నవ్వులను పోలినవే.

5. **శైలి** :- శిల్పార్థంలో శైలీ శబ్దం ప్రయోగింప బడినట్లు డా||పాటిబండ మాధవ శర్మ గారభిప్రాయ పడ్డారు. శబ్ద సంవిధానంలో ఎగుడు దిగుడు లున్నట్లు చెప్పడం విచిత్రశైలి. ఇదే తిక్కన శైలి. సోమన తిక్కన నుసరించి నందు వల్ల ఇతనిది కూడా విచిత్రశైలే

**(అ) ఛందస్సు** :- కోలాహలం తోడి విషయాన్ని వర్ణించే సందర్భంలో భయావహమయిన ఉత్సాహంతోడి ఉద్ధత విషయవర్ణన పట్ల తిక్కన స్రగ్ధర నుపయోగించాడు. అలాగే సోమన కూడా ``గాండీవా రావ ఝంపాఘటిత భయదివౌకః పురాంతః పురంధ్రీ" (2-27) అనే స్రగ్ధర పద్యాన్నే ప్రయోగించాడు ఛందోవిషయంలో సోమన తన పాండిత్యాన్ని ప్రకటించాడనడం సుస్పష్టం ఉదాహరణకు కఠిన ప్రాసలు-గ్ణ్య,ల్గ,ష్మ,ష్ట, ంజ్య మొదలైనవి తిక్కన వలె సోమన కూడా కందాన్నే ఎక్కువగా ప్రయోగించాడు. కందానికి సోమయాజి ఘనుడంటారు. అదే రీతిగా కంద పద్య రచనలో సోమన కూడా వైవిధ్యాన్ని ప్రదర్శించాడు.

**(ఆ) అలంకారాలు** :- ఆనంద వర్ధనుడు ``అలంకారములను రసమున కంగముగా కూర్ప వలెను. అవసరమున్ననే స్వీకరింప వలెను. సమయాను కూలముగా త్యజింపవలెను. అతి నిర్వహణేచ్ఛ లేకుండ వలెను. అయత్న సిద్ధములయినను నంగములుగా నుండు నట్లు సమీక్షింప వలెను. ``అని పేర్కొన్నాడు. తిక్కన అలంకారాలు సహజంగా ఉంటాయి. ఉదా||

`క్షీరోదకగతిబాండవ కౌరవులొడగూడి' (ఉద్యోగ 3-258) ``పెను గాలిని వెసగూలిన వనము క్రియంబడిన పాండవబలమున్ (ద్రోణ1-301)మొ॥కానీ సోమన కవిత అలంకారాల బరువుతో ఘల్లు ఘల్లు మంటున్నదని కవిత్వ వేదిగారాంధ్ర వాఙ్మయ చరిత్రలో చమత్కరించారు. తిక్కనకు వలె సోమనకు కూడా సింహోపమానం మిక్కిలి ఇష్టం. ఉదా`.............నాగము పై జను సింగమో యనన్' (1-44).

సమసాంత యమకాలు గల పద్యాలు తిక్కన రచనలో అరుదు. ఉన్నా ఆశ్వాసాంత పద్యాల్లో చూడవచ్చు. సోమన ఈ పద్ధతిని విస్తృత పరచాడు `పరమ కృపా విధేయ నిరుపాధిక చిన్మయ కాయ '.......... (విరాట2-363) అని తిక్కన పద్యం. `వాసుకిహార సంతత నివాసము వాసర వల్లభ ప్రభా' ( 2-159) అని సోమన పద్యం.

(ఇ) భాష:- తిక్కనవలె సోమన కూడా చిన్న చిన్న మాటలతో అలతి అలతి వాక్యాలతో విషయ వివరణ గావించాడు. లోక వ్యవహారంలో గల పదాలను సందర్భోచితంగా ప్రయోగించడంలో తిక్కన శిష్యుడని నిరూపించాడు. తిక్కన కాలం నాటికి వెన్నుబలం లేదు ` కన్నడం నుండి, తమిళంనుండి అనేక శబ్దాలను మట్టసంగా తలలు మార్చి తెలుగు చేసికోవడం 'అన్న పుట్టపర్తి నారాయణాచార్యుల వాక్యం సోమనకు కూడా సరిపోతుంది. కారణమీయన అష్ట భాషా కోవిధుడు కావడం తిక్కన ఏ అర్థంలో ఎలాంటి పద ప్రయోగం చేశాడో ఆ అర్థంలో సోమన కూడా వాడడం గుర్తింప దగింది. ఉదా॥బరవసము:-``ధృష్ట ద్యుమ్నుడు బరవసము దలిర్ప నడ్డపడి పోరాడెన్ "(ద్రోణ 1-368) అని తిక్కన బరవసంబున దలబడ్డ బవరమచట' (1-26) అని సోమన ముచ్చిమి `` తమలోన జేసి క్రూరతయు ముచ్చిమియుఁఅంకు సైపక ".................(శాంతి2-256) తిక్కన. ``సొంబుండు గజపుంంబు సొచ్చి ముచ్చిమి ......... (1-9) సోమన అడియరి (బానిస) తమిళ పదం- అంజెదవు (భయం) - కన్నడ పదం. ఇలాగే మెయిమరుగులు, కప్ప యెలుంగు పాము, పోరాని చుట్టము, తేనె బూసిన

కత్తి మొదలైనవి తిక్కన ప్రయోగాలు సోమన పెక్కు జాతీయాలను, సామెతలను, లోకోక్తులను వాడి భాషను సుసంపన్నం చేశాడు

తిక్కన సోమనలను స్థూలంగా పరిశీలిస్తే తిక్కన కవిత్వంలో విషయం విస్తరించి రాయబడినట్టు తోస్తుంది. సోమన కవిత్వంలో విషయం కుదింపబడి వాక్ ప్రౌఢిమకు, పాండిత్యప్రకర్షకు, వర్ణనాచాతుర్యానికి ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తుంది. తిక్కనకు సర్వతోన్ముఖ ప్రజ్ఞ ఉంది. పాత్ర చిత్రణలో, సమయోచిత పద ప్రయోగ సందర్భంలో సోమన ఇంచుక వెలితి వాడుగా కనిపిస్తాడు.తిక్కన కవితలో సమాసాలున్నా అవసరమున్నంత వరకే రసోత్పత్తికి తోడ్పడుతుంటాయి. సోమన కవిత్వమలా కాదు సంస్కృత శబ్ద ఝరులతో ఈయనకవితా ప్రవంతి పారుతుంటుంది తిక్కన పురాణగతిలో తొట్రుపాటు చెందడు రసాన్ని చూపుతూ విషయాన్ని రుచింప జేస్తాడు. కానీ సోమన లాగా రసోత్పాదనకైవిషయాన్ని విస్మరించడు తిక్కన కవిత్వం పండితులకు, రసగ్రహణ పారీణులకు రుచి పుట్టిస్తుంది. సోమన కవిత్వం పరమ పండితైక వేద్యం. అందువల్ల భారత కావ్యం సకల ప్రజారంజకమయినా ఉత్తర హరివంశం అంతగా ప్రచారం పొందలేదు. ``తిక్కన కవితా గుణముల గ్రహించి మెఱుగు పెట్టి పాకము మార్చి జగ్గు నిగ్గు కూర్చి ప్రబంధ పాకమున కనువైన భావములు, ధ్వనులు సంధించి సోమనాధుడు కావ్యమల్లెను "అని భారతీదేవిగారభిప్రాయ పడ్డారు.

ఇద్దరూ మహాకవులే హరిహరోపాసకులే. తిక్కన ఒక్కడే తన చేతులమీద భారతం పదహైదు పర్వాలు పూర్తి చేస్తే సోమన భారతఖిల పర్వంగా పరగణింపబడే హరివంశంలోని ఉత్తరభాగాన్ని మాత్రమే రచించిధన్యుడయ్యాడు

★★★

# 13. నాచన సోమన హరిహరనాథ తత్త్వం

హరి అంటే విష్ణువు. హరుడంటే శివుడు. హరిహరుల కలయిక హరిహరనాథతత్త్వం. ఈ సమ్మేళనమనాదా? మధ్యకాలంలో ఏర్పడిందా? అనడంలో భేదాభిప్రాయాలున్నాయి అలాగే తిక్కన హరిహరనాథ తత్త్వం రూపైక్యమా?ఊహాత్మకమా?అనడంలోనూ వాద ప్రతివాదాలున్నాయి. ఆంధ్ర సాహిత్యంలో హరిహరనాథుణ్ణి ఉపాసించిన కవులున్నారు. వాళ్ల ఆరాధనలో భిన్నత్వం గోచరిస్తుంది.

వేదాలననుసరించి హరిహరులు ప్రత్యేక దేవతల్లాగా గోచరించడం లేదు. వేదాల్లో కానవచ్చే విష్ణువు హరిగా, రుద్రుడే హరుడుగా మార్పు చెందినట్లు చెప్పవలసి ఉంది. మంత్ర పుష్పంలో చెప్పబడు 'త్వం రుద్రం' 'త్వం విష్ణు' 'త్వం బ్రహ్మత్వమ్'వాక్యాలను 'నశివః నహరిః' వాక్యాలను చూస్తే వేదాలు శివకేశవాభేదాన్ని చెప్పినట్టు నిర్ధారింపవచ్చు

ఉపనిషత్తుల్లో కూడా హరిహరా భేదముంది. అయినా శైవులు అధర్వ శిరస్సు, అధర్వశిఖ మొదలైన ఉపనిషత్తుల నాధారంగా శివుడే పరమ దైవమని ప్రతిపాదించగా, వైష్ణవులు మహా నారాయణో పనిషత్తు నాధారంగా విష్ణువే పరదైవమని నిర్ణయించారు. ఇందువల్ల ఉపనిషత్ కాలం నాటి కించుక భేధమేర్పడిందని చెప్పవచ్చు.

అష్టాదశ పురాణాల్లో కొన్ని శివాధిక్యాలు కాగా మరికొన్ని విష్ణ్వాధిక్యాలయ్యాయి. శైవ పురాణంగా చెప్పబడిన స్కాందంలో విష్ణు మాహాత్మ్యం ప్రకటింపబడింది. బ్రహ్మాండ పురాణంలో విష్ణువు తన భక్తుడు శివ ద్వేషి అయితే తనకూ ద్వేషి అని చెప్పినట్టు వాక్యాలు గోచరిస్తున్నాయి. అగ్ని, విష్ణు, కూర్మ పురాణాలు కూడా హరిహరా భేదాన్ని ప్రతిపాదిస్తాయి.

కృష్ణ మాహాత్మ్యాన్ని ప్రపంచించే ఇతిహాసం మహాభారతం ఇందక్కడక్కడ శివుని మాహాత్మ్యాలను విస్తరించే ఘట్టాలు లేకపోలేదు. ఉదాహరణకు ద్రోణ, అనుశాసనిక పర్వాలను గ్రహింపవచ్చు. మహాయోధుడయిన రుద్రుడు యుద్ధాధి దేవత. ఈయన వీరులకుపాస్య దైవం. అశ్వత్థా మార్జునులు ఈశ్వర ప్రసాదాన్ని పొందిన వీరులు. సైంధవ సంహార సంసిద్ధుడయిన అర్జునుడు కృష్ణునర్చించాడు. నాటి రాత్రి కృష్ణార్జునులు కైలాసానికి వెళ్లారు. కృష్ణార్పితాలయిన పూజా ద్రవ్యాలు పరమశివుని దేహం మీద ఉండడాన్ని గుర్తించి అర్జునుడు చకితుడై అభేద భావాన్ని గ్రహించాడు.

హరుని లింగా రూఢుని గావించడం వల్ల సవ్యసాచి విశేష మహిమలను పొందాడు. కానీ అశ్వత్థామ మృతి కాకృతి లో ఉన్న శివుణ్ణి ఆరాధించాడు హరిహరా భేదమే మహాభారత సందేశం

క్రీ.శ. 809లో వెలసిన గంచనామి శాసనంలో హరిహరస్తుతి ఉంది. క్రీ. శ. 578కాలం వాడయిన పశ్చిమచాళుక్య రాజు పృధ్వీవల్లభ బిరుదాంకితుడు హరిహరుని నుతించినట్టు బాదామి (వాతాపి) గుహల్లోని విగ్రహ మూర్తులు సాక్ష్యమిస్తున్నాయి. పల్లవ రాజు నరసింహుడు నెల్లూరు ఉదయగిరి సీమలో సీతారామపురానికి ఈశాన్యంలో ఏడెనిమిది మైళ్ల దూరంలో ఉన్న భైరవుని కోనలో హరిహర విగ్రహాలను చెక్కించినట్టు చారిత్రకాధారాలున్నాయి. బీహారులోని హరిహరమూర్తి హరహరిమూర్తిగా చెక్కబడి ఉండడం ప్రత్యేకత. మైసూరు రాష్ట్రంలో హరిహర క్షేత్రమనే గ్రామముంది పోలాశ్వ దండ నాధుడనే రాజు (క్రీ శ.1173-1220)వైష్ణవ భక్తుడయినా హరిహరాలయ నిర్మాణం గావించినట్లు తెలుస్తుంది. ఆళ్వారుల పాశురాలను బట్టి శ్రీ వెంకటేశ్వరుడు కూడా హరిహరనాధుడని విదితమవుతుంది.

``కృషిర్భూ వాచక శ్శబ్దో ణశ్చ నిర్వృతి వాచకః

విష్ణుస్తద్భావ యోగాశ్చ కృష్ణో భవతి శాశ్వతః"

(ఉద్యోగ పర్వం70-5)

అని కృష్ణ శబ్ద వ్యాఖ్యానంలో శ్రీ శంకరులు (20వ శ్లోకం)ఉదాహరించి ``ఇతి వ్యాస వచనాత్ సచ్చి దానందాత్మకః కృష్ణః" అని స్పష్టంచేశారు. ఇదే హరిహరనాధ తత్త్వమని డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు గారు ఆనుశాసనిక పర్వ పీఠికలో విశదీకరించారు.

హరిహరులిద్దరూ హరించే వాళ్లే అవుతారు. ``హరిః గజేంద్ర మోక్షణే ఆపదం హరతీతి హరిః సర్వంసంహార్తా హరః హరతిసర్వం సంహార తీతి హరః హరతేరనుద్యమనే ఉజిత్వచ్" అన్న శివసహస్ర నీలకంఠ భాష్యంలోని వాక్యాలిందు కాధారాలు. హరిహర శబ్దాలను పరిశీలిస్తే రెండూ ఏకధాతు

జన్యాలుగానే గోచరిస్తాయి. హృఞ్-హరణేధాతువు పై-ఇ ప్రత్యయం చేరిస్తే హరి,-అ ప్రత్యయాన్ని చేరిస్తే హర అయ్యాయి. కాబట్టి హరిహర శబ్దాలకు మూలం ఒకటేననీ, ప్రత్యయ భేధంవల్ల శబ్దస్వరూప భేదమేర్పడిందనీ చెప్పవచ్చు. యథార్థతత్త్వంలో కూడా వీళ్ళిద్దరూ ఒకరే. ఏక బీజాన్నుండి ప్రభవించిన రెండు వృక్షాలుగానే వీళ్ళను పరిగణించవచ్చు. ఆకారంలో వేరయి ఒకే మూలానికి చెందినట్టుగా ఒక తేజం నుండి ఉద్భవించిన హరిహరులు ఏకత్వాన్ని పొంది ఉన్నారని హరిభట్టుకవి వినుతించాడు.

శరీరాత్మ సమన్వయం హరిహర తత్త్వం. ఇది సగుణ నిర్గుణ సమన్వయ మయిన మహాతేజం. నీల వర్ణంవిష్ణువు. శుభ్రతేజం శివుడు. శీతత్త్వం హరి ఉష్ణతత్త్వం హరుడు. హరిప్రవృత్తికి, హరుడు నివృత్తికి కారకులు, కాబట్టి ఓత ప్రోత రూపమయి విశ్వదృశ్యాకారక మహాశక్తి సమన్వయమూర్తి, వ్యక్తావ్యక్త సమన్వయ తత్త్వం హరిహరనాథతత్త్వమవుతున్నది.

క్రీ.శ 13వ శతాబ్దం నాటికి వీర శైవ మత విజృంభణం వల్ల నామ మాత్రావ శిష్టమై ఉండిన అద్వైత మత పునః ప్రతిష్ఠాపనానికి ఆంధ్ర దేశంలో శ్రీకారం చుట్టిన మహామనీషి తిక్కన సోమయాజి. హరిహర నాథుణ్ణి మొదట ఆరాదించిన కవిశేఖరుడీయనే. భారత కృత్యారంభంలో ధర్మాద్వైతంతో హరిహరాద్వైత ప్రతిపాదక మైన పరతత్త్వాన్ని కొలిచాడు. ఆశ్వాసాంత పద్యాలను బట్టి చూస్తే తిక్కన హరిహరుడు అర్చారూపుడు గాక భావనా విలసితు డని తెలుస్తుంది. తిక్కన విరాట పర్వారంభంలోనే హరిహరనాథుణ్ణి

ఉ ``శ్రీయన గౌరినా బరగు చెల్వకు జిత్తము పల్లవింప భ
ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపము దాల్చి `విష్ణు రూ
పాయ నమశ్శివాయ'యని పల్కెడు భక్తజనంబు వైదిక
ద్యాయిత కిచ్చ మెచ్చు పరతత్త్వము గొల్చెదనిష్ట సిద్ధికిన్"

(భారతం-విరాటపర్వం1-1)

అని స్తుతించి కావ్యారంభం గావించాడు. భక్తహృదయాను వర్తి అయిన సర్వేశ్వరుడు తనకిలా సన్నిధి చేశాడని కవి బ్రహ్మ-

గీ ``కరుణా రసము పొంగి తొరఁగెడు చాడ్పున
  శశిరేఖ నమృతంబు జాలు వాఱ
హరినీల పాత్రిక సురభి చందనమున్న
  గతినాభి ధవళ పంకజము మెఱయ
గురియైన చెలువున నెఱసిన లోకర
  క్షణమనంగ గళంబు చాయ దోప
బ్రథమాద్రి దోతెంచు భాను బింబమునా ను
  రమ్మున గౌస్తుభ రత్నమొప్ప

తే. సురనదియును గాళిందియు బెరసినట్టు
కాంతి పూరంబు శోభిల్లు శాంతమూర్తి
నామనంబు నానంద మగ్నముగజేయ
నెలమి సన్నిధి సేసె సర్వేశ్వరుండు."

(భారతం-విరాటపర్వం1-12)

అని తెలిపి ఉన్నాడు. ఈ పద్యంలో ఒక విశేషముంది శివుడు విషమ తత్త్వం అవ్యక్త చైతన్యం. బేసిసంఖ్య విషమతకు నిధానం. సరిసంఖ్య వ్యక్తతకు నిధానం. చతుర్భుజుడు, చతుర్ముఖుడు వ్యక్త తత్త్వాలు. త్రినేత్రుడు, పంచముఖుడు అవ్యక్త తత్త్వాలు. కాబట్టి 1,3 పాదాల్లో శివతత్త్వం 2,4 పాదాల్లో విష్ణుతత్త్వం కూర్చబడ్డాయి. అవ్యక్తమమూర్తం. వ్యక్తం మూర్తం శివత్వ ప్రతీక లయిన రేఖలు చంద్రుడు. ఇక్కడ అంగవర్ణన లేదు. విష్ణుమూర్తి వర్ణనలో కౌస్తుభాదులు చెప్పబడటం వల్ల వ్యక్త తత్త్వాలు. శివతత్త్వం నిరలంకృతం. విష్ణుతత్త్వం సాలంకారికం. శివతత్త్వం సత్యమయితే విష్ణు తత్త్వం సౌందర్యం. 1,3 పాదాలు శీర్ష స్థానం కాగా 2,4, పాదాలు అధో భాగాలుగా వర్ణింప బడ్డాయి. ఇది అభేద దృష్టి. అంటే హరిహర సమన్వయాన్ని భారతం బోధిస్తూ ఉందని స్పష్ట మయింది.

తిక్కన కొలచిన పరతత్త్వం వేదవ్యాస మహాముని ప్రణీతమయిన భారతంలో నిగూఢ సంప్రకట భూమా సమాశ్రయమయిన పరమాత్మే. ఆశ్వాసాంత పద్యాల్లో తిక్కన ``వేదవ్యాస వ్యంజిత విహార హరిహరనాధా!" ``పారాశర్య స్తవనీయ గుణనిధానా!"అని ఈ భావాన్ని స్పష్ట పరచాడు.పరమాత్మ తత్త్వోపాసనను ఒకప్పుడు నిర్గుణాత్మకంగానూ ఇంకొకప్పుడు సగుణాత్మకంగాను చిత్రించి ఉన్నాడు. హరిహరుడు తిక్కన దృష్టిలో దుః ఖత్రయ నిర్మూలన కారకుడు. కాబట్టి ప్రత్యక్ష మయిన దేవుణ్ణి ఉద్దేశించి ``జన్మాంతర దుఃఖముల్ దొలగునట్లుగజేసి సుఖాత్ము జేయవే" (విరాట1-21) అని ప్రార్థించాడు.

తిక్కనకు తరువాతి వాడైన నాచన సోమన ఉత్తర హరివంశాన్ని హరిహర నాధునికి అంకిత మిచ్చాడు. తిక్కన లాగా హరిహరనాధుడు వేదవ్యాస మహర్షి సంపూజితుడని సోమన పేర్కొన్నాడు. కావ్యారంభం లోనే``........వేదవ్యాసముని మనోనివాస హరిహరనాధా!(1-1)అని సంబోధించాడు. అర్చారూపంగా గాక సకల జగద్రక్షకుడు, దేవాధి దేవునిగా భాసింప జేయడం సోమన ఉద్దేశం. ఈతడు హరిహరాభేద నిరూపణకు పూర్వమే ద్వితీయా శ్వాసంలో ``పరివాదా స్పద వాదమోద మదిరా పానంబుచే మత్తులై" (2-68), ``పదునాలుగు లోకంబులు" (2-69) అన్న పద్యాల్లో చతుర్దశ లోకాలను సృష్టించి సంహరింప వలసిన భిన్నులయిన హరిహరులొక్కరే అవుతారు. కానీ వేరు కారన్నారు. వీళ్లను భిన్నులుగా భావించిన భేదవాదులు కేవలం పరివాదాస్పదమోద మదిరాపానంతో మత్తులై శివకేశవులు వేంరటున్నారు. కానీ పెద్దలు ఐక్యాన్ని చాటించారు. కైలాసం లో మునులు శివకేశవుల ఏకత్వాన్ని భావించారని చెప్పి చివరకు మురవైరి. పుర వైరులను వేరుచేయడం కేవలం భ్రాంతే గాక ద్రోహమని కూడా సోమన ప్రకటింపజేశాడు

తిక్కనలాగా సోమన హరిహరనాధుణ్ణి గురించి ``పరిమిత గుణ ధన్యా భక్తిరేఖావ దాన్యా" (3-162)అనడాన్ని బట్టి ఆ దేవుడు పరమదైవమనీ జగత్పతి అనీ పరబ్రహ్మ అనీ రూఢమవుతుంది. శివకేశవుల ఆకార సంయోజనం

లాగా తత్త్వాల్లో కూడా అభేదాన్ని చెప్పడానికై సోమన పెక్కు పద్యాలను రాశాడు. ఉదాహరణకు చతుర్థాశ్వాసంలో ``చక్ర పరశ్వథయుతదో, ర్విక్రమ జిత దానవేంద్ర..........."(4-320)అన్న పద్యాన్ని పేర్కొన వచ్చు. ఆకార ప్రకటన సందర్భంలో మాత్రం సోమన తిక్కన కంటె భిన్నంగా హరిహరుని కీర్తించాడు. మంత్రోపాసనలో తిక్కన హరిహరులను గురించిన బీజాక్షరాల నను సంధానించినట్టు సోమన సంధ్యాకాల మూల జపమయిన గాయత్రిలో ఓంకార కలిమిని పేర్కొని వేదాది అయిన ఓంకారాన్ని శివపరంగా వేదమాత అయిన గాయత్రిని విష్ణు పరంగాసమన్వయించాడు.

ఉత్తర హరివంశం ద్వితీయాశ్వాసంలో శ్రీకృష్ణుడు పుత్రార్థి అయి కైలాసానికి వెళ్లి తపస్సు చేసి పరమశివుణ్ణి మెప్పించడం వర్ణింపబడింది. శివకేశవ సమాగమం జరిగినపుడు పరస్పర స్తుతుల గావించు కొన్ని సందర్భాల్లో హరిహరాభేద తత్త్వం వ్యక్తమవుతుంది. పరమ శివుడు సాక్షాత్కరించి ``నేన నీవన నీవ నేనన వర్తింతు మిరువుర శబ్దార్థమేకరీతి"(2-212)అని వక్కాణించడం అభేద ప్రతిపత్తిని సూచిస్తుంది. `నాకి చనవి తలంచియు 'అనడంలో విష్ణ్వాధిక్యముంది. కరాలు మొగిచి శివుడు కృష్ణుని కొనియాడడం ఇందుకు నిదర్శనం. కృష్ణుడు సాత్త్వికంలో విష్ణువు. రాజసంలో బ్రహ్మ. తామసంలో రుద్రుడు. హరిహర సమాగ మంలోనూ విష్ణువే అధికుడు. ద్వితీయా శ్వాసంలో విష్ణువు యొక్క పరమోత్తమ దైవత్వ లక్షణం చెప్పబడింది.

రుద్రస్వరూపాన్ని నిర్ణయించడంలో సోమన విభిన్న పద్ధతిననుసరించాడు. రుద్రుడు అగ్ని స్వరూపుడు. ఏకాదశ రుద్రులంటే ఏకాదశ మహాగ్నులు. బాణుని పురాన్ని పరమశివుడు రక్షిస్తుండేవాడంటే ఏకాదశ అగ్నులు రక్షిస్తుండేవనడమే. బాణాసరుని కథలో శివ విష్ణు జ్వరాల ప్రసక్తి సందర్భంలో హరిహరాభేదత్వం ప్రకటింపబడింది. శివజ్వరం వచ్చి కృష్ణుని తాకింది. ఆ జ్వరం ప్రవేశించగానే కృష్ణుడు వివశుడయ్యాడు. తన్నుతాను మరచినపుడు తమోగుణాధిక్యం ఎక్కువ. కృష్ణుడు విష్ణుజ్వరాన్ని ప్రయోగించాడు. అంటే సత్వగుణాధిక్యం కలిగిందనడమే. శివకేశవ సమరంలో

శివుడు త్రిపుర మథనాస్త్రం ప్రయోగింపగా కృష్ణుడు భయపడ్డాడు. కృష్ణుడు జృంభణాస్త్రంప్రయోగింపగా పరమ శివుడు లోలు డయ్యాడు. సత్వగుణం మూలవస్తువై లోక సుస్థితిని పాలిస్తుండగా తమోగుణం లోకంలో వ్యాపిస్తుండేది. లోక ప్రవర్తనలో విష్ణువు కైనా శివాజ్ఞ అవసరం. ఈ గుణద్వయ సిద్ధాంతాన్నే సోమన స్పష్టపరచాడు. హరిహరుల కభేదం పాటించి ధ్యానించడం తిక్కన మార్గమయినా హరిహరుల్ని భిన్నంగా వర్ణించి ఏకమొనర్చి ముగించే సంప్రదాయాన్ని సోమన పాటించాడు. ద్వితీయాశ్వాసంలో సోమన "అభ్రంకషంబైన యాలపోతు నితండు త్రుంచినా డీతండు పెంచినాడు." (2-180) అనే సీస పద్యంలో హరిహరులను భిన్నంగా వర్ణించి హరిహరారాధనతో ఏకత్వమొనర్చాడు.

ఈ విధంగా తిక్కన చేత ప్రభావితుడైన నాచన సోమన శివకేశవాభేదాన్ని పాటించి హరిహరనాథో పాసన గావించి తరువాతి తెలుగు కవులకు మార్గదర్శకుడయ్యాడు. సోమన తరువాత కొఱవి గోపరాజు, బైచరాజు వేంకటనాథుడు, దూబగుంట నారాయణ కవి, కంభం పాటి నారయ, హరిభట్టు లాంటి కవులెందరో హరిహరనాథుణ్ణి ఆరాధించి ధన్యులయ్యారు.

(సద్గురు వాణి-ఏప్రిల్ 1984)

★★★

# 14. నాచన సోమన-అన్నమయ్య

ఆంధ్రసాహిత్యం చాలా వరకు సంస్కృత సాహిత్య విధేయంగానే సాగింది అందులోనూ కొత్తమలుపులు గోచరించక పోలేదు అలాంటి మలుపుల్ని సృజించిన వాళ్లలో మొదటివాడు నవీనగుణ సనాథుడైన నాచన సోమనాథుడు. పురాణ విధేయంగా సాగిన తెలుగు కవిత్వాన్ని తేట తెలుగులో ప్రబంధోన్ముఖం చేసిన ప్రజ్ఞాశాలి ఈయన. అద్వితీయుడై ద్వితీయ స్థానాన్ని అలంకరించినవాడు తాళ్లపాక అన్నమాచార్యుడు. ఆంధ్ర సాహిత్యంలో విప్లవాత్మక మయిన మార్పులు తెచ్చి పరిపుష్టం చేసిన వాడీ మహానుభావుడు. సాహిత్యాన్ని భాషరీత్యా భావంరీత్యా సామాన్య ప్రజానికానికి చేరువగా తీసుకు వచ్చారు. జానపద బాణీలను చొప్పించి పద్యాలను తలపించే పాటలను రచించాడీయన. భిన్న కాలాలకు, భిన్న ప్రక్రియలకు చెందిన వీళ్లిద్దరిలోనూ కొన్ని పోలికలు కొట్ట వచ్చినట్టు కనిపిస్తున్నాయి.

సోమన అన్నమయ్య లిద్దరూ కడపజిల్లాకు చెందిన వాళ్లు. సోమన విజయనగర పాలకుడైన బుక్కభూపతి చేత పెంచుకల దిన్నె గ్రామాన్ని ప్రతి గ్రహించినట్టు శాసనాధారాలున్నాయి. కాబట్టి ఇతడు పెంచుకల దిన్నె వాస్తవ్యుడేనని పండిత పరిశోధకుల విశ్వాసం. అన్నమయ్య రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామానికి చెందినవాడని అందరికీ తెలుసు.

సోమన క్రీ.శ. 1285 ప్రాంతంలో జన్మించి క్రీ.శ.1355 ప్రాంతం వరకు జీవించాడు. ఇతడు క్రీ.శ.1310-1340 వరకు గ్రంథకర్తగా ఉండి క్రీ.శ. 1344 నాటికి చాలా గ్రంథాల్ని రచించి మహాకవి వర్యుడుగా వినుతి కెక్కాడని చెప్పవచ్చు. అన్నమయ్య క్రీ.శ. 1408లో జన్మించి 1503లో పరమపదించినట్టు తెలుస్తూఉంది. క్రీ.శ. 1424లో సంకీర్తనా యజ్ఞం ప్రారంభించి అధ్యాత్మ శృంగార సంకీర్తనలు 32 వేలు రచించాడు సోమన విషయంలో లాగే అన్నమయ్య కాలనిర్ణయంలో కూడా భిన్న వాదాలున్నాయి.

లభించిన ఉపపత్తుల్ని బట్టి ఉత్తర హరివంశం, వసంత విలాసం, హరివిలాసం, ఆది పురాణం, హర విలాసం, సోమవ రచనలని తెలుస్తూఉంది. వీటిలో ప్రస్తుతం ఉత్తర హరివంశం మాత్రమే లభ్యమవుతూ ఉంది. అన్నమయ్య 32 వేల ఆధ్యాత్మిక శృంగార సంకీర్తనలు రచించినట్టు తెలుస్తూఉంది. వాటిని రాగి రేకుల మీదచెక్కించి పెద తిరుమలాచార్యుడు

కాబోలు తిరుమల శ్రీవేంకటేశ్వరాలయంలోని సంకీర్తన భండారంలో భద్ర పరచాడు. తరువాతి కాలంలో ఎవరో రాగి కరిగించి అమ్మివేయడం వల్ల సుమారు 20 వేల సంకీర్తనలు ఈనాడు మనకు లభించడం లేదు. అన్నమయ్యా రచించినట్టు చెప్పబడే 12 శతకాల్లో శ్రీవేంకటేశ్వర మకుటంతో ఉన్న అలిమేలు మంగ శతకం మాత్రం లభించింది. మంజరీ ద్విపదలో రాయబడిన శృంగారమంజరి కూడా లభించిన వాటిలో ఉంది. అన్నమయ్యా రచించినట్టు చెప్పబడే ద్విపద రామాయణం, వేంకటాచల మాహాత్మ్యం, సంస్కృతంలో రాయబడిన సంకీర్తన లక్షణం, పలు భాషల్లో రాయబడిన నానా ప్రబంధాలు కాలగర్భంలో కలిసి పోయాయి. ఈ అంశాలన్నీ దృష్టిలో ఉంచుకుని ఆలోచిస్తే సోమన, అన్నమయ్యా లిద్దరూ బహు గ్రంధకర్తలనీ గ్రంధనష్టజాతకులనీ స్పష్టమవుతుంది.

ఉత్తర హరివంశ ఆశ్వాసాంత గద్యలో సోమన రాసికొన్న దాన్ని బట్టి ఈయనకు సకల భాషా భూషణ, సాహిత్యరస పోషణ, సంవిధాన చక్రవర్తి, నవీన గుణ సనాథుడనే బిరుదాలున్నట్టు విదిత మవుతూ ఉంది.పద కవితా పితామహుడు సంకీర్తనాచార్యుడు, హరి సంకీర్తనాచార్యుడు, పంచమాగమ సార్వభౌముడు, ద్రావిడాగమ సార్వభౌముడు అనేవి విశేషణాత్మకంగా అన్నమయ్యకు బిరుద ప్రాయాలుగా వ్యవహారంలో ఉన్నాయి.

సోమన అన్నమయ్యల దృక్పథాన్ని ప్రధానంగా మత, భాషా దృక్పథాలని రెండు విధాలుగా వర్గీకరించుకోవచ్చు.మతం పట్ల, దేవతల పట్ల వారికి గల భావాల్ని మతదృక్పతం శీర్షిక కింద చర్చించవచ్చు.సోమన తిక్కన అడుగుజాడల్లో నడచినవాడు. హరిహరాద్వైత ప్రతిపాదకుడు.ఉత్తర హరివంశ ద్వితీయాశ్వాసంలో శ్రీకృష్ణుని తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమయినపుడు ఒకర్నిమరొకరి చేత కీర్తింప జేశాడు. హరిహర సమాన ప్రతిపత్తిని, అభేద ప్రతిపత్తిని ప్రతిపాదించాడు. అయితే ఉత్తర హరివంశ వస్తువుగా సోమన తీసికున్న ఆరుకథల్లోనూ కృష్ణపారమ్యమే (విష్ణుపారమ్యం)ప్రతిపాదింప బడింది. మీదు మిక్కిలి బాణాసురోపాఖ్యానంలో కృష్ణుని చేత శివుని భంగపాటును సున్నితంగా చిత్రించడం గమనించదగిన అంశం. అన్నమయ్యా విశిష్టాద్వైతి. పరమ వైష్ణవుడు పన్నిద్ద రాళ్వార్లను బాగా అధ్యయనం చేసి వాళ్ల ప్రభావానికి లోనైన వాడు. భగవద్రామాను జుల పట్ల విధేయత గల వాడు. ఆదివన్

శఠగోప యతి శిష్యుడు. "ఎనలేని తిరు వేంకటేశుడే దైవమని, వినగలిగినది గదా వినికి" (అధ్యాత్మ సంకీర్తనలు1-181)అని అనుకున్నవాడు. తన కీర్తనలన్నిటిలోనూ విష్ణుపారమ్యాన్ని ప్రతిపాదించిన వాడు. విశేషించి తన్మయంతో కృష్ణుని కీర్తించిన వాడు.

సోమన ఉత్తర హరివంశంలో శ్రీకృష్ణుని లీలల్ని అనేక చోట్ల కొని యాడాడు. ఋషుల చేత కూడా కీర్తింపజేశాడు శివ జ్వరం చేత రామావతార విశేషాల్నిచెప్పించాడు. హంస డిభకుల రాయబారి అయిన జనార్దనుని చేత కూడా శ్రీకృష్ణుడు చేసిన ఘన కార్యాల్ని ప్రశంసింప జేశాడు

అన్నమయ్య బాల్యాదిగా శ్రీకృష్ణ లీలల్ని పలుచోట్ల కొనియాడాడు. నరకాసుర, బాణాసుర వృత్తాంతాలను ప్రస్తావించాడు. రామావతార గాథను ప్రత్యేకించి పలుకీర్తనల్లో శ్లాఘించాడు. తక్కిన దశావతారాల్ని కూడా పేర్కొన్నాడు. సోమన తన ఉత్తర హరివంశంలో చక్రానికి దైవత్వాన్ని ఆపాదించి పౌండ్రకవధ ఘట్టంలోనూ బాణాసురోపాఖ్యానం లోనూ ప్రస్తుతించాడు. అలాగే అన్నమయ్య కూడా విష్ణు చక్రానికి విష్ణువు తరువాతి స్థానాన్ని కల్పించి సుదర్శనానుగ్రహార్థం పలుకీర్తనల్లో ప్రార్థించాడు.తన్మహిమను కొనియాడాడు.

సోమన అన్నమయ్య లిద్దరూ తమ రచనల్లో భక్తికి ప్రాదాన్య మిచ్చిన వాళ్లే భాగవతంలో ప్రతిపాదింపబడిన నవ విధ భక్తుల్లో సోమన ఆరిటిని, అన్నమయ్య ఎనిమిదిటిని ప్రస్తావించారు. సోమన ప్రస్తావించిన భక్తుల్లో సఖ్యభక్తి మినహా అన్నిటినీ అన్నమయ్య పేర్కొనడం గమనించదగి ఉంది.

**1.కీర్తనం:-** ఉత్తర హరివంశ కావ్యంలో దేవతలయిన శివకేశవులు, మహర్షులు చోటు చేసికొన్నారు. వీరిని కీర్తిస్తూ ఇతర పాత్రల చేత చెప్పించిన పద్యాలు కీర్తనా భక్తికి తావలాలు. ఉదాహరణకు శ్రీకృష్ణుడు శివుణ్ణి నుతించడం

సీ. "కల్హార మకరంద కలిత మందాకినీ లహరీ పరీత కోలాహలంబు
బాలేందు చంద్రికా పరభాగ శోభాప రాగ సంభావి తార గ్వధంబు
సేవా సమాసన్న సిద్ధ సీమంతినీ తాల వృంతో త్తాల తాండవంబు
కాత్యాయనీ దత్త కర్ణావతంసకర్పూర ఖండామోద పూరితంబు

గీ. మారుతంబు నా మీదట మలసి యాడ
గలుగు నొకొ నాకు నొక నాడు కన్నులార
శివుని జూచు పుణ్యంబను చింత నెఱయు
మొదలివేలుపు బొడ గంటి మ్రొక్క గంటి"

(ఉత్తర హరివంశం2-173)

అన్నమయ్య కూడా కీర్తనా భక్తిని ఇలా శ్లాఘించాడు.
``విందుల కుడుపు విష్ణు కీర్తనము
చందపు వైకుంఠ సంబళము"

(అధ్యాత్మ సంకీర్తనలు9-275)

**2. స్మరణం:-** కృష్ణుని పట్ల అర్జునుడు, జనార్దనుడు, ధర్మరాజాదులు ప్రదర్శించిన స్మరణభక్తి, శివుని పట్ల శ్రీకృష్ణ, హంసడిభకులు కనబరచిన స్మరణభక్తి సోమన రచనలో కనిపిస్తుంది.ఉదాహరణకు జనార్ధనుడు శ్రీకృష్ణుణ్ణి స్మరించడం.

సీ. ``యదుకులాంబుధి చంద్రు నానందమున జూచు
రామాది హిత చకోరముల లోన
దనుజారి పారిజాతము జేరి పొదిగొన్న
రాజన్య రాజ కీరములలోన
వసుదేవసుత సరోవరములో నోలాడు
సనకాది దివ్య హంసముల లోన
గోపాల నవపుష్ప గుచ్ఛంబు మూగిన
పరిచారికా ద్విరేఫములలోన

గీ. గలయ దొలు బాము నోములు గలవు గాన
సెలవు లేక జన్మంబులు చెడియె నాకు
మీద జన్మంబు గలుగ నిర్మించెనేని
కమలజుని పేర దాపటి కాల బొమ్మ."

(ఉత్తర హరివంశం 4-137)

భగవంతుని స్మరించవలసిన ఆవశ్యకతను తెలుపుతూ అన్నమయ్యకూడా అనేక రచనలు చేశాడు. స్మరణ భక్తి ఘనతను ఇలా వివరించాడు.

"ఎవ్వరు మనసులోన నిందిరేశు దలచిన
అవ్వల బాయక వుండునది యే వైకుంఠము"

(అధ్యాత్మ సంకీర్తనలు9-239)

**3. పాదసేవనం:-** కృష్ణుని దర్శించిన దుర్వాసుడు అతన్ని సేవించడంలో తనకు గల అభిలాషను వ్యక్తం చేశాడు కృష్ణ పాద సేవనాసక్తుడయిన. అతడు ప్రదర్శించిన భక్తి పాదసేవన భక్తి అని పేర్కొనదగింది. ఉదా||

శా. ``ఏగాదేనడతుం జతుర్ముఖునితోనిం ద్రాది దిక్పాలకుల్
మూగం బాఱి భవత్పదాబ్జ ములకుఁ మ్రొక్కంగ లేకున్నచో
నాగ న్వచ్చియు నాగజాలని ప్రతీహారు న్విడంబించుచుఁ
దాగం బోయి తలారి వాని యొదుర్రఁ దాగంగ నీ కేటికిన్"

(ఉత్తరహరివంశం4-92)

పాదసేవన భక్తిని శ్లాఘిస్తూ అన్నమయ్య పలుసంకీర్తనలు రాశాడు
`కైవల్యమున కంటె కైంకర్య మెక్కుడు
శ్రీ విభుడవు నీవు మాకుఁజిక్కే మర్మ మదివో"

(అధ్యాత్మ సంకీర్తనలు2-483)

అని పాద సేవనా మహిమను పలువిధాల కొనియాడాడు.

**4.వందనం:-** కృష్ణుని పట్ల బదరికాశ్రమ ఋషులు, ఈశ్వరుడు, దుర్వాసుడు వందన భక్తిని ప్రదర్శించినట్టు సోమన పేర్కొన్నాడు. ఉదాహరణకు శివుడు కృష్ణునికి నమస్కరించి నుతించడం.

సీ. ``ప్రణుతింతు నోన్నమో భగవతే వాసుదేవాయ నమో భక్తవత్సలాయ
సూర్యాత్మనే నమస్సోమా త్మనే నమః ప్రణవాత్మనే నమో బ్రహ్మణేన మోరుద్ర నామ్నే నమో విష్ణవే నమో మూల ప్రకృతయే నమో వసుంధ
రాది భూత గణాను హరి భాసే నమో మాయా మయాయనమస్సహస్ర

గీ. బాహూ నేత్ర శిరః పాద వస్త్రయేన

మో వషట్స్వ ధాస్వాహాత్మ మూర్తయే న

మః స్వభావ శుద్ధాయ నమః ప్రహరణ

ధారిణే నమో యనుచు నుదాహరింతు."

(ఉత్తర హరివంశం2-218)

వందనీయుడయిన పద కవితాపితామహుడు వందనా భక్తిని కొనియాడుతూ రచించిన కీర్తనలు అసంఖ్యాకం.

``మొక్కరో మీరు మోసపోక మీకు

దిక్కు దిశైన ఆదిదేవునికి."

(అధ్యాత్మసంకీర్తనలు11-2-62)

అని వందనా భక్తి సత్ఫలితాన్ని కూడా తెలియజేసి ప్రోత్సహించాడు.

**5. ఆత్మనివేదనం:-** కష్ట సమయాల్లో కుంగక, సుఖం ప్రాప్తించినపుడు పొంగక తనను భగవంతునికి సమర్పించుకొని తనను రక్షించే బాధ్యతను ఆయన కప్పగించి నిశ్చింతగా ఉండడమే ఆత్మనివేదనమని ఆర్యోక్తి. దీన్నే శరణాగతి అనికూడా అంటారు. ఇది మనో పరిపక్వం గల వాళ్లకు మాత్రమే సాధ్యమవుతుంది. కృష్ణోపదిష్ట మంత్రలబ్ధుడయిన అర్జునుడు సర్వాత్మనా అతన్నాశ్రయించినట్టు చెప్పుకున్నాడు. ఇది కృష్ణునికి తన ఆత్మను నివేదించుకొన్నట్టే అవుతుంది. ఉదా.

చం. ``అని పరమోప దేశముగ నానతి యిచ్చిన యంతనుండియు

న్వనజ దళాక్షు భక్త వత్సలు వేద శిఖావతంస పా

వన పద పల్లవుం ద్రిదిశ వల్లభ సేవితు నాశ్రయింతునా

మనమున ఘోర దుర్దశలు మట్టిన సంపద మిన్ను ముట్టినన్."

(ఉత్తర హరివంశం2-60)

తొలి తెలుగు వాగ్గేయ కారుడు కూడా తన రచనల్లో ఆత్మ నివేదనా భక్తిని ధ్వనింపజేశాడు. తన సర్వస్వమూ భగవంతునికే సమర్పణ మన్నాడు.

``వడని మా యంతరాత్మ విష్ణుడు మా
జాడ జన్మమ తనికి సమర్పణము"

``ముడి మా జీవన మెల్ల మాధవుడు
అతనికే మాభోగాలన్నియు సమర్పణము"

``కడిగి శ్రీ వేంకటేశు గతియే మాది
అడుగు మా పుణ్య పాపాల తని కర్పణము"

(అధ్యాత్మ సంకీర్తనలు11-1-88)

సోమన జన సామాన్య వ్యవహారంలో ఉండే సుందర తెలుగు పదాలకు, జాతీయాలకు, నానుడులకు కూడా అక్షరరూపం కల్పించాడు. అచ్చ తెలుగు పద్యాలు రాశాడు. నిరోష్ఠ్య రచన లాంటి చమత్కారాలెన్నో చేశాడు. శబ్దాలంకారాలకు, శబ్ద చమత్కృతులకు ఎక్కువ ప్రాధాన్య మిచ్చాడు. పౌరాణిక ఫక్కీలో సాగుతున్న తెలుగు సాహిత్య రచనను ప్రబంధోన్ముఖం చేసిన నవీన గుణసనాథుడని పించుకొన్నాడు.

అన్నమయ్య కూడా ఆంధ్ర సాహిత్యంలో అపూర్వమయిన, అనితర సాధ్యమయిన కొత్త పోకడలు ప్రవేశ పెట్టాడు. పద్యసంపదతో మాత్రమే పరిఢవిల్లే ఆంధ్ర భారతికి పద సంపదను కూడా సమకూర్చి సౌందర్యాన్ని బహుగుణాధికం చేశాడు. తొలితెలుగు వాగ్గేయ కారుడుగా ఆంధ్ర సాహిత్యంలో అద్వితీయ స్థానాన్నిఅలంకరించాడు. జానపదుల వాడుక భాషకు సాహిత్య గౌరవం కలిగించాడు.సామెతలు, జాతీయాలు, నానుడులు, నూతన పద బంధాలు మొదలయిన వాటిని తన సంకీర్తనల్లో వాడుకున్నాడు. లాలి పాటలు,జోలపాటలు, దరువులు మొదలయిన వాటిని తన కీర్తనల్లోనూ ప్రవేశ పెట్టాడు.

``వీణా గానము వెన్నెల తేట
రాణ మీరగా రమణుల పాట
ప్రాణమైన పిన బ్రాహ్మణు వీట
జాణలు మెత్తరు జాజఱ పాట "

అని వసంత విలాసంలో జాజర పాటలను గురించి సోమన ప్రస్తావిస్తే అన్నమయ్య జాజర పాటలనేకం రాశాడు.

సోమన, అన్నమయ్య లిద్దరి మీద కూడా పూర్వకవుల ప్రభావం బాగా ఉంది. ముఖ్యంగా తిక్కన ప్రభావానికి వీళ్ళిద్దరూ లోనయ్యారు. అల్పవాక్యాలతో అనల్పార్థాన్ని చెప్పడం, తేట తెలుగు మాటలతో రచన సాగించడం, పొడిపొడి మాటలను ఉపయోగించడం, నాటకీయ పద్ధతి నవలంబించడం, అర్థచిత్రాలను, శబ్దచిత్రాలను ఆవిష్కరించడం మొదలయిన అంశాల్లో ఈ కవి గేయకారు లిద్దరూ తిక్కనను అను కరించారు. `ఆంధ్రావళి మోదముంబొరయరాయడం, ఆంధ్ర సంస్కృతికి అద్దం పట్టడం వంటి వాటిలో కూడా వీళ్లిద్దరూ తిక్కన మార్గావలంబులే.

సోమన అన్నమయ్యల ప్రభావం తరువాతి కవుల మీద కూడా ఉంది రామరాజ భూషణుని వంటి ప్రబంధ కవులు వీళ్ల రచనల్లోని అమూల్యాంశాలను స్వీకరించి తమ రచనలకు ఇతోధిక శోభ చేకూర్చారు శ్రీనాథుడు, అల్లసాని పెద్దన, తెనాలి రామ కృష్ణుని వంటి మహాకవులెందరో సోమన రచనల వల్లప్రభావితులయ్యారు.క్షేత్రయ్య, త్యాగయ్య, రామదాసు వంటి వాగ్గేయ కారులు అన్నమయ్యవల్ల స్ఫూర్తిని పొందారు

సోమన అన్నమయ్యలు భిన్న కాలాలకు చెందినవాళ్లు. భిన్న ప్రక్రియలను స్వీకరించిన వాళ్లు. కడపజిల్లాలో భిన్న ప్రాంతాల్లో జీవించిన వాళ్లు అయినా ఇద్దరూ భగవద్భక్తులు. కృష్ణ పారమ్య ప్రవక్తలు సామాన్యుడి భాషను తమ ప్రతిభతో సాహిత్యస్థాయికి తీసుకు వచ్చిన వాళ్లు. భిన్నత్వంలో ఏకత్వం అనే మాటకు జీవం పోసిన వాళ్ళు.

(అన్నమయ్య శత జయంత్యుత్సవ సంచిక, 1989)

☆☆☆

# 15. తరువాతి కవులపై నాచన సోమన ప్రభావం

ప్రాచీనాంధ్ర కవుల్లో కవిత్రయం తర్వాత గణింపదగ్గ మహాకవి నాచన సోమన సోమన మహాకవి అనడానికి ఆయన్ను అనుసరించిన మహాకవులే పరమ ప్రమాణం. 'ఆపరితోషాద్విదుషాం నసాధుమన్యే ప్రయోగ విజ్ఞానమ్'అని కాళిదాసు తన ప్రయోగ విజ్ఞాన సాధుత్వానికి విదుషుల పరితోషమే ప్రమాణంగా చెప్పి ఉన్నాడు. ఈ మహాకవి వాక్కుల్ని సత్యాలు గావిస్తూ ఆంధ్ర కవులనేకులు నాచన సోమన కవితావిశేషాలకలరి ఇతన్ననుసరించి ఈయన ప్రయోగ విజ్ఞాన సాధుత్వాన్ని లోకానికి చాటి ఉన్నారు.

మధుకర మనేక పుష్పాలనుండి మధువును గ్రోలే విధంగా రసప్రియులయిన కవులు మహాకవుల గ్రంథాల్లో కనిపించే అపురూప సొబగులను, అనితర సాధారణ రచనా విశేషాలను గ్రహించి అలాంటి చమత్కారాలను తమ గ్రంథాల్లో చొప్పిస్తుంటారు. ఇలా చేయడం కవికెంత మాత్రం లాఘవాన్ని ఆపాదింపదు;కానీ అతని వ్యుత్పత్తి కొక నిదర్శనంగా ఉపకరిస్తుంది. అంతేగాక తాననుసరించిన కవికి ఒక ప్రశంశను అధికంగా చేకూరుస్తుంది.

తిక్కన రసాభ్యుచిత బంధానికి అపార ప్రజ్ఞావిలసితు డయిన సోమన అక్షరరమ్యతను చేకూర్చి తానొక నవ్య కవితా రీతికి మార్గదర్శకు డయ్యాడు. డ్రైడన్ (Dryden)మహాకవి ఒకచోట

"The force of Nature could no further go
To make the third,she joined the two"

అని చెప్పి ఉన్నాడు. ఆ విధంగానే నన్నయ భట్టారకుని అక్షరరమ్యత, తిక్కన సోమయాజి అర్థప్రౌఢి రెండూ నిండారి సోమనాథుని శైలిగా రూపొందాయి.

సోమన సీసపద్యపు నడకలో చూపిన వైవిధ్యం ప్రశంసనీయం. అనుప్రాసాలంకార ప్రియుడయిన సోమన పదరామణీయకత ఎందరి కవులకో ఆచార్య ప్రాయమయింది. కావ్య వస్తువుకు అలంకారాన్ని గూర్చే ఈతని కల్పనా చాతురి తరువాతి కవులనెందరినో సుశిక్షితులను చేసింది. హరిహరా భేద నిరూపణలో ఆయన ప్రవేశపెట్టిన అలంకార శ్లేష ఆంధ్ర కవులందరికీ శిరోధార్యమయింది.

సోమన తన ఉత్తరహరివంశంలో ముప్పయి విధాలయిన సీసపద్యపు నడకలను చూపి ఉన్నాడు. ఉదా||

``తరుణ పల్లవ రాగ తామ్ర విద్యుల్లతా భాసురంబగు జటా భారమెఱిగి"(2-174)

``లలిత విద్రుమలతా లావణ్యమగు జటా జూటంబు జిగురాకు జొంపమైన" (2-175)

`వెలదమ్ములో లేత వెన్నెలో యమృతమో కన్నులో చిఱునవ్వొ కనికరంబొ" (4-138)

``వడకు పన్నగ రాజు పడగల మీద సర్వం సహాకాంత పేరణము సూప" (4-216)

సోమన కవితా విశేషాలను గురించి రాస్తూ నడకుదుటి వీరరాజు పంతులు గారు``కవిత్రయములో నొకడగు శంభుదాసుడును, కవి సార్వ భౌముడగు శ్రీనాథుడును అనేక స్థలంబుల సోముని కల్పనలను, పదపద్యంబులను, భావంబు ననుకరించి యుండిరనిన నీతిని యౌత్కృష్ట్యముం గూర్చి వేఱ చెప్పనేల?" అని రాశారు. అందుకుదాహరణగా``- మకరందమాని మైమఱచిన గొనయంబు వెడమ్రోయు గడివోని వింటితోడ"(ఉత్తర హరివంశం2-194)అనేసోమన పద్యాన్ని, ``ముందటయెలమావి మొక్కల నలరింప కర్తదానగు చెలికాడు నడువ"(హరివంశం.ఉ.భా.6-64)అనే ఎర్రన పద్యాన్ని చూపారు.

వేలూరి శివరామ శాస్త్రిగారు సోమనను ఎర్రన అనుకరించాడని చెప్తూ ``ఇతని ననుసరించిన కవులు తమ తమ కలవడిన ప్రతిభతో నాయారీతుల గవితల వెలయించినారు"అని పేర్కొన్నారు.

ఇందుధరోపాఖ్యాన సందర్భంలోని సోమనపద్యమయిన ``కరిగిన పూత చేగనక కందుక కాంతి వెలుంగు చన్నులన్"(5-66)అనే దాన్ని ఎర్రన సీస పద్యమయిన ``క్షాళిత కస్తూరికములను కుచముల క్రీవల నఖపద శ్రీలు మెఱయ"(హరివంశం. ఉ.భా.7-84)అనే దాన్ని పేర్కొని ``నాచన సోమనాథు నెఱ్ఱా ప్రెగడ యనుకరించినను అనుకరింపని రీతి ననుకార్యము కంటె

నెక్కుడుగను వ్రాసినాడు "అని 'సోముడు' అనే గ్రంథంలో తెలియ జేశారు

భావంలోనో పద ప్రయోగంలోనో పద్యపునడకలోనో సమానమయిన పద్యాలే ఇద్దరి మహాకవుల గ్రంథాల్లో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు

సోమన-``కనిరికుమారులంత శశికాంత శిలాతల శీతలస్థలీ"
(ఉత్తరహరివంశం4-30)

ఎర్రన -``కనిరా పాతాళ మూలక్షత శిఖరిశిఖా కల్పితోత్తుంగ తీర
(హరివంశం ఉ.భా. 1-32)

మనోహర గమన విలాసాలతో ఒప్పు శ్రీనాథుని సీస పద్యం సోమన వల్లనే నడక నేర్చుకొన్నదంటే అతిశయోక్తి కాదు. సోమన సీసపద్యపు నడకలో ప్రవేశ పెట్టిన నూతన విధానాలన్నిటినీ శ్రీనాథుడు చేపట్టి రచించడమే గాక ఆ పద్యపు నడకకు పరిణతిని చేకూర్చాడు. కాబట్టి శ్రీనాథుని సీస పద్యాలపై సోమన ప్రభావముందని వేరుగా పోల్చి చూపవలసిన పనిలేదు. కొన్ని ఉదా. సోమన -``ఎవ్వడు రోరి తాను నొక యెక్కుడు వీరుడపోలే రాత్రిమై" (3-43)

శ్రీనాథుడు-``ఎవ్వడు రోరి నీవు నాయెదుర బారు"(హరవిలాసం7-50)

సోమన-``వడకు పన్నగరాజు పడగల మీద సర్వం సహాకాంత పేరణము సూప"(4-216)

శ్రీనాథుడు- "పాదాభి ఘాత సప్త పాతాళముల తోడ నుర్వీకటహము ఘూర్ణితలూగ" (కాశీఖండం5-130)

సహజ కవితా రాముడని పేరు గాంచిన బమ్మెర పోతనపైసయితమీ సోమన ప్రభావం కనిపిస్తుంది. ఉదా॥

సోమన -``అరిజూచు్ర హరిజూచు జూను కములందంద మందార" (1-162)

పోతన -``పరజూచున్ వరు జూచు నొంప నలరింపన్ రోష రాగో దయా"
(భాగవతం-దశమ స్కందం-ఉ.భా.178)

సోమన-``తంత్రీ వినోదంబు తడవు సైపని వ్రేళ్ల గొనయంబు తెగలపై గోరు కొనుట"(1-161)

పోతన-``రాకేందు బింబమై రవిబింబమై యొప్పు నీరజాతేక్షణ నెమ్మొగంబు" (భాగవతం-దశమ స్కందం-ఉ.భా.183)

సాధారణంగా యుద్ధాది వర్ణనల్లో అంత్యానుప్రాసను పాటిస్తూ రెండు రెండు క్రియలను జంటలు జంటలుగా వాడడం సోమన చేసిన వైచిత్రి. ఈ మార్గాన్ని వచనంలో ఎక్కువగావించడం వల్ల వర్ణనలు సైతం పాఠకులకు విసుగు పుట్టింపవు. కొన్ని తావుల్లో ముక్తపదగ్రస్తం, యమకం జతకట్టు కొని రావడం వల్ల ఆవచనం పాఠకులకింపు గూర్చుతుంది. ఇలాంటి రామణీయకతను వచనంలో కూర్చడానికై పోతనాదులు ప్రయత్నించి వచన స్వరూపానికొక సమగ్రతను చేకూర్చారు. సోమన వచనానికి ఉదా|| ``................నిరువురు మెయిమలంచి పాసియు డాసియు దట్టియు బట్టియు హత్తియు........................"(3-64)

పోతనకు సమకాలికుడైన పిల్లలమర్రి పినవీరభద్రుడు కూడా నాచన సోమన పద్యాలను అనుకరించాడు. ఉదాహరణలు.

సోమన -``మనుజాసనులటబలులట, మునులట యాగంబులట" ................ (1-94)"

వీరభద్రుడు -``ముని కన్యక యట నేనట,వనమున గాంధర్వమున వివాహం బట (శృంగార శాకుంతలం4-114)

సోమన-``........నమో విశ్వ సృజే, వినమింతకు మున్నెన్నడు !"(1-94)

పిన వీరభద్రుడు-``అంటితి నమశ్శివాయ పాపాత్మురాలి" (జైమినీ భారతం)

సింహాసన ద్వాత్రింశిక కర్త అయిన కొరవి గోపరాజు పైన కూడా నాచన సోమన ప్రభావం కనిపిస్తుంది. ఉదా||

సోమన-``పన్నగంబుల రాజు బగ వాడు గూడి నీ శయనంబుబయనంబు సంతరింప"(1-119)

గోపరాజు-``మున్నీటి పాపయు మున్నీటి తేపయు నిల్లాలు నిల్లునై యెసగువాని"(సింహాసన ద్వాత్రింశిక2-138)

సోమన``- ఒకనాడిందుధరుండు బార్వతి.యు లీలోద్యాన కేళిసరి". .....(5-47)

గోపరాజు``-ఒకనాడిష్ట సఖుండు దాను ఫలపుష్పోపార్జనా సక్తితో"...................(సింహాసన ద్వాత్రింశిక5-108)

పెదపాటి సోమయ రచన అయిన `శివజ్ఞానదీపిక'లో నాచన సోమన శైలినను కరించిన పద్యాలున్నాయి. ఉదా||

సోమన -`` అభ్రంక షంబైన యాల పోతు నితండు త్రుంచి నాడీతండు పెంచినాడు" (2-180)

సోమయ ``- బవరాన సూతుడై పార్థున కాతండు నచ్చినాడీతండు మెచ్చినాడు" (శివ జ్ఞాన దీపిక) ప్రబంధ రత్నాకరం - 509

ముమ్మయ జైతరాజు `విష్ణు కథానిధానం'లో నాచన సోమనను అనుకరిస్తూ రచన గావించినట్లు గోచరిస్తుంది. అందులో ప్రధానంగా-

``కమలజాతమ్ముడు గొమరుండు గూడి నీమూర్తియు గిర్తియుమాదలింప" (విష్ణు కథానిధానం) ప్రబంధ రత్నాకరం -379

అనే పద్యంలో ``పన్నగంబుల రాజు పగవాడు గూడి "(1-119) అనే నాచన సోమన పద్య ప్రభావం ఎక్కువగా గోచరిస్తుంది.

తులసి బసవయ్య రచించిన `సావిత్రి కథ 'లో దేశాల పేర్లను తెలియ జేసే "సౌవీర మగధ కోసల భోసల పుళింద లాట కేరళ మహా భోటచోట" (సావిత్రి కథ) ప్రబంధ రత్నాకరం -335 అన్న పద్యం సోమన ఉత్తర హరివంశం లోని

"పాంచాల పాండ్య బర్బర కిరాతా భీరకురు విదేహ విదర్భ కుకుర గౌళ" (5-142) అన్న పద్యాన్ని తలపింప జేస్తున్నది.

నిశ్శంక కొమ్మయ పైన కూడా నాచన సోమన ప్రభావం కనిపిస్తుంది. ఉదా||

సోమన``- దైతేయమదవతీ ధమ్మిల్లములతోడ విరుల నెత్తావికి వీడుకోలు" (3-147)

కొమ్మయ``- దైతేయకాంతల తళుకు గెమ్మోవుల విటికాశ్రీలకువిడుకోలు" (వీర మాహేశ్వరం)

సోమన ఉత్తర హరి వంశంలో ఇందు ధరోపాఖ్యాన సందర్భంలో జలక్రీడా వర్ణన విధానాన్ని పురస్కరించుకొని హరిభట్టు తన నారసింహ పురాణం' ఉత్తర భాగంలో కొన్ని పద్యాలను రచించి ఉన్నాడు. ఉదా||

సోమన``- తెరలెత్తి సప్త సాగరములు బొరలంగ వరుణుండు గొండిలి పరిథవింప"(4-216)

హరిభట్టు``-దంష్ట్రావిటంక సంతతి వహ్నికణములు గుమురులై నలు గడ గొండ్లిసూప(నారసింహపురాణం ఉ.భా.4-114)

చేమకూర వేంకటకవి కూడా తన విజయ విలాసంలో' సోమన శైలిని అనుసరించాడు. ఉదా||

సోమన``-తలపునకు జక్కనుండెడి తలపులేదు లజ్జబో ద్రోవ లజ్జకు లజ్జలేదు. (5-115)

వేంకటకవి- ``సిగ్గుకు సిగ్గులేదిటులే సేసిన పిమ్మట నుండవచ్చునే" (విజయ విలాసం2-30)

నాచన సోమన యుద్ధవర్ణనల్లో ఉపయోగించిన వచన రచనను తలపింప జేస్తూ గౌరన హరిశ్చంద్రో పాఖ్యానంలో ద్విపద పాదాలను రచించాడు ఉదా||

సోమన``- ఇట్లు ముందటందలపడిన యదు వృష్ణి బలంబులకు భయం కరుడై...................నరదంబులనరదంబులతో నంటసిల నడచుచు దురగంబులతో దుత్తుమురుగాదూటుచూ దంతావళంబుల దంతావళంబులతో దలలు వగులం దాటించుచు వీరుల వీరులతో విట తాటంబుగా విఱుగ ద్రేయుచున్.......... ....' (4-261)

గౌరన- "అలబలంబుగ జొచ్చి యురటుల వ్రచ్చి
రావుల గొట్టి వారణముల గట్టి"

(హరిశ్చంద్రో పాఖ్యానం 1874-84)

మహాకవులని పేరెన్నిక గన్న ప్రబంధ కవులపై సైతం నాచన సోమన ప్రభావం కనిపిస్తుంది పెద్దన మను చరిత్ర లోని వర్ణనలు సోమన వర్ణనలను పోలి ఉన్నాయి. ఉదా||

సోమన``- కనిరి కుమారులంత శశికాంత శిలాతల శీతల స్థలీ "(4-30)

పెద్దన``- అటజనిగాంచె భూమి సురుడంబర చుంబి శిరస్సర ఝరీ"(మను చరిత్ర2-3)

సంగీత కళా రహస్య నిధి అయిన రామరాజభూషణుని మీద కూడా సోమన ప్రభావముంది. వసు చరిత్ర లోని పలు పద్యాలు సోమన పద్యాలను తలపింప జేస్తాయి ఉదా||

సోమన``-ఆకాశ గంగ నీయదుగున బొడమె నీకిట్ల ర్ఘ్య పాద్యంబు లిచ్చు టెంత"(2-115)

రామరాజ భూషణుడు``-అతుల శైవ లవతీ శతము లీనెడు మీకు నాయిచ్చు విమలార్ఘ్య తోయ మెంత"(వసు చరిత్ర2-122)

సాంబోపాఖ్యానంలో రామరాజు రంగప్ప రాజు కథాకల్పనలో, సన్నివేశ ఘటనలో, వర్ణనల్లో పూర్తిగా నాచన సోమనను అనుకరిస్తూ రచన గావించాడు రంగప్ప రాజు కృత్య వతారికలో ``అభినందన సహస్ర మమరించి నన్నయ భట్టు మార్గము కొంత పరిఢవిల్ల" అని రచించాడు. కానీ భావంలో, పద ప్రయోగంలో, శైలిలో సోమనను అనుకరించి రచన గావించినట్టు తెలుస్తుంది. ఉదాహరణకు.

సోమన``- ఆకాశ గంగ నీయదుగున బొడమె నీ కిట్లర్ఘ్య పాద్యంబులి చ్చుటెంత" (2-115)

రంగప్ప రాజు``-కలశాంబు నిధిలోల వలమాన కల్లోల యతకేలి కేనీటి యర్ఘ్యమీగి" (సాంబో పాఖ్యానం3-199)

విష్ణుమాయా నాటక కర్త అయిన చింతల పూడి ఎల్లనార్యుడనే రాధా మాధవ కవి సోమన నుకరించాడు. ఉదా||

సోమన``-హలపాణి ప్రథము డాహవశాలి సాత్యకి నేను రెండవ వాడ నిట్టి వాడ" (4-200)

ఎల్లన``-కౌరవాధీశోరు కాంతద్వయ ద్రోహి పటుగదా హస్తుండు పవనజుండు"(విష్ణుమాయా నాటకం1-52)

ఆంధ్ర భవిష్య పర్వంలో మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు శ్రీ కృష్ణుడు బదరికాశ్రమానికి వెళ్లినప్పటి వర్ణనలోనూ, ఘంటాకర్ణాదుల్ని వర్ణించేటప్పుడూ హంస డింభకో పాఖ్యానంలోనూ ఉత్తర హరివంశ శైలిని అనుకరించారు. ఉదా||

సోమన``-సంయమీశ్వర దత్త సంధ్యార్ఘ్య జలబిందు జాలంబు నక్షత్ర సమితి గెలువ"(2-111)

మల్లాది వారు``- మునుల యర్ఘ్యాగ్ర్య నార్థనముతో శుక శారికా కోకిల ములు స్వాగతము చెప్ప"

(ఆంధ్ర భవిష్యపర్వం4-43)

సోమన``- వికృతాననంబులు విరళదంతంబులు నిడుపైన దౌడలు నిక్కు మెడలు" (2-122)

మల్లాది వారు``-పాఱు పండ్లును గునపాల కోఱలు తాటిపట్టె నాల్కల నెఱ్ఱమిట్ట గ్రుడ్లు"

(ఆంధ్ర భవిష్యపర్వం 4-59)

నాచన సోమన తన గ్రంథంలో సామెతలు, పలుకు బళ్లను పయోగించి ఆ గ్రంథాని కొక సహజత్వాన్ని చేకూర్చాడు. దీన్ని ఒజ్జ బంతి గా గ్రహించి రఘునాథ తొండమానుడు పార్వతీ కళ్యాణం లోనూ తెనాలి రామకృష్ణుడు

పాండురంగ మాహాత్మ్యంలోనూ ముద్దుపళని రాధికా సాంత్వనంలోనూ పలు సామెతల్ని చెప్పించారు

సోమనను అనుకరించిన వాళ్లు సామాన్యులు కారు. ఆయా కాలాల్లో దిగ్గంతులుగా పరిగణింపబడిన కవివతంసులు. అలాంటి వాళ్లు సోమన కవితా రామణీయకతకు అలరి వాళ్ల వాళ్ల అభిరుచుల్ని పురస్కరించుకొని ఆయన్ను అనుసరించారు.ఇలా నాచన సోమన ఇందరి కవులపై తన ప్రభావాన్ని ప్రకటింప జేస్తూ, అజరామరుడయి తెలుగు సాహిత్య ఆకాశంలో వెలుగు తున్నాడు.

`(నాచన సోమనను కరించిన కవులు'అన్న శీర్షికతో నవభారతి, మే 1980 సంచికలో ప్రచురితం.)

★★★

# 16. ఆంధ్ర వాఙ్మయంలో నాచన సోమన స్థానం

లోక గతి చిత్ర మయింది కొన్ని సందర్భాల్లో కవిని బట్టి కావ్యానికి గౌరవం మరికొన్ని సందర్భాల్లో కావ్యాన్నను సరించి కవికి ప్రసిద్ధి కలుగు తుంటాయి. కవికి కావ్యానికి సమ ప్రాధాన్యం చేకూరడం ఎంతో అరుదు. తెలుగు సాహిత్యంలో నన్నయ, తిక్కన, శ్రీనాధ, పోతన, తిరుపతి వేంకట కవులకు మాత్రమే అలాంటి గౌరవం లభించిందనడం సత్య దూరం కాదు.

ఆంధ్ర కవి రత్నహారంలో కొంగొత్త వన్నెలీనుతూ చూపరుల కన్నులకు మిఱుమిట్లు గొలిపే వినూత్న పతకం నాచన సోమన. వాఙ్మయాకాసం లో విశిష్ట తేజంతో అలరారే సరికొత్త నక్షత్రం ఉత్తర హరివంశం సోమన స్థానాన్ని గుర్తించడంలో పండిత విమర్శకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసికోవడం సమంజసం.

ఆంధ్ర సాహిత్యాన్ని ఆపోశనం పట్టిన కందుకూరి వీరేశలింగం పంతులు గారు ఆంధ్ర కవుల చరిత్రలో ``-ఒక ఎఱ్ఱాప్రెగడ కవిత్వమే గాదు భారతమును రచించిన కవిత్రయములో అనేకుల కవిత్వమును కొన్ని విషయములలో సోముని కవిత్వముతో సరిరాదు" అని నిగ్గు దేల్చారు.

బహుగ్రంథ పరిశోధకులు, నిత్యసత్య ప్రవచనులు, నిఘంటు వ్యాకరణ నిర్మాతలు అయిన బహుజన పల్లి సీతారామా చార్యులు గారు- "ఇది మిక్కిలి ప్రౌఢముగను, భారతము కంటె నెల్ల విధముల విశేషించినదిగా కానంబడుచున్నది." అని ఉత్తర హరివంశాన్ని శ్లాఘించారు

వచన రచన కాద్యుడు, తెలుగున కొక చక్కని వ్యాకరణ దీపాన్ని వెలిగించిన పరవస్తు చిన్నయసూరిగారు``అలికంబున యక్షినిడాచిన సర్వజ్ఞుడ"ని సోమనను నుతించి ఉండడం గుర్తింప దగింది.

హరిహరతత్త్వానికి మారు పేరుగావెలసిన వేంకట పార్వతీశ్వర నామధారులయిన కవి వరేణ్యులు `సర్వోన్నతి దెచ్చె సోముడని' నీరాజనం పటారు.

ప్రాచీనులయిన కవులను చూస్తే అవతారికా భాగంలో పూర్వకవిస్తుతి సందర్భంలో కవిత్రయానంతరం సోమనను కీర్తించిన వాళ్లనేక మంది కనిపిస్తున్నారు. పిల్లల మఱ్ఱి పిన వీర భద్రుడు, కొఱవి గోపరాజు, వెన్నెలకంటి సూరన, ఎడపాటి ఎర్రన, కొటికలపూడి సోమనాధ కవి, అయ్యల రాజు రామ భద్రుడు, భానుకవి, బైచరాజు వేంకట నాధుడు, రామరాజ భూషణుడు, మొల్ల, ప్రౌఢకవి మల్లన, ఆంధ్ర కవి రామయ్య, దామెర్ల వేంగళ నాయకుడు, ముద్దు పళని, కనుపర్తి అబ్బయా మాత్యుడు, నూతన కవి సోమన, పిండి ప్రోలు లక్ష్మణ కవి, అప్పకవి మొదలయిన వాళ్లు సోమనను నుతించినట్టు `కావ్యా వతారికలను'గురించి విశేష పరిశ్రమ చేసిన డా॥ జి. నాగయ్య గారు తెలియ జేశారు. వాళ్లలో కృష్ణ కవి "సోము నన్నప తిక్కన సోమయాజి"అని సోమనకు ప్రథమ తాంబూల మిచ్చారు. అప్పకవి "సకల విద్యా సనాథ కవీంద్రు కొనియాడి" అని అంజలి ఘటించాడు రామరాజ భూషణుడు బహు ళాంధ్రో క్తిమయ ప్రపంచమున సోమనకు ప్రథమ స్థానమిచ్చి గౌరవించి ఉన్నాడు

"ఋషివంటి నన్నయ రెండవ వాల్మీక.......................................ఒకడు నాచన సోమన్న ఉక్కివుండు"-అని విశ్వనాధ సత్యనారాయణ గారు `ఒకడు నాచన సోమన్న' అనే గ్రంథంలో గురుస్మరణ గావించారు. ఇలాకవుల నేకుల చేత నుతింప బడడం సోమన స్థానాన్ని తెలియజేస్తుంది.

కావ్యం రాయడం ఒక ఎత్తు. కవి వృషభులు కీర్తించడం ఇంకొక ఎత్తు. లాక్షణికులు లక్షణ నిక షోపలంలో నిగ్గు దేల్చడం మరొక ఎత్తు. బమ్మెర పోతనామాత్యుడు పండిత పామర రంజకంగా భాగవతాన్ని రచించినా లాక్షణికామోదాన్ని పొందలేక పోయాడు. సోమన పద్యాలు అలాగాక అప్పకవీయంలో, ఆనంద రంగరాట్ఛందంలో, సర్వలక్షణ సార సంగ్రహంలో, ద్విరేఫ వర్ణ దర్పణంలో ఉదాహరింప బడిఉన్నాయి. ఇవి సోమన స్థానాన్ని మరికొంత ఔన్నత్యంలో నిలుపుతున్నాయి.

1. **కవితావిశేషాలు** :- కవితలను మూడు విధాలుగా వర్గీకరింపవచ్చు.అవి భావప్రధానం, వస్తుకళాత్మకం, రచనాత్మకం భారతాంధ్రీ

కరణం నాటికి మూడు పద్ధతులూ ఏర్పడ్డాయి సోమన వీటిలో రచనకు ప్రత్యేక స్థానాన్ని కల్పించి విస్తరింపజేశాడు కాబట్టి ఈయన నవీన గుణ సనాథుడు కాగలిగాడు. అలంకార సంప్రదాయాల్లో చమత్కార సంప్రదాయమొకటి ప్రాచీనాలంకారికుల్లో ఇది ఖద్యోత కాంతి వలెనుండగా ప్రకాశానికి తెచ్చినవాడు విశ్వేశ్వరకవి పండితుడు ఇతడు సోమనకు సమకాలికుడు కావడం గుర్తింపదగింది. ఈ చమత్కార సంప్రదాయాన్ని సోమన విస్తరింపజేశాడు. సరసత్వం కన్నా చమత్కారానికి ప్రాధాన్యమిచ్చే పద్ధతి నాచన సోమన వల్ల ఆంధ్ర వాఙ్మయంలో ప్రాచుర్యం పొందింది అరుద్ర గారు- ``ఈ పుస్తకము సోమన వ్రాయడం వల్లనే మన సాహిత్యము పురాణ ధోరణి నుండి ప్రబంధ ఫక్కికి మారినది. దీనికంత కారకుడు సోమన. దీని మంచి చెడ్డల కీర్తి పూర్తిగా ఆయనదే"అని తెలియ జేశారు.

**1.1 అనుకరణం:-** అనుకరణం సర్వ మానవ సహజం వేష భాషాదుల్లో వలె కవితలోనూ అనుకరణముంది. అది కొన్ని సందర్భాల్లో గౌరవ హేతువు. మరికొన్ని సందర్భాల్లో స్వసామర్థ్య విహీన సూచకం. ఒకచోట ఔన్నత్యాన్నాపాదిస్తే మరికొన్ని చోట్ల న్యూనత్వాన్ని తెచ్చిపెడ్తుంది. సోమన తిక్కన శిష్యుడు. తిక్కన కవితా సంస్థను విస్తరింపజేసిన వాళ్లలో కేతన తరువాత పేర్కొదగిన వాడు సోమన. ఆంధ్రీకరణ విషయంలో తిక్కన పద్ధతికి స్థిరత్వాన్ని కల్పించిన ఘనత సోమనదే అవుతుంది. హరిహరనాథుణ్ణి ఆరాధించడం అనే పద్ధతిని విస్తరించిన మహాకవి నాచన సోమన.

1.1.1. **కథానుకరణం :-** ఉత్తర హరివంశంలోని ఊర్వశీ నరక సంవాదానికి ప్రతిగా వరూధినీప్రవర సంభాషణం (మనుచరిత్ర) రంభారావణసంవాదం (కంకంటి పాపరాజు ఉత్తర రామాయణం) లాంటివి ప్రాముఖ్యంతో, కొన సాగింప బడ్డాయి, కృష్ణకవి సాంబోపాఖ్యానంలో జాంబవతి వరం కోరగా పరమశివుని దగ్గరకు కృష్ణుడు వెళ్లినట్లు వర్ణింపబడింది. ఇలాగే హంసడిభకోపాఖ్యానంలోని వేట వర్ణన తరువాతి ప్రబంధ కవులకు మార్గదర్శకమయింది.

**1.1.2. పద్యానుకరణం :-** ఆహ్లాదాన్ని గూర్చేది ఛంధం ఛందమంటే నియమం లయ విన్యాసాన్ని బట్టి పద్యం గతి మారుతుంటుంది సోమన పద్యం గతి వినూత్నం ఈయన పద్యాల ననుకరించిన కవులు సామాన్యులు కారు. ఆయా కాలాల్లో దిగ్గంతులుగా పరిగణింప బడిన కవివతంసులు వీళ్లను కరించిన కొన్ని సోమన పద్యాలు.

సోమన :- "-వడకు పన్నగ రాజు పడగల మీద సర్వం సహా కాంత పేరణము సూప"(4-216)

శ్రీనాధుడు :- "-పాదాభి ఘాత సప్త పాతాళముల తోడ నుర్వీ కటాహము ఝ్ఝాత లూగ(కాశీ ఖండం5-130)

సోమన :- "- అరిజూచుఁ హరిజూచుజూచుకములందందంద మందార" (1-162)

పోతన:- "- పరుజూచుఁ వరుజూచు నొంపనలరింపన్ రోష రాగోదయా"(భాగవతం-దశమ స్కందం. ఉ.భా 178)

సోమన:- "-మనుజాశనులట, బలులట, మునులట, యాగంబులట నమో విశ్వ సృజే" (1-94)

పిన వీర భద్రుడు:- "- మునికన్యక యట నేనట వనమున గాంధర్వమున వివాహంబట" (శృంగార శాకుంతలం4-114)

సోమన:- "-పన్నగంబుల రాజు బగవాడుగూడి నీశయనంబు బయనంబు సంతరింప"(1-119)

కొఱవిగోప రాజు:- "-మున్నీటి పాపయు మున్నీటి తేపయు, నిల్లాలు నిల్లునై యొసగు వాని" (సింహాసన ద్వాత్రింశిక2-138)

సోమన.- "-ఆకాశ గంగ నీయడుగున బొడయె నీ కిట్లర్ఘ్య పాద్యంబు లిచ్చుటెంత" (2-115)

రామరాజ భూషణుడు.- "-ప్రాలేయ నిలయ సంభవము గావించిన

మీకు బన్నీటు నొనరించుఁ బాద్యమెంత"(వసుచరిత్ర2-122)

సోమన:-``- ధనదాంతఃపుర తారహారములు యాదః పాలబాలా మన" (1-17)

రామరాజు రంగప్పరాజు:- ``- దనుజాంతఃపుర తారహార లతికా ధాత్రంబు గోత్రారి" (సాంబో పాఖ్యానం1-171)

సోమన:-``- ఈ కమండలు పఙ్క్తి నెటు చూతు నిట్ల తత్సాప మస్తంబులు వగుల కున్న 4-102)

మల్లాది సూర్య నారాయణ శాస్త్రి:- ``- బలి మర్దనా చూడు బ్రహ్మ దండంబులు విరిచిన హస్తముల్ విరిగి పోను. (ఆంధ్ర భవిష్య పర్వం 6-83)

**1.2. చిత్ర కవిత్వం :-** చిత్ర మంటే ఆశ్చర్యం. వింత గొలిపే రీతిగా పద్య రచన సాగించడమంతా చిత్ర కవిత్వంలో చేరుతుంది. సోమన రచనలో నిర్గోష్ఠ్య పద్యాలున్నాయి.``చని చని కాంచె నంత ఋషి సంహతి సారసకేసరాంతరా." (1-106) ఇక్కడ ఓష్ఠ్య వర్ణాలయిన ప-ఫ-బ-భ లనే గాక అచ్చులను కూడా విడిచి పెట్టడం సోమన పాండిత్యానికి తార్కాణం. నిరోష్ఠ్యంగా కావ్యం రాయబూనిన వాళ్లు కూడా ఈ నియమాన్ని నిర్వహింపలేక హల్లులకు మాత్రమే ఈ నియమాన్ని పాటించి రచన చేశారు. ఇలాగే పాల్కురికి సోమన రచనల్లో కనిపించే అచ్చతెనుగు పద్యరచనను నాచన సోమన విస్తరింప జేశాడు. ఉదా॥ ``తొలుకారు మెఱుగుల తోటలో నాడెడు రాయంచ కొదమతో రాయజాలి "(2-171), ``ఏనికతోలు పచ్చడము, నెమ్మలగుబ్బసరంబు, నంప పూదేనియ.........."(2-172)-అచ్చ తెలుగు కావ్యాలు విలసిల్లడానికి సోమన కరదీపిక చూపాడనవచ్చు. ఇంకా కఠిన ప్రాసలను గ్రహించి రచన సాగించడంలో కూడా ఇతడాద్యుడని చెప్పవచ్చు. తిరుపతి వేంకట కవులు `రజ్వ'ప్రాస సోమన కవిత్వంలో తప్ప ఇప్పటి దాకా ఎవరి కవిత్వం లోనూ చూసిన జ్ఞాపకం లేదని తెలియ జేసి ఉన్నారు. ఇంకా ష్ట, ల్గ, జ్య మొదలయినవి.ఈపద్ధతి నాధారంగా కవి సార్వ భౌముడయిన

శ్రీనాథుడు కఠిన ప్రాసలను నల్లేరుపై బండివలె సాగించాడు

ఆంధ్ర సాహిత్యంలో సోమన స్థానాన్ని తెలిసి కోవాలంటే అతనికి పూర్వమున్న కవులను గురించి తెలిసి కోవలసి ఉంది నన్నయ, తిక్కన, ఎర్రనలను సోమనకు పూర్వకవులుగా పేర్కోవచ్చు.ఇంకా నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథాదులు కూడా ఉన్నారు. కవిత్రయం వారికి ఆంధ్ర దేశంలో ప్రశస్తి కలగడానికి కారణం వారివారి కవితా వైశిష్ట్యమే గాక వారు భాషాంతరీ కరించిన గ్రంథప్రాశస్త్యం కూడా గొప్ప కారణం. ఆ కవుల వైదుష్యం, రచనా చాతుర్యం వారి కవితా వస్తువుకు బంగారానికి పరిమళ మబ్బినట్లు చేశాయి

నాచన సోమన పెక్కు గ్రంథాలను రచించినప్పటికీ, కావ్య వృత్తం, కావ్యరచనా చమత్కారం కారణాలుగా ఉత్తర హరివంశం మాత్రం నిలిచింది. శరీర సౌష్ఠవం లేని స్త్రీకి నవరత్న భూషణాదుల వల్ల ప్రయోజనం లేనట్టు కావ్యాలు సందేశ. ప్రధానాలు, ఆనంద దాయకాలు కానట్టయితే వాటి ప్రయోజనం నామ మాత్రమే. పెంచుకల దిన్నె శాసనానికి సంబంధించిన సోమన వ్యక్తిత్వం కూడా గొప్పదనే చెప్పవసిఉంది.అందులో అతడు ఆపస్తంభ సూత్రుడుగా, భారద్వజస గోత్రుడుగా, సకలాగమ వేదిగా, అష్ట భాషా కవిత్వ శ్రీయుతుడుగా విఖ్యాతుడయ్యాడు. బుక్కరాయలు తనకిచ్చిన గ్రామాన్ని110భాగాలు గావించి అందు 36 భాగాలను మాత్రమే తానుగ్రహించి తక్కిన భాగాలను సోమన ఆయా బ్రాహ్మణుల కివ్వడమే ఇందుకు సాక్ష్యం. వ్యక్తిత్వం లోనూ, వాఙ్మయ క్షేత్రంలోనూ ప్రసిద్ధుడుగా అందరి చేత జోహార్లందుకోవడం నాచన సోమన ప్రత్యేకత. కవిసమ్రాట్ విశ్వనాధ సత్య నారాయణగారు సోమనను `ఒకడు నాచన సోమన్న ఉక్కివుండు'అని ఏకైక నాధునిగా `ఒకడు నాచన సోమన్న'అనే తన గ్రంథంలో అభివర్ణించి ఉండడం గమనార్హం.

★★★

# ఉపయోగ పడిన పుస్తకాలు


అధ్యాత్మ సంకీర్తనలు- అన్నమాచార్యులు, తాళ్లపాక
అన్నమయ్య-ఆళ్వారులు - డా|| మునింత్నం, జె
(తులనాత్మక పరిశీలన)
ఉత్తర హరివంశము - సోమన, నాచన.
ఒకడు నాచన సోమన్న- సత్య నారాయణ, విశ్వనాథ.
తిక్కన సారస్వత మూర్తి-కోదండ రామిరెడ్డి, మరుపూరు
(కవితాశిల్ప విలసనము - పదబంధసౌరభము)
తెలుగులో హరివంశములు-డా|| యశోదారెడ్డి, పి.
నాచన సోమన-అన్నమయ్య-డా|| గోవిందస్వామి నాయుడు, యం.
నాచన సోమన భక్తి తత్త్వం ----------------------
నాచన సోమనాథుడు - డా|| కామేశ్వరరావు, వేదుల.
(కావ్యాను శీలనము)
నిర్వచనోత్తర రామాయణము - తిక్కన సోమయాజి
విమర్శ తరంగిణి - వీరరాజు పంతులు, నడకుదుటి.
శ్రీ తిక్కయజ్వ హరిహరనాథ తత్త్వము - నీలకంఠ శాస్త్రి, ఓరుగంటి.
శ్రీ మదాంధ్ర మహాభారతము - తిక్కన సోమయాజి.
శ్రీ మహా భాగవతము - పోతన, బమ్మెర.
సోమసుతు-శివరామ శాస్త్రి, వేలూరి.
హరివంశము - ఎర్రాప్రెగడ.


★★★